అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

మంగళవారం 14-3-2023 సమగ్ర తెలుగు దినపత్రిక


'ఎవ్రీథింగ్ ఎవ్రీవేర్ ఆల్ ఎట్ వన్స్' చిత్రబృందం

సంపుటి : 9 | సంచిక : 72 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | www.navatelangana.com | 10 పేజీలు | వెల : 6.50

దద్దరిల్లిన పార్లమెంట్



అదానీ వ్యవహారంపై ప్రతిపక్షాలు

- రాహుల్ వ్యాఖ్యలపై అధికార బీజేపీ
- వాయిదాల పర్వంలో ఉభయ సభలు
- లోక్‌సభలో రాజమండ్రి మాజీ ఎంపీ, సినీనటి జమునకు నివాళి

న్యూఢిల్లీ : అదానీ వ్యవహారం, కేంద్ర ఏజెన్సీల దుర్వినియోగం, లండన్‌లో రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై పార్లమెంట్ ఉభయ సభలు దద్దరిల్లాయి. అదానీ వ్యవహారం, కేంద్ర ఏజెన్సీల దుర్వినియోగంపై ప్రతిపక్షాలు వెల్‌లోకి దూసుకెళ్లి ఆందోళన చేపట్టగా, రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై అధికార బీజేపీ నిరసనకు దిగింది. రెండో విడత పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి. దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతున్నదంటూ కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ గతవారం లండన్‌లో చేసిన వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పాలంటూ ఇటు లోక్‌సభలోనూ, అటు రాజ్యసభలోనూ అధికార పార్టీ సభ్యులు డిమాండ్ చేశారు. ప్రతిపక్షపార్టీల సభ్యులు వ్యతిరేకించటంతో ఉభయ సభల్లోనూ గందరగోళ వాతావరణం నెలకొన్నది. దీంతో ఉభయసభలు ప్రారంభమైన కొద్ది సేపటికే వాయిదా పడ్డాయి. లోక్‌సభ ప్రారంభంకాగానే కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడారు. 'రాహుల్ గాంధీ లండన్‌లో ఇండియాను అవమానించారు. సభ్యులందరూ రాహుల్ ప్రకటనను ఖండించాలి. సభకు ఆయన క్షమాపణ చెప్పాలి' అన్నారు. దేశ అంతర్గత వ్యవహారాలపై విదేశీ జోక్యాన్ని రాహుల్ కోరారని ఆరోపించారు. దీనిని సభ్యులంతా ఖండించాలని అన్నారు. దీనిని ప్రతిపక్ష పార్టీల సభ్యులు వ్యతిరేకించారు. గతంలో మోడీ విదేశాల్లో ఇలాంటి వ్యాఖ్యలే చేశారని గుర్తుచేశారు. అలాగే సభలో ఈడీ, సీబీఐ, ఐటీ దుర్వినియోగంపైన, అదానీ వ్యవహారంపైనా ప్రతిపక్షాలు నినాదాలు ...5లో






జయహో నాటు

తెలుగు పాటకు దక్కిన అరుదైన గౌరవం

ఆస్కార్ వేదికను ఊపేసిన నాటు నాటు పాట

- చరిత్ర సృష్టించిన ఆర్ఆర్ఆర్
- భారతీయ సినీ చరిత్రలో సువర్ణాధ్యాయం
- ఆ కలని సాకారం చేసిన ఘనత రాజమౌళిదే..
- బెస్ట్ డాక్యుమెంటరీ షార్ట్ ఫిల్మ్‌గా 'ఎలిఫెంట్ విస్పరర్స్'
- ఎవ్రీథింగ్ ఎవ్రీవేర్ ఆల్ ఎట్ వన్స్‌కి ఉత్తమ చిత్రంతో సహా 6 ఆస్కార్‌లు..



మరిన్ని వివరాలు నవచిత్రంలో..



భారతీయ సినీ చరిత్రలో ఇదొక మరపురాని ఘట్టం. ముఖ్యంగా తెలుగు చిత్ర సీమ చరిత్రలో ఇదొక సువర్ణాధ్యాయం. 'నాటు నాటు' పాటకి ఆస్కార్ తథ్యమంటూ ప్రపంచ సినీ విశ్లేషకులు చెప్పిన జోస్యం నిజమైంది.

ఆస్కార్ షార్ట్‌లిస్ట్‌కు నామినేషన్ దక్కించుకున్న తొలి తెలుగు సినిమాగా రికార్డు నెలకొల్పిన ఆర్ఆర్ఆర్.. ఇప్పుడు ఒరిజినల్ సాంగ్ విభాగంలో నాటు నాటుగానూ ఆస్కార్ అందుకుని చరిత్ర సృష్టించింది. తెలుగు సినిమా ఖ్యాతిని ప్రపంచ పటంపై నిలబెట్టింది.

ప్రతీ తెలుగువాడిని గర్వపడేలా చేసింది. భారతీయ సినిమాకు ఎన్నో ఏండ్లుగా కలగా మిగిలిపోయిన ఆస్కార్ అవార్డును 'నాటు..నాటు' పాట సాకారం చేసింది.

లాస్ ఏంజిల్స్ : యావత్ భారతీయులందరినీ గర్వపడేలా చేసిన దర్శకుడు రాజమౌళికి ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. తొమ్మిదిన్నర దశాబ్దాల ఆస్కార్ చరిత్రలో ఆస్కార్‌ని సొంతం చేసుకున్న తొలి భారతీయ సినిమా పాటగానే కాకుండా తొలి తెలుగు సినిమా పాటకి దక్కిన అరుదైన గౌరవం ఇది. ఈ కల కేవలం దర్శకుడు రాజమౌళి వల్లే సాధ్యమైంది. ఈ ఏడాది ఆస్కార్ అవార్డుల్లో మన దేశం మూడు నామినేషన్లతో రంగంలోకి దిగింది. అయితే మన దేశం నుంచి బెస్ట్ డాక్యుమెంటరీ ఫీచర్ ఫిల్మ్ విభాగంలో నామినేట్ అయిన 'ఆల్ దట్ బ్రీత్స్'కి అవార్డు దక్కలేదు.

అట్టహాసంగా...

లాస్ ఏంజిల్స్ వేదికగా 95వ ఆస్కార్ అవార్డుల ప్రదానోత్సవం అట్టహాసంగా జరిగింది. భారత కాలమానం ప్రకారం సోమవారం ఉదయం 5.30 నిమిషాలకు ఈ ప్రదానోత్సవం ఆరంభమైంది. ఈ వేడుక ఆరంభంలోనే వ్యాఖ్యాత జిమ్మీ కెమ్మెల్ స్టేజ్‌పైకి వస్తున్నప్పుడు కొంతమంది డాన్సర్లు 'నాటు నాటు' పాటకు స్టెప్పులేస్తూ రావడం ఓ విశేషమైతే, ఇదే స్టేజ్ మీద ఇదే పాటను తెలుగు గాయకులు కాలభైరవ, రాహుల్ సిప్లిగంజ్ పాడగా లైవ్‌లో హాలీవుడ్ నటీనటులు డాన్స్ పర్ఫార్మెన్స్ చేయటం మరో విశేషం. ఈ పాట సందర్భాన్ని చెప్పేందుకు బాలీవుడ్ అగ్రకథానాయిక దీపికా పదుకొనె ఆస్కార్ వేదికపై మెరిసినప్పుడు డాల్బీ థియేటర్ మొత్తం కరతాళ ధ్వనులతో దద్దరిల్లిపోయింది.

'ది ఎలిఫెంట్ విస్పరర్స్'

అలాగే ప్రకృతికి, మనుషులకు, జంతువుల మధ్య ఉండే బంధాన్ని అత్యంత హృద్యంగా ఆవిష్కరించిన 'ది ఎలిఫెంట్ విస్పరర్స్' డాక్యుమెంటరీ సైతం ప్రతిష్టాత్మక ఆస్కార్ పురస్కారాన్ని దక్కించుకుని మన దేశ కీర్తి ప్రతిష్టలను మరింతగా పెంచింది.

ఆస్కార్ అవార్డుల చరిత్రలో ఇప్పటివరకు భారతీయులు కూడా అవార్డులు అందుకున్నారు. కానీ వారంతా విదేశీ చిత్రాలకు పని చేశారు. అయితే ఈసారి ఆస్కార్‌ని అందుకుంది మన చిత్రాలకు పని చేసిన మన వాళ్లే కావడం విశేషం.



'ది ఎలిఫెంట్ విస్పరర్స్' దర్శకురాలు కార్తిక్ గోనె సాల్వెస్, నిర్మాత గునీత్ మోంగ్స

'ఎవ్రీథింగ్ ఎవ్రీవేర్ ఆల్ ఎట్ వన్స్'

ఇదిలా ఉంటే, ఓ వలస కుటుంబం చేసిన పోరాటం నేపథ్యంలో తెరకెక్కిన 'ఎవ్రీథింగ్ ఎవ్రీవేర్ ఆల్ ఎట్ వన్స్' చిత్రం ఉత్తమ చిత్రంగా ఆస్కార్‌కి ఎంపికైంది. అంతేకాదు ఈ ...5లో

తెలుగు వారికి గర్వకారణం

- ఆస్కార్ అవార్డు పట్ల సీఎం కేసీఆర్ హర్షం
- తమ్మినేని, కేటీఆర్ సహా పలువురు ప్రముఖుల అభినందనలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్
ఆర్ఆర్ఆర్ సినిమాలోని 'నాటు నాటు' పాటకు ఉత్తమ ఒరిజినల్ సాంగ్ విభాగంలో ఆస్కార్ అవార్డు రావడం పట్ల ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు హర్షం వ్యక్తం చేశారు. విశ్వ సినీ యవనిక మీద ఒక తెలుగు సినిమా సత్తా చాటుతూ, ...2లో

రక్షణశాఖపై సుప్రీం ఆగ్రహం

చట్టాన్ని చేతుల్లోకి తీసుకున్నారు..

- సుప్రీం ఉత్తర్వులకు విరుద్ధంగా ఓఆర్ఓపీ బకాయిల చెల్లింపు : సీజేఐ



న్యూఢిల్లీ : 'వన్ ర్యాంక్ వన్ పెన్షన్' పథకంలో పెన్షన్ బకాయిల చెల్లింపుపై తాము జారీచేసిన ఉత్తర్వులను రక్షణశాఖ ఉల్లంఘించిందని భారత ప్రధాన న్యాయమూర్తి డి.వై.చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. జనవరి 20న జారీచేసిన నోటిఫికేషన్లను రద్దు చేయాలని రక్షణశాఖను ఆదేశించినా, అమలుకాలేదని, విడతల వారీగా బకాయిల చెల్లింపు కొనసాగిస్తోందని రక్షణశాఖ తీరును తప్పుబట్టింది. సుప్రీం ఉత్తర్వులను పక్కకుపెట్టి, చట్టాన్ని రక్షణశాఖ తన చేతుల్లో తీసుకోలేదు..అంటూ మొట్టికాయలు వేసింది. 'ఓఆర్ఓపీ' పథకం కింద పెన్షన్ బకాయిల చెల్లింపునకు సంబంధించిన కేసుపై సోమవారం సీజేఐ డి.వై.చంద్రచూడ్, జస్టిస్ పి.ఎస్.నర్సింహా, జస్టిస్ జె.బి.పార్థివాలాలతో కూడిన ధర్మాసనం విచారించింది. అర్హులైన మాజీ సైనిక ఉద్యోగులకు పెన్షన్ బకాయిలను మార్చి 15కల్లా చెల్లించాలని అంతకుముందు ...5లో



10 వేల మందితో కిసాన్ లాంగ్ మార్చ్

నాసిక్ నుంచి ముంబయి వరకూ

నాసిక్ : 10 వేల మందితో నాసిక్ నుంచి ముంబయి వరకూ సాగే కిసాన్ లాంగ్ మార్చ్‌ను సోమవారం ఏఐకేఎస్ ప్రారంభించింది. ఉల్లిపాయలకు లాభదాయకమైన ధరతో సహా 17 డిమాండ్ల చార్టర్‌తో ఈ మార్చ్ ప్రారంభమైంది. పత్తి, సోయాబీన్, పచ్చి మిర్చి, పాలు, పప్పు ధాన్యాలు, హిర్దా వంటి ఉత్పత్తులకు కూడా ...5లో

ఐక్యంగా ముందుకుసాగుదాం

ఏప్రిల్ 9న మండల, జిల్లా, రాష్ట్రస్థాయి నాయకుల ఉమ్మడి సమావేశం



- ఉభయ కమ్యూనిస్టు పార్టీల నిర్ణయం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్
ఐక్యంగా ముందుకు సాగుదామని సీపీఐ, సీపీఐ(ఎం) పార్టీలు నిర్ణయించాయి. ఉభయ కమ్యూనిస్టు పార్టీల శ్రేణులందరిలో ఉమ్మడి రాజకీయ అవగాహన, ఐక్య కార్యాచరణ స్ఫూర్తిని నింపే విధంగా వచ్చేనెల తొమ్మిదో తేదీన మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి నాయకుల ఉమ్మడి సమావేశాన్ని హైదరాబాద్‌లో నిర్వహించనున్నట్టు ప్రకటించాయి. ఈ సమావేశానికి ఆయా పార్టీల అఖిల భారత కార్యదర్శులు సీతారాం ఏచూరి, డి రాజాలతోపాటు కేంద్ర నాయకులు బీవీ రాఘవులు, కె నారాయణను ఆహ్వానించాలని నిర్ణయించాయి. ఆదివారం ఎంబీ భవన్‌లో జరిగిన సీపీఐ, సీపీఐ(ఎం) పార్టీల రాష్ట్ర నాయకత్వ సమావేశానంతరం ఉభయ ...5లో

సీబీఐ విచారణ వద్దు...

ఎమ్మెల్యేలకు ఎర దర్యాప్తుపై సుప్రీం స్టేటస్ కో

- విచారణ జూలై 31కి వాయిదా


(ఫైల్)

న్యూఢిల్లీ : తెలంగాణలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు ఎర వ్యవహారంపై నిర్ణయం తీసుకునే వరకు సీబీఐ విచారణ చేపట్టొద్దని అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. ఈ మేరకు స్టేటస్ కో (యథాతథ స్థితి కొనసాగడం) ఆదేశాలు ఇచ్చింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఎర వ్యవహారం కేసు విచారణను స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్) నుంచి సీబీఐకి బదిలీ చేస్తూ తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ తెలంగాణ ప్రభుత్వం (పోలీసులు) సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌ను సోమవారం సుప్రీంకోర్టు ...5లో

ప్రశాంతంగా ఎమ్మెల్సీ పోలింగ్

90.40 శాతం ఓటింగ్

- జోగులాంబ-గద్వాల్ జిల్లాలో అత్యధికంగా 97.15 శాతం
- అత్యల్పంగా హైదరాబాద్‌లో 82.25శాతం
- 16న ఓట్ల లెక్కింపు



వివరాలు 5లో..

విద్యారంగంపై కేంద్రం బుల్డోజర్

మనువాద భావాలకనుగుణంగా సిలబస్ రూపకల్పన

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం నూతన జాతీయ విద్యావిధానం-2020ని రాష్ట్రాలను సంప్రదించకుండానే ఏకపక్షంగా తెచ్చింది. విద్య ఉమ్మడి జాబితాలో ఉన్నది. కానీ కేంద్ర ప్రభుత్వం విద్యను తన చేతుల్లోకి తీసుకుంటున్నది. రాష్ట్రాల హక్కులను హరిస్తూ విద్యావిధానాన్ని రూపొందించింది. విద్యాకేంద్రీకరణకు మోడీ ప్రభుత్వం కుట్ర చేస్తున్నది. విద్యారంగంలో తిరోగమన విధానాలను అవలంభిస్తున్నది. మనువాద భావజాలాన్ని విద్యారంగంలో చొప్పిస్తున్నది. అందుకనుగుణంగా సిలబస్‌ను రూపకల్పన చేస్తున్నది. భగవద్గీతను చదవాలంటూ పాఠ్యాంశాల్లో చేర్చుతున్నది. యూజీసీ, ఏఐసీటీఈతోపాటు ప్రతిష్టాత్మకమైన కేంద్రీయ విశ్వవిద్యాలయాలకు ఆర్ఎస్ఎస్ భావజాలం ఉన్న వారినే చైర్మెన్, వీసీలుగా నియమిస్తున్నారు. మహాత్మాగాంధీ, అంబేద్కర్, భగత్‌సింగ్ వంటి స్వాతంత్ర్య సమరయోధుల చరిత్రను పాఠ్యాంశాల నుంచి తొలగిస్తున్నది. ఆర్ఎస్ఎస్ నాయకులైన హెడ్గేవార్, వీడి సావర్కర్ వంటి వారి చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చి విద్యార్థులకు బోధిస్తున్నది. చరిత్రను వక్రీకరిస్తున్నది.

బొల్లె జగదీశ్వర్

గాంధీ, అంబేద్కర్, భగత్‌సింగ్ చరిత్ర తొలగింపు

మత ఉన్మాదాన్ని, హిందూత్వ భావజాలాన్ని విద్యార్థుల మెదళ్లల్లోకి తీసుకెళ్తున్నది. తిరోగమన దిశలో నూతన జాతీయ విద్యావిధానాన్ని మోడీ ప్రభుత్వం రూపొందిం చింది. విద్యా ప్రయివేటీకరణ, వ్యాపారీక రణ, కార్పొరేటీకరణ కోసమే ఇది దోహదపడుతుంది. విద్యారం గంపై కేంద్ర ప్రభుత్వం బుల్డో జర్‌ను ప్రయోగిస్తున్నది. ఇది పేద విద్యా ర్థులు, ముఖ్యంగా ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనార్టీలకు తీవ్ర నష్టం కలిగిస్తుంది. అందుకే నూతన జాతీయ విద్యావిధానాన్ని రద్దు చేయాలంటూ అభ్యుదయ వాదులు, ప్రజాతంత్రవాదు లు, విద్యార్థి, ఉపా ధ్యాయ, అధ్యాపక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. శాస్త్రీయ విద్యావిధానం కావాలంటూ కోరుతున్నాయి.





వివరాలు 2లో..

కొఠారి కమిషన్ సిఫారసులు

విద్యారంగానికి జాతీయ స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ)లో ఆరు శాతానికి తగ్గకుండా నిధులు కేటాయిం చాలని సూచించింది. కేంద్ర బడ్జెట్‌లో పది శాతం, రాష్ట్రాల బడ్జెట్‌లో 30 శాతం నిధులు విద్యకు కేటాయిం చాలని సిఫారసు చేసింది. కామన్ స్కూల్ విధానం ఉండాలని తెలిపింది. 10+2+3 విద్యా విధానం అమలు చేయాలని కోరింది. ఆ తర్వాత దేశవ్యాప్తంగా ఇదే విధానం అమల్లోకొచ్చింది.



దర్యాప్తు సంస్థల తీరుపై బీఆర్ఎస్ ఆందోళన

- సభలో వాయిదా తీర్మానాలు..
- గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం
- మద్యం కుంభకోణం పేరుతో రాజకీయం: ఎంపీ కేకే

న్యూఢిల్లీ :దర్యాప్తు సంస్థలను అడ్డం పెట్టుకొని దేశంలో బీజేపీ రాజకీయం చేస్తోందని బీఆర్ఎస్ ఎంపీలు పార్లమెంటులో ఆందోళన చేపట్టారు. బీజేపీయేతర పాలిత రాష్ట్రాల్లోని ప్రభుత్వాలే లక్ష్యంగా దర్యాప్తు సంస్థలను ఉసిగొల్పుతున్నారని ఆరోపిస్తూ సోమవారం పార్లమెంటు కార్యకలాపాలను స్తంభింపచేసే ప్రయత్నం చేశారు. తొలుత పార్లమెంటు ఆవరణలోని గాంధీ విగ్రహం వద్ద దర్యాప్తు సంస్థల తీరుకు వ్యతిరేకంగా నిరసన తెలిపిన బీఆర్ఎస్ ఎంపీలు అనంతరం ఉభయ సభల్లో ఇచ్చిన వాయిదా తీర్మానాలపై చర్చించాలని పట్టుబట్టారు. ఉభయ సభల్లోనూ కార్యకలాపాలను అడ్డుకొనేందుకు ఇతర ప్రతిపక్ష పార్టీలతో కలిసి పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో సభా కార్యకలాపాలను తొలుత మధ్యాహ్నం 2 గంటలకు అనంతరం మంగళవారం ఉదయం 11 గంటలకు రాజ్యసభ చైర్మెన్, లోక్‌సభ స్పీకర్‌లు వాయిదా వేశారు. అనంతరం విజయ్‌చౌక్‌లో బీఆర్ఎస్ ఎంపీలు జోగినపల్లి సంతోష్ కుమార్, బడుగుల లింగయ్య యాదవ్‌లతో కలిసి బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కే.కేశవరావు మీడియాతో మాట్లాడారు.

రాజకీయం చేసేందుకే ....

ఎంపీ కేకే మాట్లాడుతూ దేశంలో దర్యాప్తు సంస్థలైన సీబీఐ, ఈడీలతో పాటు గవర్నర్లను తమకు అనుకూలంగా మార్చుకొని కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అవకతవకలను అడ్డుకొనేందుకు పార్లమెంట్ వేదికపై పెద్ద ఎత్తున ఉద్యమాన్ని నడిపిస్తామన్నారు. బీజేపీకి వ్యతిరేకంగా పార్లమెంట్‌లో అన్ని ప్రతిపక్ష పార్టీలు ఏకతాటిపై నడిచి బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతామన్నారు. గత నెలగా దేశంలో సీబీఐ, ఈడీని కేంద్ర ప్రభుత్వం ఏ విధంగా వినియోగిస్తుందన్న అంశాన్ని లేవనెత్తి పోరాటం చేస్తున్నామన్నారు. ఢిల్లీ మద్యం కుంభకోణంలో గత ఏడాది సెప్టెంబర్‌లో తొలి అరెస్టు జరిగినప్పటికీ, కావాలని రాజకీయం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కేసును పొడిగిస్తోందని కేకే ఆరోపించారు. ఈ కేసులో దర్యాప్తు, విచారణ గురించి ఎవరూ భయపడట్లేదనీ... సీబీఐ, ఈడీ సంస్థలు చట్టం ప్రకారం పనిచేయాల్సిన అవసరం ఉన్నదన్నారు. ఈ కేసులో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఇంటికి వెళ్లి విచారణ జరిపేందుకు అవకాశం ఉన్నప్పటికీ, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిజాన్ని రాబట్టేందుకు విచారణకు ఉన్న అవకాశాన్ని ఎందుకు వినియోగించుకోలేదని ప్రశ్నించారు. మద్యం కుంభకోణం కేసును రాజకీయం చేయాలన్న ఉద్దేశంతో ఈడీ అధికారులు గత శనివారం విచారణ పేరుతో ఢిల్లీలో తమాషా చేశారని కేకే మండిపడ్డారు. అంతేగాక అదానీ వ్యవహారంలో ప్రధాని మోడీకి, అదానీకి ఉన్న సంబంధాలన్నీ బహిర్గతం కావాలంటే జాయింట్ పార్లమెంటరీ కమిటీ వేయాలని తాము ఇప్పటికీ డిమాండ్ చేస్తున్నామని అన్నారు.

కేసీఆర్ ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయాలన్న ప్రయత్నం

ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్ మాట్లాడుతూ, గత తొమ్మిదేండ్లుగా కేంద్ర ప్రభుత్వం బీజేపీ పాలిత రాష్ట్రాలను ఒక మాదిరిగా.. బీజేపీయేతర పాలిత రాష్ట్రాలను మరో మాదిరిగా చూస్తున్నారని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా సహా ఇతర అంశాలను కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో, మా నిధులు మాకు కావాలని ముఖ్యమంత్రి కేసీఆర్ గళం విప్పారన్నారు. అప్పటినుంచి ప్రధాని మోడీ.. సీఎం కేసీఆర్‌పై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. అంతేగాక కేసీఆర్ ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయాలన్న ఆలోచనతో మోడీ ప్రభుత్వం ఎమ్మెల్సీ కవితపై ఈడీని ఉసిగొల్పారన్నారు. ఈడీ, సీబీఐ వంటి ఏ దర్యాప్తు సంస్థ బెదిరింపులకు బీఆర్ఎస్ పార్టీ వెనుకాడేది లేదనీ... ప్రజాస్వామ్యయుతంగా, న్యాయబద్ధంగా తమ పోరాటం కొనసాగుతుందని ఎంపీ లింగయ్య యాదవ్ స్పష్టం చేశారు.

మాజీ మంత్రి విజయరామారావు కన్నుమూత





ఫైల్

నవతెలంగాణ-జూబ్లీహిల్స్

మాజీ మంత్రి, సీబీఐ మాజీ డైరెక్టర్ విజయ రామారావు(85) కన్నుమూశారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సోమవారం మరణించారు. ములుగు జిల్లా ఏటూరు నాగారంకు చెందిన విజయరామారావు 1959లో ట్రైనీ ఐపీఎస్‌గా విధుల్లో చేరారు. అనంతరం ఆయన సీబీఐ డైరెక్టర్‌గా పనిచేశారు. 1999 ఎన్నికల్లో టీడీపీ నుంచి ఖైరతాబాద్ ఎమ్మెల్యేగా పోటీ చేసి పి.జనార్ధన్‌రెడ్డిపై గెలిచి అప్పట్లో సంచలనం సృష్టించారు. అప్పటి సీఎం చంద్రబాబు క్యాబినెట్‌లో రోడ్డు భవనాల శాఖామంత్రిగా పని చేశారు. 2004 ఎన్నికల్లో తిరిగి జనార్ధన్‌రెడ్డి చేతిలో, 2009 అసెంబ్లీ ఎన్నికల్లో దానం నాగేందర్ చేతిలో ఓడిపోయారు.

సంతాపం తెలిపిన మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

విజయ రామారావు మృతికి మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ సంతాపం తెలిపారు. జూబ్లీహిల్స్‌లోని అపోలో ఆస్పత్రిలో మృతదేహాన్ని సందర్శించి నివాళ్లర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. విజయ రామారావు అందించిన సేవలను స్మరించుకున్నారు.

సీఎం సంతాపం

మాజీ మంత్రి, సీబీఐ మాజీ డైరెక్టర్, ఉమ్మడి రాష్ట్ర మాజీ డీజీపీ విజయ రామారావు మరణం పట్ల సీఎం కేసీఆర్ సంతాపాన్ని ప్రకటించారు. ప్రభుత్వ అధికారిగా, ప్రజాప్రతినిధిగా విజయరామారావు అందించిన సేవలు గొప్పవని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలోనూ, అనంతరం తెలంగాణ రాష్ట్రంలోనూ విజయరామారావుతో తనకున్న అనుబంధాన్ని ఈ సందర్భంగా సీఎం స్మరించుకున్నారు. ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.విజయరామారావు అంత్యక్రియలను ప్రభుత్వ లాంచనాలతో నిర్వహించాలని సీఎం నిర్ణయించారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు చూడాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని ఆయన ఆదేశించారు. విజయరామారావు మరణం పట్ల రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్‌చైర్మెన్ బోయినపల్లి వినోద్‌కుమార్,మంత్రులు హరీశ్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి తదితరులు సంతాపాన్ని ప్రకటించారు.

విద్యారంగంపై కేంద్రం బుల్డోజర్

- ఆర్ఎస్ఎస్ నాయకుల గురించి పాఠ్యాంశాలు
- హిందీని బలవంతంగా రుద్దుతున్న వైనం
- ఏకపక్ష నిర్ణయాలతో రాష్ట్రాల హక్కులకు భంగం
- తిరోగమన దిశలో జాతీయ విద్యావిధానం
- ఆరేండ్లు నిండితేనే ఒకటో తరగతిలో ప్రవేశం నిబంధన
- పేద పిల్లలు చదువుకు దూరమయ్యే ప్రమాదం
- విద్యాకార్పొరేటీకరణకు మోడీ సర్కారు కుట్ర

(మొదటిపేజీ తరువాయి)

విద్యాహక్కు చట్టంలోని ముఖ్యాంశాలు

దేశంలోని ఆరు నుంచి 14 ఏండ్ల వయస్సుగల పిల్లలకు ఉచిత నిర్బంధ విద్యను అందించడమే ఈ చట్టం ఉద్దేశం. భారత రాజ్యాంగంలోని 86వ సవరణ ద్వారా ఆర్టికల్ 21(ఏ) ప్రకారం ప్రతి విద్యార్థికి విద్య ప్రాథమిక హక్కుగా యూపీఏ ప్రభుత్వం కల్పించింది. దాన్ని బీజేపీ ప్రభుత్వం కాలరాస్తున్నది. అందరికీ విద్య అందించాలన్న బాధ్యత నుంచి తప్పుకుంటున్నది. అందులో భాగంగానే ఆరేండ్లు నిండిన వారికే ఒకటో తరగతిలో ప్రవేశం కల్పించాలన్న నిబంధనను తెచ్చింది. దీని వల్ల పేద విద్యార్థులు తీవ్రంగా నష్టపోతారు. ఒక ఏడాది చదువును కోల్పోయే అవకాశమున్నది.

ఎన్ఈపీతో ప్రమాదం

ఐదేండ్లు నిండిన విద్యార్థులకే ప్రస్తుతం రాష్ట్రంలో ఒకటో తరగతిలో ప్రవేశాలు కల్పిస్తున్నారు. విద్యాహక్కు చట్టానికి విరుద్ధంగా కేంద్రం ఎన్ఈపీ పేరుతో ఆరేండ్లు నిండిన విద్యార్థులకే ఒకటో తరగతిలో ప్రవేశాలు కల్పించాలని ఆదేశించింది. ఈ నిర్ణయం ప్రభుత్వ పాఠశాలలకు గొడ్డలిపెట్టుగా మారనుంది. సర్కారు బడుల్లో ప్రీప్రైమరీ తరగతుల్లేవు. దీంతో ఏడేండ్లు వచ్చేదాకా తల్లిదండ్రులు ఎవరూ వారి పిల్లలను బడికి పంపించకుండా ఉండే పరిస్థితి లేదు. ఇంకోవైపు ప్రయివేటు పాఠశాలల్లో ప్రీప్రైమరీ తరగతులున్నాయి. దీంతో అనివార్యంగా ప్రయివేటు విద్యాసంస్థల్లోనే విద్యార్థులు చేరతారు. విద్యాప్రయివేటీకరణ, కార్పొరేటీకరణను ప్రోత్సహించడం కోసమే కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నదని విద్యావేత్తలు, నిపుణులు అభిప్రాయపడుతున్నారు. విద్యార్థులు చేరడం లేదనే కారణంతో ప్రభుత్వ బడుల మూసివేతకు ఇది దారితీసే ప్రమాదమున్నది.

జాతీయ విద్యావిధానం సిఫారసులు

దేశంలో 10+2+3 అమల్లో ఉన్న పాఠ్య ప్రణాళిక బోధనా నిర్మాణాన్ని 5+3+3+4గా మార్చాలని ప్రతిపాదించింది. ప్రీ స్కూల్ నుంచి 12వ గ్రేడ్ (తరగతి) (3 నుంచి 18 ఏండ్లు) వరకు ఉచిత నిర్బంధ విద్య అందు బాటుకు హామీనివ్వడానికి విద్యాహక్కు చట్టాన్ని విస్తరింప జేస్తామని ప్రకటించింది. జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలను దృష్టిలో ఉంచుకుని ఒకటి నుంచి 12వ తరగతి వరకు సిలబస్‌ను ఎన్‌సీఈఆర్టీ రూపొందిస్తుందని ప్రకటించింది. రాష్ట్రీయ శిక్షా ఆయోగ్ (ఆర్ఎస్ఏ) లేదా జాతీయ విద్యాసంఘం ప్రధాని అధ్యక్షతన ఏర్పాటవు తుందని తెలిపింది. పదేండ్ల వ్యవధిలో కేంద్ర ప్రభుత్వం, అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు విద్యపై పెట్టుబడులను 20 శాతానికి పెంచాలని సూచించింది.

రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం

రాజ్యాంగ అంశాలైన సామ్యవాదం, ప్రజాస్వామ్యం, లౌకికతత్వం, ఫెడరల్ స్వభావానికి విరుద్ధంగా జాతీయ విద్యావిధానాన్ని కేంద్ర ప్రభుత్వం రూపొందించింది. విద్యారంగంపై రాష్ట్రాలకుండే హక్కులు, స్వయం ప్రతిపత్తిని కోల్పోయే ప్రమాదమున్నది. ఫెడరల్ స్ఫూర్తికి కేంద్రం భంగం కలిగిస్తున్నది. శాస్త్రీయ దృక్పథాన్ని విద్యార్థుల్లో పెంపొందించేలా లేదు. మూఢవిశ్వాసాలు, మత భావాలను ముఖ్యంగా మనువాద భావజాలాన్ని రుద్దేలా ఉన్నది. ప్రస్తుతం మాతృభాషతో పాటు ఇంగ్లీష్, హిందీ భాషలు అమలవుతున్నాయి. కానీ ఎన్ఈపీలో సంస్కృతం, హిందీని బలవంతంగా అమలు చేసే ప్రమాదమున్నది. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందిన ఆధునిక యుగంలో సంస్కృతం, హిందీ భాషలను నేర్చుకుని విద్యార్థులు ప్రపంచంతో పోటీ పడతారా?అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. విద్యార్థుల్లో ప్రశ్నించే తత్వాన్ని ప్రోత్సహించకుండా యంత్రాలుగా తయారు చేసే విద్యావిధానాన్ని రూపొందించిందన్న అభిప్రాయమున్నది.

అందరికీ శాస్త్రీయ విద్య అవసరం

నూతన జాతీయ విద్యావిధానం పేరుతో ఆర్ఎస్ఎస్ నేతృత్వంలో ఉన్న సరస్వతి శిశు మందిర్ సంస్కృతికి కేంద్రంలోని మోడీ ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నది. అందులో భాగంగానే సంస్కృతం భాషను ప్రోత్సహిస్తున్నది. దేశంలో సరస్వతి శిశు మందిర్లకు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సబులిటీ (సీఎస్ఆర్) నిధులను విరాళాల రూపంలో పెద్దమొత్తంలో వెళ్తున్నట్టుగా తెలుస్తున్నది. శాస్త్రీయ ఆలోచనలకు పదును పెట్టేలా ఈ విద్యావిధానం లేదని పలువురు విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. ఆర్ఎస్ఎస్ భావజాలాన్ని, మనువాదాన్ని సిలబస్‌లో పొందుపరిచే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కామన్ స్కూల్ విధానం అమలు చేయడం, అందరిలోనూ శాస్త్రీయ దృక్పథాన్ని పెంచడం, ప్రయివేటు విద్యారంగాన్ని బలహీనం చేయడం, ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయడమే పరిష్కారమని సూచిస్తున్నారు.

మనువాదం దేశానికే ప్రమాదకరం

- ప్రత్యామ్నాయ సాంస్కృతిక రంగాన్ని అభివృద్ధి చేయాలి:జనచైతన్య యాత్ర గెట్ టూ గెదర్‌లో వక్తలు
- సీపీఐ(ఎం) యాత్రలకు సామాజిక, ప్రజా సంఘాల మద్దతు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

దేశ భవిష్యత్‌కు ప్రమాదకరంగా మారిన బీజేపీ మనువాద భావజాలాన్ని వెనక్కి కొట్టడమే లక్ష్యంగా జనచైతన్యయాత్రతో ముందుసాగాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. దేశంలో ప్రత్యామ్నాయ సాంస్కృతిక రంగాన్ని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. మనువాదం దేశానికే ప్రమాదకరమని హెచ్చరించారు. సీపీఐ(ఎం) తలపెట్టిన జనచైతన్య యాత్రలకు ముక్తకంఠంతో మద్దతు ప్రకటించారు. సోమవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షులు జాన్‌వెస్లీ అధ్యక్షతన సామాజిక, ప్రజా సంఘాల గెట్ టూ గెదర్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మార్పు కోరుకుంటారనీ, అది సమాజ హితంగా ఉండాలని ఆకాంక్షించారు. బీజేపీ మాత్రం మనుధర్మం ద్వారా చాతుర్వర్ణ వ్యవస్థను బలోపేతం చేస్తూ కులధర్మం యథాతథంగా ఉంచేందుకు యత్నిస్తున్నదని విమర్శించారు. అంబేద్కర్ రాజ్యాంగం వద్దనీ, మనుధర్మమే ఉండాలని ఆర్ఎస్ఎస్ ముఖ్యులు గోల్వాల్కర్, సావర్కర్, హేడ్గేవార్ చెప్పిన విషయాన్ని ప్రస్తావించారు. వారి అజెండానే నేడు బీజేపీ ముందుకు తీసుకెళ్తున్నదన్నారు. కులాన్ని బట్టి చదువులు, ఆస్తులు, శిక్షలు ఉండాలన్నదే మనుధర్మం ఉద్దేశమన్నారు. ఇలా చేయడమంటే దేశాన్ని మళ్లీ వెనక్కి తీసుకుపోవడమేనన్నారు. గర్భ సంస్కార్ పథకం అమలు చేయాలని చూడటం దుర్మార్గమన్నారు. ఎన్ని మతాలున్నా, ఎన్ని వైరుధ్యాలున్నా ప్రజలు ఐక్యంగా జీవిస్తున్న మన దేశంలో మతచిచ్చు పెట్టి లబ్ది పొందాలని బీజేపీ చూస్తున్నదని విమర్శించారు. దేశంలోని కీలకమైన ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటు సంస్థలకు కట్టబెట్టి దేశ ఆర్థిక సార్వభౌమత్వాన్ని దెబ్బతీస్తున్న తీరును వివరించారు. రాష్ట్రాల హక్కులను హరించి ఫెడరల్ వ్యవస్థకు తూట్లు పొడుస్తున్నదని విమర్శించారు. సామాజిక న్యాయం విషయంలోనూ ఉల్లంఘన జరుగుతున్నదన్నారు. దేశంలో రోజురోజుకీ మహిళలపై దాడులు పెరిగిపోతుండటంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నెల 17 నుంచి 29 వరకు సీపీఐ(ఎం) తలపెట్టిన జనచైతన్య యాత్రలకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. వీసీకే రాష్ట్ర అధ్యక్షులు జిలకర శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఆర్ఎస్ఎస్ అసలు లక్ష్యం ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజిక తరగతులను తొక్కిపెట్టమేనన్నారు. ఒకరినొకరు విమర్శించుకుంటూ కూర్చుంటే బీజేపీని ఎదుర్కోవడం కష్టమన్నారు. కమ్యూనిస్టులు, అంబేద్కరిస్టులు, ప్రజాస్వామిక వాదులు ఐక్యంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ..బీసీల ఓట్లతో గెలిచి ప్రధాని అయిన మోడీ వారికి చేసిందేమీ లేదని విమర్శించారు. కులగణన చేసి జనాభా ధామాషా ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్వీ ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటరెడ్డి మాట్లాడుతూ..కాలనీల్లో, అపార్టుమెంట్లలోకి, అసోసియేషన్లలోకి ఆర్ఎస్ఎస్ భావజాలం వేగంగా వ్యాప్తి చెందుతున్నదని ఆందోళన వ్యక్తంచేశారు. దీనికి అడ్డుకట్ట వేయాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపైనా ఉందన్నారు. హెచ్ఆర్ఎల్ఎన్ బోర్డు మెంబర్ రచన మాట్లాడుతూ..ట్రాన్స్‌జెండర్ల పట్ల వివక్ష తగదన్నారు. తామూ మనుషులేనన్న భావనను మరవొద్దని కోరారు. తమకు రిజర్వేషన్లు ఎందుకు అమలు చేయరని ప్రశ్నించారు. ఓయూ ప్రొఫెసర్ బి.సుదర్శన్ మాట్లాడుతూ...సాంస్కృతిక రంగాన్ని మరింత బలోపేతం చేసి బీజేపీని ఎదుర్కోవాలన్నారు. బీజేపీ ప్రమాదం గురించి వివరించడంలో లోపాన్ని సవరించుకుని ముందుకు సాగాలన్నారు. ఎంబీసీ నేత పాలూరి రామకృష్ణయ్య మాట్లాడుతూ..బీసీలకు అడుగడుగునా అన్యాయం చేస్తున్నది బీజేపీనే అని చెప్పడంలో కాంగ్రెస్ విఫలమైందన్నారు. ప్రతి ఎన్నికల్లోనూ బీసీలను ఏదో రకంగా మభ్యపెట్టి బీజేపీ రాజకీయ లబ్ది పొందుతున్నదన్నారు. దళిత సేన వ్యవస్థాపకులు జేబీ రాజు మాట్లాడుతూ..రాజ్యాంగ స్ఫూర్తిని నాశనం చేస్తున్న బీజేపీ తీరును ఎండగట్టాలని పిలుపునిచ్చారు. విశ్వజనక్ కళామండలి అధ్యక్షులు మాష్టార్ జీ మాట్లాడుతూ..సాంస్కృతిక చైతన్యాన్ని ప్రజల్లో పెంచడం ద్వారానే బీజేపీని ఎదుర్కోగలమన్నారు. కుల నిర్మూలనా సంఘం నేత గుత్తా జ్యోత్స్న మాట్లాడుతూ..బీజేపీని వ్యతిరేకించే శక్తులంతా పిడికిలి బిగించి ముందుకు సాగాలని ఆకాంక్షించారు. గౌడ కల్లుగీత సంఘం సమన్వయ కమిటీ చైర్మెన్ బి.బాలరాజుగౌడ్ మాట్లాడుతూ... బీజేపీ ట్రాప్‌లో పడకుండా బుద్ధిబలంతోనే దాన్ని ఎదుర్కోవాలన్నారు. స్వేచ్ఛ జేఏసీ కో-కన్వీనర్ కె.జనార్ధన్ మాట్లాడుతూ..గుజరాత్ పెట్టుబడిదారులకు దేశ సంపదను దోచిపెట్టే పనిలో మోడీ సర్కారు ఉందని విమర్శించారు. టెక్నాలజీ అందిపుచ్చుకుని బీజేపీ విషప్రచారాలకు గట్టిగా కౌంటర్ ఇవ్వాలన్నారు. భారత నాస్తిక సమాజం అధ్యక్షులు సారయ్య మాట్లాడుతూ..ప్రజల్లో సామాజిక చైతన్యం పెరగాల్సిన అవసరం ఉందని నొక్కిచెప్పారు. అడ్వకేట్ నయిముల్లా షరీఫ్ మాట్లాడుతూ..దేశాన్ని కాపాడుకునే చివరి అవకాశం ఇదే అన్నారు. ఏఐఆర్‌డబ్ల్యూఓ రాష్ట్ర కార్యదర్శి అనూష మాట్లాడుతూ..నిరంతరం ప్రజల్లోకి వెళ్లి ప్రజల సాదకబాధకాలను తెలుసుకోవాలనీ, వారికి భరోసా కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో పట్నం ప్రధాన కార్యదర్శి డీజీ నర్సింహారావు, ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎమ్‌డీ అబ్బాస్, కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు, గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీరాంనాయక్, ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు అరుణజ్యోతి, ఆదివాసీ గిరిజన సంఘం నేత బండారు రవికుమార్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బుర్రి ప్రసాద్, కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎమ్వీ రమణ, రజకవృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ల ఆశయ్య, సీఐటీయూ రాష్ట్ర నేత కోటంరాజు, టీపీటీఎల్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ విజయ్‌కుమార్, డీవైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.వెంకటేశ్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు, ఉపాధ్యక్షులు రవి, పీవైఎల్ రాష్ట్ర కార్యదర్శి కెఎస్.ప్రదీప్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, స్వేచ్ఛ జేఏసీ నాయకులు టి.రమేశ్, టీపీఎస్‌కే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.హిమబిందు, కల్లుగీత వృత్తిదారుల సంఘం అధ్యక్షులు ఎ.వెంకన్న, అంబేద్కర్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు బి.శ్రీనివాస్, వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.విఘ్నేష్, తెలంగాణ క్షౌరవృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెన్నారం మల్లేశం, అడ్వకేట్ మహ్మద్ ఖుద్దుస్ ఘోరి, సామాజిక కార్యకర్త షాబాజ్ అలీఖాన్, తెలంగాణ లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షులు మన్నారం నాగరాజు, వాయిద్య కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎల్‌పీ చెన్నారావు, తదితరులు పాల్గొన్నారు.

టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీలో 9 మంది అరెస్ట్

- పేపర్ లీక్‌లో కీలక పాత్ర పోషించిన రేణుక, ప్రవీణ్

నవతెలంగాణ-సిటీబ్యూరో

టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీ కేసును పోలీసులు ఛేదిం చారు. ఈ కేసులో 9 మంది నింది తులను టాస్క్‌ఫోర్స్, బేగంబజార్ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి నాలుగు పెన్‌డ్రైవ్‌లు, ల్యాప్‌టాప్‌లు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసు కున్నారు. సోమవారం హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని సీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో డీసీపీ రాధాకిషన్ రావుతో కలిసి డీసీపీ కిరణ్‌కార్ వివరాలు వెల్లడించారు. టీఎస్‌పీఎస్సీలో అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న పి.ప్రవీణ్ కుమార్ కార్యదర్శి పీఏగా కొనసాగుతున్నాడు. తన తండ్రి మృతిచెందడంతో ప్రవీణ్‌కు 2017లో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం లభించింది. మణికొండకు చెందిన ఏ.రాజశేఖర్ టీఎస్‌పీఎస్సీలో నెట్‌వర్క్ అడ్మిన్‌గా పనిచేస్తున్నాడు. మహబూబ్‌నగర్‌కు చెందిన రేణుకకు 2018లో వనపర్తిలో గురుకులంలో హిందీ టీచర్‌గా ఉద్యోగం వచ్చింది. ఈ క్రమంలో ప్రవీణ్‌కు రేణుకకు పరిచయం ఏర్పడింది. మహబూబ్‌నగర్‌లో నివాసముండే రేణుక సోదరుడు కె.రాజేశ్వర్‌కు ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో సోదరికి తన గోడు చెప్పుకునేవాడు. ఈ క్రమంలో డబ్బులు సంపాదించాలని ఆశించిన రేణుక టీఎస్‌పీఎస్సీ నిర్వహిస్తున్న ప్రశ్నాపత్రాలను లీక్ చేసేందుకు ప్రవీణ్ సహాయాన్ని కోరింది. లక్షల్లో డబ్బులు వస్తాయని ఆశించిన ప్రవీణ్ కూడా అందుకు అంగీకరించాడు. రేణుక ఈ విషయాన్ని తన భర్త ఎల్.ధాక్యతోపాటు సోదరునికి చెప్పింది. టీఎస్‌పీఎస్సీలో పరీక్ష ప్రశ్నపత్రాలు అన్నీ డిజిటల్ ఫార్మాట్‌లో కంప్యూటర్‌లో ఉండటంతో యూజర్ ఐడీ, పాస్‌వర్డ్‌లను రహస్యంగా ప్రవీణ్ తెలుసుకున్నాడు. ఈనెల 2న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి ఏ.రాజశేఖర్ సహాయంతో కంప్యూటర్ నుంచి ప్రశ్నాపత్రాలను ఎవరికీ అనుమానం రాకుండా పెన్‌డ్రైవ్‌ల్లో డౌన్‌లోడ్ చేశారు. ఆ తర్వాత రేణుకకు సమాచారమిచ్చాడు. 5వ తేదీన అసిస్టెంట్ ఇంజినీర్ పరీక్ష ఉండటంతో పరీక్షా పత్రాలున్నాయి కవాలా అంటూ రాజేశ్వర్ తనకు తెలిసిన మేడ్చల్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న కె.శ్రీనివాస్‌ను సంప్రదించాడు. అయితే, తాను ఇతర పరీక్షలకు సిద్ధమవుతున్నానని, కావాలంటే తన స్నేహితులను సంప్రదించాలని చెప్పాడు. ఈ క్రమంలో మహబూబ్‌నగర్‌కు చెందిన కె.నీలేష్ నాయక్, పి.గోపాల్ నాయక్‌ను రాజేశ్వర్ సంప్రదించాడు. ఒక్కొక్కరిని రూ.10 లక్షల చొప్పున అడిగాడు. వారు అంత పెద్ద మొత్తంలో ఇవ్వలేమని చెప్పడంతో ఇద్దరి నుంచి రూ.13.50లక్షలు పుచ్చుకున్నారు. అందులో నుంచి రూ.5లక్షలు ప్రవీణ్‌కు చెల్లించారు. పేపర్స్ తీసుకున్న అనంతరం మరో రూ.5లక్షలు చెల్లించారు. డబ్బులిచ్చిన ఇద్దరు అభ్యర్థులను మహబూబ్‌నగర్‌లోని రేణుక తన ఇంట్లోనే ప్రిపరేషన్ చేయించింది. పై గదిలో ఆమె సోదరుడు కె.రాజేశ్వర్ ఉండేవాడు. రెండ్రోజుల ప్రిపరేషన్ తర్వాత పరీక్షా కేంద్రం వద్దకు రేణుక, ఆమె భర్త అభ్యర్థులను తీసుకెళ్లి విడిచిపెట్టారు. పరీక్ష రాసిన తర్వాత విషయం లీక్ కావడంతో టీఎస్‌పీఎస్సీ అధికారులు అంతర్గత విచారణ చేపట్టారు.

రేపటినుంచి ఒంటిపూట బడులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రయివేటు యాజమా న్యాల్లోని అన్ని పాఠశాలల్లో బుధ వారం నుంచి ఒంటిపూట బడులు ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణ యించింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ సంచాలకులు శ్రీదేవ సేన సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటికే ఎండల తీవ్రత వీపరీతంగా ఉన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఒంటిపూట బడులు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరుగుతాయని పేర్కొన్నారు. అన్ని పాఠశాలల్లోనూ విద్యార్థులకు మధ్యాహ్నం 12.30 గంటలకు మధ్యాహ్న భోజనం అందిస్తామని తెలిపారు. ఆ తర్వాత వారు ఇంటికి వెళ్తారని వివరించారు. పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు కొనసాగుతాయని ఉత్తర్వుల్లో ప్రకటించారు.


సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల ఒప్పందాన్ని అమలు చేయాలి

- హైదరాబాద్ ఎన్నికల సమావేశం వద్ద ధర్నా
- ఓటుహక్కు కల్పించాలి : బీ మధు డిమాండ్



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులతో యాజమాన్యం గతంలో చేసుకున్న ఒప్పందాలను అమలు చేయాలని సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సంఘం (సీఐటీయూ) డిమాండ్ చేసింది. ఈ మేరకు సింగరేణిలో ఎన్నికలు నిర్వహించేందుకు డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ (సెంట్రల్) సింగరేణి యాజమాన్యం, కార్మిక సంఘాలతో హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశం వద్ద వారు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి మధు మాట్లాడుతూ గతేడాది సెప్టెంబర్ 26న జరిగిన ఒప్పందంలోని అన్ని అంశాలను అమలు చేయాలనీ, సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో కాంట్రాక్ట్ కార్మికులకు ఓటు హక్కు కల్పించాలనీ, కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ ఒప్పందం అమలులో సింగరేణి యాజమాన్యం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. కాంట్రాక్ట్ కార్మికులకు 20 శాతం బోనస్ పెంపు విషయాన్ని నెల రోజుల్లో ప్రకటిస్తామని అంగీకరించిన యాజమాన్యం, ఐదు నెలలైనా దాన్ని అమలు చేయలేదన్నారు. సింగరేణి హాస్పిటల్స్‌లో కుటుంబ సభ్యులకు వైద్యం, ఇఎస్ఐ సౌకర్యం, జాతీయ, పండగ సెలవుల అమలు, సేల్ పీకింగ్, బెల్ట్ క్లీనింగ్ తదితర కార్మికులకు సెమిస్కిల్డు, స్కిల్డ్ వేతనాల చెల్లింపు, నర్సరీ కార్మికుల కనీస వేతనాలు, ప్రయివేటు సెక్యూరిటీ గార్డులకు కామన్ యూనిఫామ్, ఉచిత యూనిఫాం వంటి అంశాలేవీ అమల్లోకి రాలేదన్నారు. సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల్ని నెలరోజుల్లో పరిష్కరిస్తామని డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ (సెంట్రల్) శ్రీనివాసులు, సింగరేణి జనరల్ మేనేజర్ (పర్సనల్) కుమార్‌రెడ్డి హామీ ఇచ్చారు. ధర్నా చేస్తున్న కార్మికులు, నాయకులను సమావేశంలోకి పిలిచి మాట్లాడారు. కాంట్రాక్ట్ కార్మికులకు ఓటు హక్కు కల్పించే విషయమై పర్మినెంట్ కార్మిక సంఘాల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ధర్నాలో సంఘం నాయకులు ఏ సమ్మయ్య, సిహెచ్ శ్రీనివాస్, ఆర్ఆర్ సతీష్, కె శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



తెలుగు వారికి గర్వకారణం

(మొదటిపేజీ తరువాయి)

ప్రపంచ చలనచిత్ర రంగంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా భావించే ఆస్కార్ అవార్డును గెలుచుకోవడం తెలుగువారిగా మనందరికీ గర్వకారణమని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఆస్కార్ అవార్డు పొందిన నాటు నాటు పాటలో పొందు పరిచిన పదాలు.. తెలంగాణ సంస్కృతికి, తెలుగు ప్రజల రుచి అభిరుచికి, ప్రజా జీవన వైవిధ్యానికి అద్దం పట్టాయని సీఎం తెలిపారు. తెలుగు భాషలోని మట్టి వాసనలను, ఘాటును, ఆ పాట ద్వారా గొప్పగా వెలుగులోకి తెచ్చిన పాట రచయిత చంద్రబోస్‌ను సీఎం ప్రత్యేకంగా అభినందించారు. సంగీత దర్శకుడు ఎం.ఎం.కీరవాణికి, కూర్పులో భాగస్వాములైన దర్శకుడు రాజమౌళి, గాయకులు రాహుల్ సిప్లిగంజ్, కాలభైరవ, నటులు రామ్ చరణ్, జూనియర్ ఎన్టీఆర్, కొరియోగ్రాఫర్ ప్రేమ్ రక్షిత్, సినిమా నిర్మాత డీవీవీ దానయ్య, ఇతర సాంకేతిక సిబ్బందికి సీఎం కేసీఆర్ ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.

నిర్మాణ విలువలపరంగాను, సాంకేతికంగాను హాలీవుడ్‌కు ఏమాత్రం తీసిపోని విధంగా తెలుగు సినిమా పరిశ్రమలో చిత్రాలు రూపొందుతుండటం గొప్ప విషయమని సీఎం పేర్కొన్నారు. ఆస్కార్ అవార్డుతో తెలంగాణ కేంద్రంగా, హైదరాబాద్ గడ్డమీద దినదినాభివృద్ధి చెందుతున్న తెలుగు సినిమా పరిశ్రమ కీర్తి దిగంతాలకు వ్యాపించిందని సీఎం పేర్కొన్నారు. ఈ అవార్డు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లకే కాకుండా, తెలుగు, ద్రావిడ భాషలకు, యావత్తు భారత దేశానికి గర్వకారణమని వివరించారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు సినీ ప్రేక్షకులకు ఇది పండుగరోజనీ, తెలుగు సినిమా పరిశ్రమ ఎదుగుదలకు తెలంగాణ ప్రభుత్వ కృషి ఫలించిందని ఆనందం వ్యక్తం చేశారు. తెలుగు సినీపరిశ్రమ అభివృద్ధి, విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం తోడ్పాటునందిస్తున్నదనీ, కరోనా కాలంలో కష్టాలు చుట్టిముట్టిన తెలుగు సినిమా పరిశ్రమకు ప్రత్యేకంగా ప్రోత్సాహకాలు అందించిన విషయాన్ని సీఎం ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఆస్కార్ అవార్డు స్ఫూర్తితో తెలుగు సినిమా పరిశ్రమ భవిష్యత్తులోనూ ఇదే ఒరవడిని కొనసాగించాలనీ, వైవిధ్యంతో కూడిన కథలతో, ప్రజా జీవితాలను ప్రతిబింబించే సినిమాలు మరిన్ని రావాలని ఆకాంక్షించారు.

ఆస్కార్ విజేతలకు అభినందనలు : సీపీఐ(ఎం)

మన దేశానికి చెందిన ఆర్ఆర్ఆర్ చిత్రంలోని ఒరిజినల్ పాట కేటగిరీలో "నాటు నాటు" పాటకు, ది ఎలిఫెంట్ విష్పరర్స్ చిత్రానికి ఉత్తమ డాక్యుమెంటరీ షార్ట్‌ఫిల్మ్ విభాగాల్లో ఆస్కార్ పురస్కారాలు లభించిన నేపథ్యంలో చిత్ర బృందానికి సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ అభినందనలు తెలిపింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2009 తరువాత రెండు అవార్డులు గెలుచుకోవడం, అందునా తెలుగు సినిమాకు మొదటిసారి ఆస్కార్ రావడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఆస్కార్ పురస్కారం రావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, చిత్ర బృందానికి రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర రాజన్, శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివ రావు, మంత్రులు కె.తారకరామారావు, సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి,వేముల ప్రశాంత్ రెడ్డి, సత్యవతి రాథోడ్, ఎర్రబెల్లి దయాకర్ రావు, ఇంద్రకరణ్ రెడ్డి, ఎంపీ రవిచంద్ర, రాష్ట్ర చలన చిత్ర అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ అరవింద్ కుమార్, సౌత్ సేన ప్రతినిధులు రవి, శ్రీనివాస్, శ్రీకాంత్, రమేష్ బాబు, విలియం కేరీ, జగదీష్ శుభాకాంక్షలు తెలిపారు.

కార్మిక, కర్షకులకు బీజేపీ వ్యతిరేకం..

జూలకంటి

- ఏప్రిల్ 5న చలో ఢిల్లీ పోస్టర్ ఆవిష్కరణ



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్మిక కర్షక ప్రజావ్యతిరేక విధానాలను అనుసరిస్తున్నదని సీపీఐ(ఎం) మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి విమర్శించారు. సోమవారం హైదరాబాద్‌లోని రైతు సంఘం కార్యాలయంలో సీఐటీయూ, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో వచ్చేనెల ఐదున నిర్వహించబోయే ఛలో ఢిల్లీ పోస్టర్‌ను అవిష్కరించారు. ఈ సందర్భంగా జూలకంటి మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల ప్రధాన సమస్యలను పరిష్కరించకుండా మోసం చేస్తున్నదని విమర్శించారు. పంటలకు గిట్టుబాటు ధర ఇవ్వకుండా, రుణమాఫీ చేయకుండా మోసం చేసిందని తెలిపారు.దీంతో అప్పుల పాలైన రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు అప్పగించడానికి మోడీ సర్కారు కుట్రలు పన్నుతున్నదని విమర్శించారు. విద్యుత్ రంగాన్ని ప్రయివేటీకరించే చర్యలో భాగంగా విద్యుత్ సవరణ చట్టాన్ని తీసుకొచ్చి, మోటార్లకు మీటర్లు పెట్టి రైతులకు ఉచిత కరెంటు లేకుండా చేయడానికి కేంద్ర సర్కార్ ప్రయత్నిస్తున్నదని తెలిపారు. నాలుగు లేబర్ కోడ్ లను తీసుకొచ్చి కార్మికులను కష్టాల్లోకి నేడుతున్నదని విమర్శించారు. తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్ మాట్లాడుతూ రైతులకు ఒకేసారి రుణమాఫీ చేయాలనీ, 60 ఏండ్లు పైబడిన వారందరికీ పెన్షన్ చెల్లించాలని డిమాండ్ చేశారు. నిత్యావసర సరుకుల ధరలు రోజురోజుకు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అటవీ హక్కుల చట్టాన్ని కఠినంగా అమలు చేయాలనీ, అటవీ పరిరక్షణ చట్టం సవరణల్లోని నిబంధనలు ఉపసహరించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షులు బుర్రి ప్రసాద్ మాట్లాడుతూ అందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలనీ, ఎన్ఆర్ఈజీఎస్ స్కీమ్‌ను విస్తరించి రోజుకు రూ.600 రూపాయలు వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెండింగ్ బకాయిలను చెల్లించాలనీ, జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని పట్టణ ప్రాంతాలకు విస్తరించాలని డిమాండ్ చేశారు. సీఐటీయు కార్యదర్శి భూపాల్ మాట్లాడుతూ కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెన్షన్ రూ.10వేలు చెల్లించే విధంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

అగ్ని పథ్ స్కీమును రద్దు చేయాలని, కాంట్రాక్టు పద్ధతిని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం ప్రధాన కార్యదర్శి టి సాగర్, రాష్ట్ర నాయకులు శోభన్ మూడ్,ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల వేతనాల బకాయిలు సకాలంలో చెల్లించాలి: రేవంత్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పంచాయతీ కార్మికుల వేతనాల బకాయిలను సకాలంలో చెల్లించాలని టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన సీఎం కేసీఆర్‌కు బహిరంగ లేఖ రాశారు. పంచాయతీ కార్మికుల హక్కుల పరిరక్షణలో ప్రభుత్వ నిర్లక్ష్యంతో వారి కుటుంబాలు అర్థాకలితో అలమటిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

అర్హులున్నా.. ఖాళీల భర్తీ ఏది?

కాంట్రాక్ట్ పద్ధతిలోనే బోధనా సిబ్బంది

- వయోపరిమితి దాటిపోతున్న వైనం
- ఆయుర్వేద పీజీల ఆందోళన



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఆయుర్వేద విద్యను అభ్యసించిన వారు వేలాది మంది ఉన్నా ఏండ్ల తరబడి పోస్టుల భర్తీ మాత్రం చేయడం లేదు. ప్రజా ప్రతినిధులను, ఉన్నతాధికారులను కలిసి వినతిపత్రాలు సమర్పిస్తూ తమ గోడు వెళ్లబోసుకుంటున్నారు. కలిసిన ప్రతి ఒక్కరూ ...చూద్దాం...చేద్దామంటూ కాలం వెళ్లదీస్తుండటమే తప్ప ఫలితం లేకపోవడంతో తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఒకవైపు పోస్టులు ఖాళీగా ఉండి, వాటి భర్తీకి ఆర్థికశాఖ నుంచి ఆమోదం ఉన్నప్పటికీ వాటిని మాత్రం కాంట్రాక్ట్ ప్రాతిపదికనే కొనసాగిస్తున్న అధికారుల తీరుతో ఆవేదన చెందుతున్నారు. గతంలో లేని వయోపరిమితి సడలింపునిచ్చినా నోటిఫికేషన్ వేయకపోవడంతో ఇచ్చిన సడలింపు కూడా వారికి ఉపయోగపడే పరిస్థితి లేదు. ఆయుర్వేద వైద్యవిద్యలో పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన విద్యార్థులు రెగ్యులర్‌గా టీచింగ్ పోస్టుల భర్తీ కి నోటిఫికేషన్ కోసం ఎదురు చూస్తున్నారు. రాష్ట్రంలో రెండు ప్రభుత్వ ఆయుర్వేద కళాశాలలున్నాయి. వీటిలో చదివే వారితో పాటు ఇతర రాష్ట్రాల్లోనూ పీజీ పూర్తి చేసుకున్న వారు రాష్ట్రంలో దాదాపు 2,000 మంది వరకున్నారు.

అయితే గత 12 ఏండ్ల నుంచి నేరుగా నియామకాలు లేకపోవడంతో వాటి కోసం ఇప్పుడా...అప్పుడా అని ఎదురు చూసే పరిస్థితి నెలకొన్నది. 2008లో పోస్టుల భర్తీ కోసం అప్పటికి పీజీలు అందుబాటులో లేరనే కారణంతో వన్ టైం ఆప్షన్ కింద అసిస్టెంట్ ప్రొఫెసర్లను నాన్-టీచింగ్ సైడ్ నుంచి తీసుకునేందుకు వీలుగా ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఆ కన్వర్షన్‌ను అక్కడితోను ఆపకుండా ప్రభుత్వం మరో రెండు సార్లు అదే విధంగా 2010, 2012లో కన్వర్షన్‌ను చేసింది. అయితే మరోసారి అలాంటి ప్రయత్నం చేయకుండా ఆశావహ అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించి నిలుపుదల చేయించారు. అయితే రాష్ట్రంలో ఉన్న 36 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను గతేడాది కాంట్రాక్ట్ ప్రాతిపదికన భర్తీ చేశారు. ఏడాది గడుస్తుండగా మరోసారి ఆ పోస్టులను రెన్యూవల్ చేయించుకునేందుకు ప్రయత్నాలు జరుగుతుండటంతో అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. నేరుగా పోస్టు లను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

ఇప్పటికే వయోపరిమితి దాటుతుండటంతో వీరిలో చాలా మంది అభ్యర్థులకు మరో అవకాశం కూడా పోతోం దని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిరుద్యోగులు, పీజీ అభ్యర్థుల కోసమే కాకుండా రెగ్యులర్ పోస్టుల భర్తీ ద్వారా ఆయుర్వేద వైద్యవిద్యను బలోపేతం చేసేందుకు వీలుగా పోస్టులను రెగ్యులర్ ప్రాతిప దికన భర్తీ చేయాలని ఆ రంగానికి చెందిన నిపుణులు సూచిస్తున్నారు.

విద్యుత్ ఉద్యోగుల ఆందోళనలు వాయిదా

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో: వేతన సవరణ డిమాండ్ చేస్తూ ఆందోళనల బాట పట్టిన విద్యుత్ ఉద్యోగులు వాటిని తాత్కాలికంగా వాయిదా వేసుకున్నట్టు తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ జేఏసీ చైర్మెన్ సాయిబాబు, కన్వీనర్ పీ రత్నాకరరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం నాడొక పత్రికా ప్రకటన విడుదల చేశారు. పీఆర్సీపై జేఏసీ నేతలతో చర్చలు జరుగు తున్నందున ముందుగా నిర్ణయించిన ఆందోళనలను వారం రోజులపాటు వాయిదా వేస్తున్నామన్నారు. ఈ నెల 14వ తేదీ పాల్వంచ, 17న ఎన్పీడీసీఎల్ ఎదుట, 21న ఎస్పీడీసీఎల్ ఎదుట జరగాల్సిన ఆందోళనా కార్యక్రమాలు వాయిదా వేసినట్టు తెలిపారు.

పోడు భూములకు పట్టాలు : హైకోర్టు అనుమతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అడవుల్లోని పోడు భూములకు పట్టాలివ్వాలనే మెమోపై స్టే ఇవ్వడానికి హైకోర్టు నిరాకరించింది. పోడు భూముల క్రమబద్ధీకరణ చర్యలకు అనుమతించింది. ఆ చర్యలు చట్టం, నిబంధనలకు లోబడి ఉండాలని కోరింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది తదుపరి విచారణను జూన్ 22వ తేదీకి వాయిదా వేసింది. పోడు పట్టాల పంపిణీలో పలు అక్రమాలు జరుగుతున్నాయంటూ ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ పద్మనాభరెడ్డి వేసిన పిల్‌ను చీఫ్ జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీల డివిజన్ బెంచ్ సోమవారం విచారించింది. పోడు భూములకు నిబంధనలు పాటించకుండా పట్టాలివ్వడం చట్టవిరుద్ధమని పిటిషనర్ తరపు న్యాయవాది వాదించారు. అటవీ హక్కుల చట్టం, నిబంధనలు, సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధంగా ప్రభుత్వ మెమో ఉందన్నారు. కాగా, పట్టాల పంపిణీని అడ్డుకోవద్దని కోరుతూ ఇందులో తుడుందెబ్బ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రవణ్‌కుమార్ ఇంప్లీడ్ పిటిషన్ వేశారు. ఆయన తరపున న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ వాదనలు వినిపిస్తూ, షెడ్యూల్ తెగల వారికి పథకాలు అందడం లేదన్నారు. కనీసం రోజుకు ఒక్కసారైనా పౌష్టికాహారం తీసుకోలేని పరిస్థితుల్లో వారున్నారని చెప్పారు. పట్టాల పంపిణీ చేస్తే వారు ఆర్థికంగా నిలుదొక్కుకునే అవకాశం ఉంటుందని నివేదించారు. వాదనలు విన్న ధర్మాసనం.. పోడు భూములకు పట్టాల పంపిణీపై స్టే ఇవ్వడానికి నిరాకరిస్తూ, విచారణను జూన్ 22వ తేదీకి వాయిదా వేసింది.

గ్రామ పంచాయతీ కార్మికులకు బకాయి వేతనాలు చెల్లించాలి

- ఆత్మహత్యలను నివారించాలి... లేకపోతే సమ్మె : తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గ్రామ పంచాయతీ కార్మికులకు బకాయి వేతనాలు చెల్లించాలనీ, ఆత్మహత్యలు నివారించాలనీ, ఇతర సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం ఆ యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు పాలడుగు భాస్కర్, రాష్ట్ర అధ్యక్షులు గ్యార పాండు, రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.సుధాకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాగంటి వెంకటయ్య ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని బీఆర్ఎస్ ప్రభుత్వాల రాజకీయ చదరంగంలో గ్రామ పంచాయతీ సిబ్బంది సమిధలవుతున్నారని వారు విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలోని పంచాయతీరాజ్ సంస్థలకు విడుదల చేయాల్సిన సెంట్రల్ ఫైనాన్స్ నిధులను విడుదల చేయకపోవడంతో వేతనాలతో పాటు, ఇజీయస్ స్కీంలో పని చేసే కూలీలకు సైతం బిల్లులు చెల్లించలేకపోతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రతి నెల గ్రామ పంచాయతీలకు చెల్లించాల్సిన స్టేట్ ఫైనాన్స్ నిధులను సైతం చెల్లించకుండా, ట్రెజరీల చెల్లింపులపై ఫ్రీజింగ్ విధించడంతో వేతన బకాయిల సమస్య తీవ్రతరమైందని వివరించారు. బీజేపీ, బీఆర్ఎస్ రాజకీయ క్రీడలో గ్రామపంచాయతీ కార్మికులను బలి చేయొద్దని కోరారు. వెంటనే రెండు ప్రభుత్వాలు నిధులు విడుదల చేసి పెండింగ్ వేతనాలు చెల్లించాలనీ, ఈ చెల్లింపును ఫ్రీజింగ్ నుంచి మినహాయింపు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.

రాష్ట్రంలో నాలుగు నుంచి ఏడు నెలలుగా గ్రామ పంచాయతీ కార్మికులకు వేతనాలు చెల్లించకుండా బకాయిలు పెట్టారనీ, బకాయి వేతనాల కోసం అనేక ఆందోళనలు చేసినప్పటికీ ప్రభుత్వం నుంచి స్పందన లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనేక ప్రాంతాల్లో కార్మికులు అర్థాకలితో భిక్షాటన చేసి జీవనం సాగిస్తున్నారనీ, వచ్చే అతి తక్కువ వేతనాలు కూడా సకాలంలో రాకపోవడంతో కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్న సంఘటనలు అనేకం జరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 12న ఆర్థిక ఇబ్బందులను భరించలేక కామారెడ్డి జిల్లా బీబీ పేట పంచాయతీ కార్యాలయంలో ఫ్యాన్ కి ఉరి వేసుకుని కొంగరి బాబు అనే కార్మికుడు ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు.

సంపాదకీయం

ఉలికిపాటెందుకు?

భారతదేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థ బలహీనపడిందని 'కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై ప్రధాని సహా ఆపార్టీ ఎంపీలు, ముఖ్యమంత్రులు మాటల దాడి చేస్తూ రావణకాష్టంలా దానిని రగిలిస్తూనే ఉన్నారు. ఇంతకీ రాహుల్ ఇంగ్లాండ్‌లో చేసిన వ్యాఖ్యలేంటి? భారత్‌లో స్వేచ్ఛ

ప్రజాస్వామ్య వ్యవస్థ పదిలంగా ఉండడానికి కావలసిన పార్లమెంటు సవ్యంగా పనిచేయడం, మీడియాకు స్వేచ్ఛ, న్యాయవ్యవస్థ నిష్పక్షపాతంగా వ్యవహరించడం, ఆలోచనలను వెల్లడించే అవకాశం లేకుండా పోతున్నాయని రాహుల్ అన్న మాటలో అవాస్తవం ఉందనడానికి విమర్శలకు దిగిన బీజేపీ నాయకులు ఒక్క రుజువూ చూపలేదు.

ప్రమాదంలో ఉందన్నారు. పార్లమెంటులో మాట్లాడిన మాటలు కూడా మాయం అవుతున్నాయన్నారు. ఒక ఆరెస్సెస్ కార్యకర్త కూతురుగా చెప్పుకున్న జర్నలిస్టు ప్రశ్నకు జవాబుగా కదా!? బీబీసీ డాక్యుమెంటరీని నిషేధించి ఈ ఎనిమిదిన్నర ఏండ్ల కాలంలో గ్రీన్ పీస్, అమ్నెస్టీ ఇంటర్నేషనల్, ఆక్స్ ఫామ్ వంటి సంస్థలు పనిచేసే పరిస్థితులు లేకుండా చేసిన భారత ప్రభుత్వం సమాధానం చెప్పుకోవాలి. ప్రత్యేకంగా ఎవరైనా కలిగించగలిగే అప్రదిష్ట ఏముంది?

సుభిక్షంగా ఉన్న దేశంపై రాహుల్ గాంధీ దుష్ప్రచారం చేస్తున్నారని ఆ పార్టీ ఎంపీ ప్రగ్యా ఠాకూర్ "రాహుల్ గాంధీ భారత్‌కు చెందిన పౌరుడు కాదు. ఆయన తల్లి ఇటలీకి చెందిన వ్యక్తి. ఆయనకు ఈ దేశ రాజకీయాల్లో చోటు లేదు. ఇలాంటివాడిని దేశం నుంచి వెళ్లగొట్టాలి" అని వ్యాఖ్యానించారు. కేవలం ఈ మాటలకే రాహుల్ గాంధీని దేశం నుంచి వెళ్లగొడితే అంతకంటే విద్వేష వ్యాఖ్యలు చేసి మత కల్లోలాలకు కారణమైన కమల నాథులకు, దేశానికి అన్నం పెట్టే రైతులపై కాన్వాయ్ తోలి తొమ్మిది మంది రైతులను పొట్టన పెట్టుకున్న కేంద్ర మంత్రి కుమారుడికి ఏం శిక్ష వేయాలి?



గౌరవ ప్రధాన మంత్రి 2014లో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తనకంటే ముందున్న ప్రభుత్వాలను అగౌరవపరుస్తూ అమెరికాలో, కెనడాలో, జర్మనీలో మాట్లాడుతూనే వచ్చారు. పోయిన ప్రభుత్వాలు అంతా పాడుచేసి పోయాయి, మేం వచ్చి అంతా బాగు చేసుకోవలసి వస్తోందని స్వయంగా ప్రధానే విదేశీ వేదికల మీద అనేకసార్లు మాట్లాడారు. అప్పుడు కాంగ్రెస్ ఆ మాటలను తప్పు పట్టింది. ప్రధానిగా విదేశాలకు వెళ్లినప్పుడు దేశానికి ప్రాతినిధ్యం వహించాలి కానీ, పార్టీకి కాదు అంటూ వ్యాఖ్యలు చేసింది. అది కూడా సరైన స్పందన కాదు. విమర్శను ఎక్కడి నుంచైనా ఎదుర్కోనాలి. ఎక్కడైనా సమాధానం ఇవ్వాలి. చేసిన విమర్శకు సమాధానం చెప్పకుండా వంకర వాదనలు చేస్తే ఏమిటి ఉపయోగం?

దేశంలో జరుగుతున్న తప్పులను ఎత్తి చూపడం, పరిస్థితిని చక్కదిద్దడానికి ప్రయత్నించడం దేశ ప్రతిష్టకు భంగం కలిగించడం ఎలా అవుతుందో ఏలిన వారికే తెలియాలి. "ఏ దేశమేగినా పొగడరా నీ తల్లి భూమి భారతిని" అని రాయప్రోలు అన్నాడంటే దేశంలోని సమస్యలను ఎత్తిచూపొద్దని కాదు. కానీ, ఇక్కడ సమస్య ఏమిటంటే, దేశమూ, దేశాన్ని పాలించే పాలకులూ ఒకటేనా? దేశంలో సమస్యలను ప్రస్తావిస్తే, దేశం గురించి చెడు మాట్లాడినట్టా? పాలకులు గురించి కానీ, వారి పాలన గురించి కానీ మాట్లాడితే అదేమైనా దేశద్రోహమా? వాస్తవ పరిస్థితిని అంగీకరించక పోతే దిద్దుబాటుకు అవకాశం ఎక్కడ ఉంటుంది?

ప్రజాస్వామ్య వ్యవస్థ పదిలంగా ఉండడానికి కావలసిన పార్లమెంటు సవ్యంగా పనిచేయడం, మీడియాకు స్వేచ్ఛ, న్యాయవ్యవస్థ నిష్పక్షపాతంగా వ్యవహరించడం, ఆలోచనలను వెల్లడించే అవకాశం లేకుండా పోతున్నాయని రాహుల్ అన్న మాటలో అవాస్తవం ఉందనడానికి విమర్శలకు దిగిన బీజేపీ నాయకులు ఒక్క రుజువూ చూపలేదు.

ప్రపంచ ఆర్థిక వ్యవస్థల్లో మనం ఐదవ స్థానంలో ఉన్నామని మోడీ ఊదర కొడుతున్నారు. కానీ, 194 దేశాల తలసరి ఆదాయ సూచీలో భారత్ 144వ స్థానంలో ఉంది. ప్రపంచ ఆకలి సూచీలో కూడా 121 దేశాలలో భారత్ 107వ స్థానంలో ఉంది. ఈ విషయంలో పాకిస్థాన్, బంగ్లాదేశ్, నేపాల్, మైన్మార్, శ్రీలంకలు కూడా మనకన్నా మెరుగ్గా ఉన్నాయి. పత్రికా స్వేచ్ఛలో మనం 135వ స్థానం నుంచి 150వ స్థానానికి దిగజారాం. ఇది చాలదా భారత ప్రజాస్వామ్య చక్కదనం తెల్పడానికి!



చిన్న సినిమా... సంస్కారం

* హో... హ... హ... మన తెలుగోడి దెబ్బ. గోల్కొండ అబ్బ. ట్రిపుల్ ఆర్ సినిమా పాన్ఇండియా ఏం కర్మ..? సరాసరి ఆస్కార్ ముంగిట్లోనే వాలింది. అవార్డు కొట్టేసింది. ఏమేవ్! వింటున్నావా...

* చాల్లేండి సంబడం. సినిమా తీయడానికి వందల కోట్లు. ఆపైన ప్రమోషన్‌కు పదుల కోట్లు.

* ఆ... అంటే ఏంటీ నీ ఉద్దేశ్యం. తెలుగు సినిమా అంటే నీకు లెక్కేలేదా..?

* ఎందుకు లేదు. గుండమ్మ కథ, మిస్సమ్మ, మాయాబజార్, పాతాళభైరవి వంటి పాత సినిమాలు ఇప్పటికీ మనం చూస్తూనే ఉన్నాంగా.

* అయితే ట్రిపుల్ ఆర్ నీకు నచ్చలేదా..? ప్రపంచం అంతా బ్రహ్మరథం పడుతూవుంటే నీవు మాత్రం ఆ పాత సినిమాల గోల నుండి బయటపడకపోతే నేనేం చేయలేను. సారీ...

* చూడండి సినిమా అంటే నా దృష్టిలో ఓ రసరమ్య కావ్యం. మళ్ళీ మళ్ళీ చూడాలనుకోవడం. హృద్యమైన మన అనుభూతులను అంతా కలసి హాయిగా నెమరువేసుకోవడం.

* అందుకేగా ది గ్రేట్ రాజమౌళి, రామారావు, రామ్‌చరణ్‌ల కాంబినేషన్‌తో ట్రిపుల్ ఆర్ వచ్చింది. వందల కోట్లు ఖర్చుపెట్టింది. అసలు రాజమౌళి బహుబలి కోసం 200కోట్లు ఖర్చుపెడితేనే.... అప్పుడు ఓ తెలుగు సినిమాకు ఇంత పెట్టుబడి ఎలా తిరిగి వస్తుందిరా బాబు అనుకున్నాం. జనం సక్సెస్ చేసి చూపించారు. ఇప్పుడు ట్రిపుల్ ఆర్ కోసం 600కోట్లు ఖర్చుపెట్టారు. ప్రమోషన్‌కోసం మరికొన్ని కోట్లు తెలుసా..? నీవన్నట్టు...



కె శాంతారావు
9959745723

* అంటే ఇదంతా సినిమా సక్సెస్ కోసం పెట్టుబడిలో భాగమే కదండీ...

* మరి సినిమా అంటే మాటలా... ఎంత ఖర్చు. ఎంత పెట్టుబడి. 24 క్రాఫ్ట్ ఉంటాయి. వందల మంది నెలలు, సంవత్సరాల తరబడి రేయింబవళ్ళు అహరహం శ్రమిస్తారు. నీ చిన్న బుర్రకు ఇవేం అర్థం కావులే.

* నేనూ అనేది అదే. సినిమా అంటే కేవలం పెట్టుబడి - శ్రమ - లాభాలే కాదు... అందులో కొన్ని విలువలు, కొంత యథార్థం, విజ్ఞానం, పొందిక ఉండాలని అంటున్నాను. కోట్ల రూపాయల లాభాలు, గుర్తింపు వచ్చినంత మాత్రాన మంచి సినిమా అయిపోదండీ...

* అంటే, ట్రిపుల్ ఆర్ సినిమా నీకు మంచి సినిమా కాదా? ఏంటి? అన్ని డబ్బులు ఖర్చు చేయడం, పెట్టుబడి పెట్టడం వేస్ట్ అంటావా ఏంటీ?

* ఎందుకలా ఉడుక్కుంటారు. ట్రిపుల్ ఆర్ గొడవ ఎత్తింది మీరు. పొంగిపోతున్నది మీరు. నేను కూడా మీలా పొంగిపోవాలంటే ఎలా కుదురుతుంది? నా సొంత అభిప్రాయాలంటూ నాకుండవా ఏంటి?

* సొంత అభిప్రాయాలా... ఏమిటో అవి?

* చిన్న బడ్జెట్‌తో కూడా మంచి చిత్రాలు ఒద్దిగ్గా తీసేవాళ్ళు చాలామంది ఉన్నారు. సత్యజిత్ రే, మృణాల్ సేన్‌లే కాదు, మన తెలుగులో బాపు-రమణలు, విశ్వనాథ్, బాలచందర్‌లు అద్భుత చిత్రాలు తీయలేదా ఏంటి? ఎన్ని సామాజిక వాస్తవికతలు, ఎంత సౌందర్యం... కొట్టొచ్చినట్టు కనిపిస్తాయి. అవి సమాజాన్ని ఎంతగానో ముందుకు నడిపిస్తాయి.

* అంటే ట్రిపుల్ ఆర్‌లో ఇవి లేవా?

* అదిగో మీరు అక్కడే ఆగిపోయారు. నేనేమన్నానంటే... డబ్బు ఒక్కటే సర్వస్వం కాదు. రాబడి కొలమానం అనుకుంటే అశ్లీల బూతు చిత్రాలకు ఫాంటసీ చిత్రాలకు కొదవేముందీ అని.

* అయితే ఇంతకీ ఏమంటావేంటి?

* ఇందాక మీరే అన్నారు కదా... సినిమా అంటే 24క్రాఫ్ట్‌లని, వందలాదిమంది నెలలు తరబడి చేసే శ్రమ అని..

* అవునూ...

* సినిమా అంటే ఏ కొద్దిమంది కలయికో, వందల కోట్ల పెట్టుబడే కాదు, అంతకు మించి సమిష్టి సృజన శీల కృషి, ఫలితంగా వచ్చే సామాజిక చైతన్యం అని నా భావన.

* కాస్త అర్థమయ్యేట్టు మాట్లాడు.

* నేను మాట్లాడేది తెలుగే. కళా సృజన శీలత ఏ ఒక్కరి సొత్తూ కాదండీ. ఎవరి ప్రతిభ వారిదే... చిన్న బడ్జెట్ చిత్రాల్లో కూడా ఊహించని అద్భుత సృజన శీలత ఉంటుందని, ఆ సృజనశీలతే అంతిమంగా ఓ చైతన్యధారగా మారి ప్రేక్షక హృదయాల్లో ప్రవహిస్తుందని చెపుతున్నాను.

* ఆహా... అలాగా... ఓ ఉదాహరణివ్వు.

* నేను ఈ మధ్యన 'ది గ్రేట్ ఇండియన్ కిచన్' మళయాళ సినిమా చూసాను. ఆ సినిమాలో హీరోయిన్ చదువుకున్న స్త్రీనే. ఆ హైందవ స్త్రీ భర్త మాట జవదాటకుండా, భర్తకు ఎదురు చెప్పకుండా ఇంట్లో వారందరికీ, అతిథులకు కోరిన విధంగా వండి వార్చిపెడుతుంది. రేయింబవళ్ళు వంటింట్లోనే గడపవలసి వస్తుంది. ఒకరోజు అనుకోని విధంగా భర్తతో కలసి ఓ రెస్టారెంట్‌కు వెళుతుంది. అక్కడ భోజనం చేస్తూ భర్త, ములక్కాడలు సగం సగం చీకి టేబుల్‌పై శుభ్రంగా పరిచిన వస్త్రంపై ఎంగిలి పడేస్తాడు. భార్య అప్పుడు ఇబ్బందిపడుతూ... చిన్నగా... 'టేబుల్ మానర్స్ కాస్త పాటించండి' అంటుంది. అదిగో అదే ఆ భర్తకు తప్పైపోతుంది. నాకు మానర్స్ లేదంటావా..? అంటూ రెచ్చిపోతాడు. అంటే భర్తకు భార్య మానర్స్ గురించి చెప్పకూడదా? అనే ప్రశ్న అప్పుడు నాకు ఉదయించింది. ఇప్పటికీ అది తొలుస్తూనే ఉన్నది.

* ఏమిటి నీ ఉద్దేశ్యం. నాకు మానర్స్ లేదా..?


* చూశారా.. ఇప్పుడు కూడా మీ గురించి మీరే గుమ్మడికాయ దొంగంటే భుజాలు తడుముకుంటున్నారు.

* డొంక తిరుగుడెందుగ్గానీ, సూటిగా చెప్పి తగలడు.

* ఇందులో తగలడ్డానికి ఏముంది. వడ్లగింజలో బియ్యపు గింజ. సంస్కారం నేర్చుకుంటే వస్తుంది. బోకరిస్తే రాదు. భాష కూడా... అంతే!

ప్రకృతి వనరులు - సామ్రాజ్యవాదం

ప్రపంచంలో ఆయా దేశాలు అభివృద్ధి చెందిన స్థాయికి, వాటి స్వాధీనంలో ఉన్న ప్రకృతి వనరులకి మధ్య పొంతన లేదు. అత్యంత అభివృద్ధి చెందిన జి-7 దేశాలనే తీసుకోండి. అమెరికా, బ్రిటన్, జర్మనీ, ఫ్రాన్స్, ఇటలీ, జపాన్, కెనడా -ప్రపంచంలోని జనాభాలో కేవలం 10శాతం మాత్రమే ఈ ఏడు దేశాలలోనూ ఉన్నారు. కాని 2020 నాటికి ప్రపంచంలోని నికర సంపదలో 50శాతం ఈ దేశాలలోనే ఉంది. ప్రపంచ స్థూల ఉత్పత్తిలో ఐదింట రెండు వంతులు ఈ దేశాలలోనే ఉంది. ఈ దేశాల ఆర్థిక శక్తి చూస్తే తిరుగులేనిదే. కాని ప్రకృతి వనరుల రీత్యా చూస్తే ఈ దేశాలు చాలా తక్కువ మొత్తం మాత్రమే కలిగివున్నాయి.



ప్రభాత్ పట్నాయక్

ప్రస్తుత కాలంలో అత్యంత ముఖ్యమైన ప్రకృతి వనరు ముడి చమురు, సహజవాయువు. ప్రపంచంలో ఉన్న మొత్తం ముడి చమురు, నిల్వల గురించిన అంచనాలు రకరకాలుగా ఉన్నాయి. కాని నిర్ధారణ అయినమేరకు ఈ నిల్వలలో జి-7 దేశాలవద్ద 13శాతం మాత్రమే ఉన్నాయి. అందులో అత్యధికంగా కెనడా దగ్గర 10శాతం ఉన్నాయి. ఇది అమెరికా కు చెందిన ఇంధన సమాచార నిర్వహణ సంస్థ (ఎనర్జీ ఇన్ఫర్మేషన్ అడ్మినిస్ట్రేషన్) వద్ద ఉన్న సమాచారం. ఇందులో అమెరికా అధీనంలో ఉన్న రాతి చమురు నిల్వలు లెక్కలోకి తీసుకోలేదు. ఆ మాటకొస్తే ఇంకా చాలా దేశాల్లో కూడా ఈ రాతి చమురు నిల్వలను పరిగణనలోకి తీసుకోలేదు. అందుచేత ఆ విషయాన్ని పక్కన పెడితే, ప్రపంచంలో ఉన్న చమురు, నిల్వలలో అత్యధిక భాగం అత్యంత అభివృద్ధి చెందిన దేశాలకు వెలుపలే ఉన్నాయి.

ఇక సహజవాయువు నిల్వల గురించి చూద్దాం. ప్రపంచం మొత్తం మీద 188లక్షల కోట్ల ఘన మీటర్ల పరిమాణంలో సహజవాయువు నిల్వలు ఉన్నాయి. అందులో జి-7 దేశాల వద్ద కేవలం 8శాతం మాత్రమే ఉంది. అయితే ఈ దేశాలు చమురు మీద, సహజవాయువు మీద అత్యధికంగా ఆధారపడివున్నాయి. ఇటీవల ఈ దేశాలలో కొన్ని వేరే ఇంధనాలమీద ఎక్కువగా దృష్టి పెట్టడానికి ప్రయత్నిస్తున్నాయి. ఉదాహరణకి: ఫ్రాన్స్ అణు ఇంధనం మీద ఎక్కువ కేంద్రీకరించింది. పర్యావరణానికి ఎదురౌతున్న సమస్యల దృష్ట్యా కూడా ఈ దేశాలు ప్రత్యామ్నాయ ఇంధనాల వైపు దృష్టి పెంచుతున్నాయి. అయినప్పటికీ, ఈ జి-7 దేశాలు ఇప్పటికీ చమురు, సహజవాయువుల మీద గణనీయంగా ఆధారపడివున్నాయి. ఆ దేశాల భౌగోళిక పరిధుల్లో మాత్రం ఈ ఇంధనాలు చాలా పరిమితంగా లభ్యం అవుతున్నాయి.

ఇక వ్యవసాయ ఉత్పత్తుల విషయానికి వస్తే ఈ సంపన్న దేశాల ఉత్పత్తి సామర్థ్యం చాలా పరిమితం. ఆ దేశాల్లోని భౌగోళిక పరిస్థితుల కారణంగా ఈ పరిమితులు ఏర్పడ్డాయి. బ్రిటన్‌లో పారిశ్రామిక విప్లవానికి, తద్వారా పారిశ్రామిక పెట్టుబడిదారీ వ్యవస్థ ఆవిర్భావానికి బాటలు వేసినది జౌళి పరిశ్రమ. కాని అందుకు కావలసిన పత్తి మాత్రం బ్రిటన్‌లో ఎక్కడా పండదు. మొత్తం కావలసిన పత్తినంతటినీ దిగుమతి చేసుకోవలసిందే. అదే మాదిరిగా సంపన్న పారిశ్రామిక దేశాలన్నీ శీతల ప్రదేశంలోనే ప్రధానంగా ఉన్నందువలన, ఆ దేశాల్లో చాలా రకాల పంటలు పండే అవకాశం లేదు. ఒకవేళ పండినా కావలసినంత పరిమాణంలో పండవు. ఏడాది పొడవునా పండవు. అదే సమ శీతోష్ణ, ఉష్ణ దేశాలలోనైతే ఈ పంటలన్నీ ఏడాది పొడవునా, కావలసినంత పరిమాణంలో పండుతాయి. ఆదేశాలు ఈ పంటలను సంపన్న పెట్టుబడిదారీ దేశాలకు సరఫరా చేస్తుంటాయి. పానీయాలు, ఆహార ధాన్యాలు, పత్తి తదితర పీచు పదార్థాలు - ఏవి కావాలన్నా సంపన్న పెట్టుబడిదారీ దేశాలు ఈ ఉష్ణ, సమశీతోష్ణ ప్రాంతాలలోని దేశాలమీద ఆధారపడవలసినదే. ఇటీవల కాలంలో ఈ సంపన్న దేశాలు ఆహారధాన్యాల ఉత్పత్తిలో అభివృద్ధి సాధించి మిగులు పంటను ఉత్పత్తి చేయగలుగుతున్నాయి. అదే మిగులును అడ్డం పెట్టుకుని మూడో ప్రపంచదేశాలమీద వత్తిడులు తీసుకువచ్చి, ఆదేశాలలో ఆహార పంటలు పండించడం మానివేసి, తమకు (సంపన్న దేశాలకు) కావలసిన ఇతర పంటలను పండించి సరఫరా చేయాలని బలవంతం చేస్తున్నాయి.

మొత్తంగా చూసినప్పుడు అత్యంత సంపన్న దేశాలన్నీ చాలా రకాల ముడి సరుకుల కోసం, ఖనిజాలకోసం, వ్యవసాయ ఉత్పత్తులకోసం తక్కిన ప్రపంచం మీద ఎక్కువగా ఆధారపడుతున్నాయి. ఆ సరుకులను తక్కువ

అత్యంత సంపన్న దేశాలన్నీ చాలా రకాల ముడి సరుకుల కోసం, ఖనిజాలకోసం, వ్యవసాయ ఉత్పత్తులకోసం తక్కిన ప్రపంచం మీద ఎక్కువగా ఆధారపడుతున్నాయి. అందుచేత సామ్రాజ్యవాదం తనకు ముడిసరుకులను, ఖనిజాలను అందించే మూడో ప్రపంచదేశాలలో తనకు అనుకూలంగా వ్యవహరించే ప్రభుత్వాలను నెలకొల్పసాగింది. ఇక నయా ఉదారవాద విధానాలను అడ్డం పెట్టుకుని మూడో ప్రపంచ దేశాలను రుణఉచ్చులోకి లాగి ఆ తర్వాత తమకు అనుకూలంగా ఆ దేశాలు వ్యవహరించే విధంగా వాటిపై వివిధ షరతులను విధించడం సర్వసాధారణం అయిపోయింది. దాని వలన ఆ మూడో ప్రపంచదేశాలు తమ తమ దేశాల స్వంత ఆర్థిక వ్యవస్థలను కాపాడుకోలేని స్థితిలో పడిపోయాయి. సంపన్న దేశాలపై ఆధారపడవలసిన పరిస్థితికి నెట్టబడ్డాయి.



ధరలకు నిరంతరాయంగా అవి పొందగలగాలి. ఇదే వలసపాలన కాలంలోనైతే అవి ఈ సరుకులను ఏ ధరా చెల్లించకుండానే, కొల్లగొట్టుకుపోగలిగాయి. ఇప్పుడు ఆ వలసవిధానం లేదు. కాని సంపన్న దేశాలకు మాత్రం ఆ సరుకుల అవసరం మెండుగా ఉంది.

అందుచేత సామ్రాజ్యవాదం తనకు ముడిసరుకులను, ఖనిజాలను అందించే మూడో ప్రపంచదేశాలలో తనకు అనుకూలంగా వ్యవహరించే ప్రభుత్వాలను నెలకొల్పసాగింది. ముఖ్యంగా చమురు ఉత్పత్తి దేశాలలో ఇది ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. ఇక నయా ఉదారవాద విధానాలను అడ్డం పెట్టుకుని మూడో ప్రపంచ దేశాలను రుణ ఉచ్చులోకి లాగి ఆ తర్వాత తమకు అనుకూలంగా ఆ దేశాలు వ్యవహరించే విధంగా వాటిపై వివిధ షరతులను విధించడం సర్వసాధారణం అయిపోయింది. దాని వలన ఆ మూడో ప్రపంచదేశాలు తమ తమ దేశాల స్వంత ఆర్థిక వ్యవస్థలను కాపాడుకోలేని స్థితిలో పడిపోయాయి. వాణిజ్యంలో సంపన్న దేశాలపై ఆధారపడవలసిన పరిస్థితికి నెట్టబడ్డాయి.

ఈ నయా ఉదారవాద పెత్తనాన్ని అంగీకరించడానికి సిద్ధంగాలేని ప్రభుత్వాలను రకరకాల కుట్రలద్వారా తొలగించడం కూడా సామ్రాజ్యవాద వ్యూహంలో భాగమే. తన గూఢచారి విభాగం సిఐఎ ద్వారా కుట్రలు పన్ని, తనకు లొంగివుండని ప్రభుత్వాలను కూలదోయడం, రకరకాల ఆంక్షలను విధించడం ద్వారా ఆ ప్రభుత్వాలను ఇరుకున పెట్టడం వంటి వివిధ రకాల చర్యలకు సామ్రాజ్యవాదం పూనుకుంది. అయితే ఇటీవల కాలంలో సామ్రాజ్యవాద పెత్తనాన్ని ప్రతిఘటిస్తున్న దేశాల సంఖ్య పెరుగుతోంది. అమెరికా ఆంక్షలకు గురవుతున్న దేశాల సంఖ్య అంతకంతకూ పెరుగుతూవుండడమే ఈ ప్రతిఘటన పెరుగుతోందనడానికి నిదర్శనం. సామ్రాజ్యవాదం ఆయువుపట్టు ఇక్కడే ఉంది.

ఒకటో, రెండో దేశాలమీద ఆంక్షలు విధించడం అనేది ఎక్కువ ప్రభావం కలిగించగలుగుతుంది. అది సామ్రాజ్యవాదానికి ఉపయోగపడుతుంది. అదే ఆంక్షలకు గురవుతున్న దేశాల సంఖ్య రానురాను పెరుగుతూంటే అది సామ్రాజ్యవాద ఆధిపత్యానికే ముప్పుగా మారుతుంది. ఆంక్షలకు గురవుతున్న దేశాలు తమకు ఎదురవుతున్న ప్రతికూల పరిస్థితులను తట్టుకోడానికి ఒకదానికి ఒకటి తోడుగా నిలవడం జరుగుతుంది. అప్పుడు ఆంక్షలకు గురి కాకున్నప్పటికీ, తక్కిన మూడో ప్రపంచదేశాలలో కొన్ని తమ తమ ఆర్థిక అవసరాల రీత్యా ఈ దేశాలతో చేతులు కలపడానికి తయారౌతాయి. అంతే కాదు, ఆంక్షలకు గురవుతున్న దేశాలలో అనేక రకాల వనరులు కలిగివున్న దేశాలు కూడా ఉంటే అప్పుడు ఆంక్షలు సామ్రాజ్యవాదానికే నష్టం కలిగిస్తాయి. ఇటీవల రష్యా మీద విధించిన ఆంక్షల విషయంలో సామ్రాజ్యవాదానికి అదే పరిస్థితి ఎదురైంది.

ఉక్రెయిన్ యుద్ధం కేవలం ఒక ఏడాది క్రితమే ప్రారంభం అయినట్టు, రష్యా వంటి ఒక పెద్ద, బలమైన దేశం తన పొరుగున ఉన్న ఒక చిన్న, బలహీనమైన దేశం ఉక్రెయిన్ మీద దురాక్రమణకు పూనుకున్నందువల్లనే ఆ యుద్ధం ప్రారంభం అయినట్లు పశ్చిమ దేశాల మీడియా చిత్రీకరిస్తోంది. కాని నిజానికి దాదాపు ఒక దశాబ్దం క్రితమే ఉక్రెయిన్‌లో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన దేశాధ్యక్షుడు విక్టర్ యానుకోవిచ్‌ను నయా ఉదారవాద శక్తులు సిఐఎ ద్వారా కుట్ర చేసి కూలదోయడంతో ఘర్షణ పరిస్థితులు మొదలయ్యాయి. పశ్చిమ దేశాల సామ్రాజ్యవాదానికి, రష్యాకు మౌలికంగానే వైరుధ్యం ఉంది. ప్రపంచం మొత్తం మీద ఉన్న సహజవాయువు నిక్షేపాల్లో దాదాపు ఐదో వంతు ఒక్క రష్యాలోనే ఉన్నాయి. దానితోబాటు ప్రపంచంలోని చమురు నిక్షేపాల్లో 5 శాతం వరకూ ఒక్క రష్యా వద్దే ఉన్నాయి. ఇదే కీలకమైన కారణం.

ఉక్రెయిన్ యుద్ధానికి మూలం రష్యాకు, పశ్చిమదేశాల సామ్రాజ్యవాదానికి నడుమ ఉన్న ఘర్షణే అని గుర్తించే వ్యాఖ్యాతలు కూడా అదేదో ఏకధృవ ప్రపంచం నుండి బహుళధృవ ప్రపంచంవైపు జరుగుతున్న మార్పులో భాగంగా పరిగణిస్తున్నారు తప్ప రష్యాలోని చమును, సహజవాయువు నిల్వలమీద ఆధిపత్యం కోసం సాగుతున్న ఘర్షణగా దీనిని చూడడం లేదు. అటువంటి ఆధిపత్యం కోసం ప్రయత్నం ఎప్పటినుంచో సాగుతోంది.

బోరిస్‌ఎల్సిన్ అధ్యక్షుడుగా ఉన్న కాలంలో అతని చుట్టూ డజన్ల కొద్దీ సిఐఎ మనుషులు ఉండేవారు. అందువలన అతడిని సామ్రాజ్యవాదం తన అదుపులో ఉంచుకోగలిగింది. అదే పుతిన్ వచ్చాక పరిస్థితి మారిపోయింది. పుతిన్ ఇతరత్రా చాలా పొరపాట్లు చేసివుండొచ్చు. కాని రష్యామీద పశ్చిమదేశాల పెత్తనానికి మాత్రం ఫుల్‌స్టాప్ పడింది. ఇటీవల ఉక్రెయిన్ పర్యటించిన సందర్భంలో అమెరికా అధ్యక్షుడు బైడెన్ "ఉక్రెయిన్ యుద్ధం వెనుక తమ అసలు లక్ష్యం రష్యాలో అధికార మార్పిడి" అని మాట జారడం మనకేమీ ఆశ్చర్యం కలిగించదు. పశ్చిమ దేశాలకు లొంగివుండే ప్రభుత్వం రష్యాలో ఉండాలన్నది సామ్రాజ్యవాదుల కాంక్ష.

అయితే ఏక కాలంలో అనేక దేశాలమీద ఆంక్షలు విధించడం, అందునా రష్యా వంటి పెద్ద దేశం మీద కూడా ఆంక్షలు విధించడం పశ్చిమదేశాలకు ఇప్పుడు ప్రాణసంకటంగా మారింది. ఈ ఆంక్షల ప్రభావం ఆంక్షలకు గురైన దేశాలలోని ప్రజానీకంమీద మాత్రమే పడుతోందని అనుకోరాదు. ఆంక్షలు విధిస్తున్న దేశాలలోని శ్రామిక ప్రజలమీద కూడా ఆంక్షల ప్రతికూల ప్రభావం పడుతోంది. రష్యా నుండి సహజవాయువు దిగుమతులు ఆగిపోవడంతో దానిని ఉపయోగించే సంపన్నదేశాల శ్రామిక ప్రజలు, ముఖ్యంగా యూరప్ దేశాలలోని కార్మికవర్గం, వేలాదిగా రోడ్లమీదకి వచ్చి యుద్ధానికి వ్యతిరేకంగా, ద్రవ్యోల్బణానికి వ్యతిరేకంగా ఆందోళనలకు దిగుతున్నారు. 1970 దశకం తర్వాత ఇంత భారీ ప్రదర్శనలు యూరప్‌లో ఎన్నడూ జరగలేదు. పైగా ఆంక్షల ప్రభావం వలన రష్యా కరెన్సీ విలువ పడిపోతుందని, అక్కడ ద్రవ్యోల్బణం పెరిగిపోతుందని ఆశించిన అమెరికాకు రివర్స్ అయింది. రూబుల్ విలువ డాలర్‌తో పోల్చుకున్నప్పుడు పెరిగింది. అంతే కాదు, ఆంక్షలు విధించిన దేశాలలో ద్రవ్యోల్బణం ఇప్పుడు పెరిగిపోతోంది. ఇప్పటి పరిస్థితి సామ్రాజ్యవాద ఆధిపత్యానికి పెద్ద సవాలుగా తయారైందనడంలో ఎట్టి సందేహమూ లేదు.

(స్వేచ్ఛానుసరణ)

అతడు ప్రేమికుడు

పేరుకు పోయిన మట్టి అట్టడుగున
మనిషి కోసం...
మనిషిని పదార్థంగా
వ్యధార్థంగా అర్థరహితంగా
విపరీతార్థవిలోమ కల్లోలితంగా
ఏమార్చిన పొరలను
ఒక్కోక్కటీ వొలిచేస్తూ
అసలు రూపాన్ని
కనుగొనే పయనంలో...
తనను తాను ఆవిరి చేసుకుని
విశ్వవ్యాప్తమైనవాడు
అతడే... అతడే!
జ్ఞానపు కీకారణ్యంలో
చెట్టునూ పుట్టనూ
పువ్వునూ పుప్పొడి
రేణువుల పరిమళాన్ని
ఆస్వాదించి సాధించిన
విజ్ఞాన వనమాలి అతడే...
చెమట తడిలో మొలకెత్తి
విశ్వాంతరమై ఎగబ్రాకిన
పెట్టుబడి గుండెలపై కూర్చుని



దశాబ్దాల జీవితాన్ని
చుట్టముక్కలుగా కాల్చి
దాని రహస్యాన్ని రాల్చినవాడు
అతడే... అతడే...
సత్య సౌందర్యానంద సమ్మోహితుడు
నిత్య శ్రామిక ప్రేమికుడు
మానవతా సౌధంపై
ఎగిరే పతాకం
ఇదిగో...
ఇన్ని వర్థంతుల తర్వాత కూడా
శత్రువు అదిరిపడేలా
బ్రతికే ఉన్నాడు
అతడు నిజమైన మనుష్యుడు
చిరంజీవుడు కామ్రేడు

(మార్క్స్ వర్థంతికి జోహార్లతో)

- కె. ఆనందాచారి

విద్యాశాఖలో సంక్షోభం తొలగేదెన్నడు?

లెక్కకు మిక్కిలి ఉపాధ్యాయ ఖాళీలతో విద్యాశాఖలో తీవ్రమైన సంక్షోభం నెలకొన్నది. న్యాయ వివాదాల పేరుతో ప్రత్యామ్నాయ పరిష్కార మార్గాలను పట్టించుకోకుండా తాత్సారం చేస్తున్న ప్రభుత్వమే ఇందుకు బాధ్యత వహించాలి. పదిహేడేండ్లుగా పర్యవేక్షణ అధికారుల భర్తీ లేదు. ఎనిమిదేండ్లుగా పదోన్నతులు, ఐదేండ్లుగా బదిలీలు లేవు. డీఈఓ, డిప్యూటీ ఇఓ, ఎంఈఓ, డైట్, బీఈడీ కళాశాల అధ్యాపక పోస్టులు 95శాతం ఖాళీగా ఉన్నాయి. 2000 పైగా ఉన్నత పాఠశాల గెజిటెడ్ ప్రధానో పాధ్యాయులు, 7200 స్కూల్ అసిస్టెంట్, 2100 ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యా యుల పోస్టులు, 1000 పైగా మోడల్ స్కూల్ టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రాష్ట్రపతి నూతన ఉత్తర్వుల (పిఓ-2018) ప్రకారం సర్వీసు నిబంధనలపై వివాదం సమసిపోతుందని, సంక్షోభం పరిష్కారం అవుతుందని ఆశించాం. పీఓ - 2018పైన కూడా న్యాయస్థానాల్లో కేసులు నడుస్తున్నాయి. ఎమ్మెల్సీ ఎన్నికల తాయిలంగా వినియోగించుకుంటున్న పండిట్, పీఈటీల అప్గ్రేడేషన్‌పై న్యాయ వివాదం అపరిష్కృతంగానే ఉంది. పండితులు, పీఈటీల అప్గ్రేడేషన్ పై కొన్ని సంఘాల అవకాశవాద, ద్వంద్వ వైఖరే ఈ సంక్షోభానికి కారణం. కనీసం ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్ ఖాళీలను యాజమాన్యం వారీగానైనా ప్రమోషన్ల ద్వారా భర్తీ చేస్తే పాఠశాలల్లో సబ్జక్టు టీచర్ల కొరత తీరుతుందని, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని భావించాం. మూడేండ్లుగా ఉపాధ్యాయ సంఘాల పోరాటకమిటీ (యుయస్పీసీ), జాక్టో ఆధ్వర్యంలో ఐక్య పోరాటాలు నిర్వహించాం. అన్ని శాఖల్లో పదోన్నతులు ఇచ్చారు కానీ ఉపాధ్యాయులకు మాత్రం ఇవ్వలేదు సరికదా... యుయస్పీసీ, జాక్టో నాయకులపై క్రిమినల్ కేసు పెట్టి నెలకు రెండు వాయిదాలతో కోర్టుచట్టూ తిప్పుతున్నారు.



చావ రవి

పీఓ-2018కి అనుగుణంగా నూతన క్యాడర్లలో ఉపాధ్యాయుల కేటాయింపు అనంతరం పదోన్నతులు వస్తాయని ఆశించాం. ప్రభుత్వం ఏకపక్షంగా జీఓ 317ను విడుదల చేసి, అభ్యంతరాలను బుల్డోజ్ చేస్తూ ఉపాధ్యాయుల శాశ్వత కేటాయింపు పూర్తి చేశామనిపించింది. నష్టపోయిన ఉపాధ్యా యులు వేలాదిగా హైకోర్టులో కేసులు వేశారు. గత సంవత్సర కాలంగా యుయస్పీసీ ఆధ్వర్యంలో వివిధ రూపాల్లో ఆందోళన, పోరాటాలు నిర్వహించిన తరువాత తప్పని పరిస్థితుల్లో జనవరి 15న విద్యామంత్రి, ఆర్థిక మంత్రి ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి యాజమాన్యం వారీగా బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని నిర్ణయం తీసుకున్నారు. సుదీర్ఘ విరామం తరువాత బదిలీలు, పదోన్నతులు నిర్వహిస్తున్నందున ప్రక్రియ సజావుగా సాగేటందుకు ఉపాధ్యాయులు, సంఘాలు సహకరించాలని మంత్రులు కోరారు. అందుకు సంఘాలూ సంసిద్ధత వ్యక్తం చేశాయి. బదిలీ నిబంధనలపై అధికారులతో జరిగిన చర్చల్లో ఉపాధ్యాయులు అందరికీ బదిలీకి దరఖాస్తు చేసుకునే అవకాశం (జీరో సర్వీస్ బదిలీలు) ఇవ్వాలని, జిల్లాల పరిధి తగ్గినందున స్పెషల్ కేటగిరీ పాయింట్లు ఐదుకు తగ్గించాలని



యుయస్పీసీ పక్షాన చేసిన సూచనలను పరిగణనలోకి తీసుకుని ఉంటే బదిలీలపై న్యాయ వివాదాలు వచ్చి ఉండేవి కాదు. తీవ్ర నిరసనలతో అట్టుడికిన ఉద్యోగుల శాశ్వత కేటాయింపు నిబంధనల జీఓ 317పై న్యాయస్థానంలో స్టే రాకుండా శ్రద్ధచూపిన ప్రభుత్వం గత పాతికేండ్లుగా అమలు జరుగుతున్న కౌన్సెలింగ్ నిబంధనల జీఓపై స్టే రాకుండా అడ్డుకోలేక పోవటం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. కక్షిదారులకు న్యాయం జరగాలని కోరుకోవటం సమంజసమే, కానీ ఎట్టిపరిస్థితుల్లోనైనా ప్రక్రియను ఆపాలనే లక్ష్యంతో ఏండ్ల తరబడి కొట్లాడుతున్న ఉపాధ్యాయుల ఉమ్మడి ప్రయోజనా లకు వ్యతిరేకంగా రాజ్యాంగ పరమైన మౌలిక అంశాలను లేవనెత్తి వివాదాస్పదం చేయటమే విషాదం.

గురుకుల విద్యాసంస్థలు, మోడల్ స్కూల్స్ సొసైటీల ఆధ్వర్యంలో నిర్వహింపబడుతున్నందున రాష్ట్రపతి ఉత్తర్వుల అమలు నిర్బంధం కాదు. అయినా నిర్వహించ బూనుకున్నప్పుడు ఉద్యోగుల విభజనలో గత అనుభవాలను పరిగణనలోకి తీసుకుని వివాదరహితంగా రీ అలైన్‌మెంట్ ప్రక్రియను అమలు చేసి ఉండాల్సింది. లేనందున ప్రభావిత మైన ఉపాధ్యాయులు హైకోర్టుకు వెళ్ళి స్టే తెచ్చుకున్నారు. ఇప్పుడు రీ అలైన్‌మెంట్‌పై హైకోర్టులో కేసు పరిష్కారం అయితే గానీ ఆయా విద్యాసంస్థల్లో బదిలీలు, పదోన్నతులు చేపట్టే పరిస్థితి లేదు.

సుప్రీం కోర్టు, హైకోర్టులో ఉన్న న్యాయ వివాదాల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చొరవచూపాలి. పర్యవేక్షణ అధికారుల పోస్టులతో సహా వేసవిలో అన్ని యాజమాన్యాల ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను చేపట్టాలి. తద్వారా ఏర్పడిన ఖాళీలకు ప్రత్యక్ష నియామకానికి నోటిఫికేషన్ ఇచ్చి సత్వరమే భర్తీ చేయాలి. వచ్చే విద్యా సంవత్సరం సజావుగా సాగేటందుకు చర్యలు తీసుకోవాలి. పేద పిల్లలు అధికంగా చదివే ప్రభుత్వ పాఠశాలల్లో పర్యవేక్షణ అధికారులు, ఉపాధ్యాయుల కొరత తీర్చటాని న్యాయస్థానాలు సైతం సానుకూల దృక్పథంతో న్యాయ వివాదాల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి.



అట్టడుగు జాతి నుంచి వచ్చిన ఆణిముత్యం. కష్టాల కడలిని ధైర్యంగా ఎదురీదిన సాహసి. తనతో పాటు తన జాతివారు కూడా ఎదగాలని బలంగా కాంక్షించే మనసున్న మనిషి. ఆవిడే సాకా శైలజ. సౌందర్య ఉత్పత్తుల పరిశ్రమను ప్రారంభించి మరికొంత మంది మహిళలకు ఉపాధి కల్పిస్తున్న ఆమె జీవిత పరిచయం నేటి మానవిలో...

తనజాతి కోసం తపించే శైలజ

శైలజ పుట్టింది హైదరాబాద్‌లో. తండ్రి పత్యారా రాజశేఖర రెడ్డి, రైల్వే ఉద్యోగి. తల్లి యశోద, గృహిణి. శైలజకి ఒక అన్న, ఒక చెల్లి వున్నారు. తల్లిదండ్రులు చిన్నప్పటినుంచీ తమ ముగ్గురు పిల్లలను చాలా క్రమశిక్షణతో పెంచారు. శైలజ చేసే ప్రతి పనిలో తల్లి సహకారం ఉండేది. 19వ ఏట ఆమె వివాహం జరిగింది. అత్తవారింట్లోనూ ఆమెకు కావల్సినంత సహకారం అందింది. భర్త సాకా నాగేశ్వరరావు ప్రభుత్వ కళాశాలలో లెక్చరర్. వీరికి ఇద్దరు పిల్లలు. అమ్మాయి సింధూర తల్లికి వ్యాపారంలో చేయూతనిస్తున్నారు. మనవడు రుద్రాంశ్. కొడుకు ప్రణయ్ కుమార్ ఢిల్లీలో సివిల్స్‌కి ప్రిపేర్ అవుతున్నారు.

ట్యూషన్లు చెబుతూ...

పట్నంలో పుట్టి పెరిగిన పిల్ల పెండ్లి చేసుకుని అంతగా అభివృద్ధి చెందని అదిలాబాద్ జిల్లా చెన్నూరు వచ్చింది. పెండ్లి తర్వాత గ్రాడ్యుయేషన్ చేసిన శైలజ తానూ ఏదైనా చెయ్యాలనుకున్నారు. అంత చిన్న ఊళ్ళో ఉద్యోగాలు వుండవని భర్త చెబితే నిరాశ పడలేదు. తన శక్తిని తాను నమ్ముకున్నారు. చుట్టు పక్కల పిల్లలకి ఇంగ్లీషు ట్యూషన్స్ ప్రారంభించి నెలకి రూ. 1500 పైన సంపాదించటం మొదలు పెట్టారు. ఈలోపు భర్తకు బదిలీ కావడంతో ఆ కుటుంబం సిరిసిల్లకు చేరింది. అక్కడ ఒక పూట ఓ స్కూల్లో పని చేస్తూ మిగతా సమయంలో ట్యూషన్లు చెప్పే వారు. ఈమె ప్రతిభ గుర్తించి ఒక స్కూలు వారు హెడ్ మిస్ట్రస్‌గా ఉద్యోగమిచ్చారు. అక్కడ మంచి పేరు తెచ్చుకున్నారు. అప్పుడే వీరికి బాబు పుట్టాడు. అంతకు ముందు ఒక పాప. కాన్పు కోసం పుట్టింటికి వెళ్ళిన శైలజకు వివిధ రకాల ఆలోచనలు. చిన్న పిల్లవాడితో స్కూలుకి వెళ్ళి పని చెయ్యలేదు. అలా అని ఇంటికే పరిమితం కావడం ఇష్టం లేదు.

సొంతంగా చేయాలని...

తల్లిని సలహా అడిగితే ఉద్యోగం కన్నా సొంతంగా ఏదైనా చేసుకుంటే బాగుంటుంది అన్నారు. బాబు పుట్టి 20 రోజులకు శైలజ బ్యూటీ పార్లర్ నడిపే సూర్యకళను కలిశారు. ఆవిడ దగ్గర బ్యూటీ పార్లర్‌కు సంబంధించిన మెళుకువలు నేర్చుకోవాలనుకున్నారు. అప్పటి పరిస్థితులనుబట్టి ముందు భర్త వద్దన్నా శైలజ పట్టుదల చూసి తర్వాత అంగీకరించారు. రూ. 4000 ఫీజు కట్టారు. సమాజంలో ఆర్థికంగా, వృత్తివరంగా ఉన్నత స్థాయిలో వుండాలని తల్లీ, తండ్రీ ముందునుంచీ చెప్పిన మాటలు శైలజ మనసులో స్థిరంగా నిలిచిపోయాయి. 15 రోజుల్లో బ్యూటీ కేర్‌లో మెళకువలు నేర్చుకున్నారు. భర్త ఇంకా ఆర్థికంగా సహాయం చేయలేకపోతే తన బంగారాన్ని కుదువబెట్టి కావలసిన సరంజామా తెచ్చుకున్నారు.

అధైర్య పడకుండా...

సిరిసిల్లా తిరిగి వచ్చాక తను నేర్చుకున్న విద్యతో ఒక బ్యూటీ పార్లర్ పెడదామనుకున్నారు. ఇక్కడ అలాంటివి నడవవని అక్కడివారు నిరుత్సాహపరిచారు. అయినా భర్తకు నచ్చచెప్పి ఒప్పించారు. పార్లర్ కోసం ఇల్లు అద్దెకు దొరకటం కష్టమయింది. కారణం తమ కులం గురించి అడిగినప్పుడు ఆవిడ ఏ దాపరికమూ లేకుండా యస్.సి. అని చెప్పటమే. చివరికి ఒక ఇంట్లో పార్లర్ తెరిచారు. ముందు రూ. 300 అద్దె అన్నవారు. పార్లర్ సంగతి తెలిసి వెయ్యి రూపాయలు చేశారు. శైలజ అధైర్య పడలేదు. అద్దెకు సరిపడేలా కనీసం వెయ్యి రూపాయలు వచ్చినా చాలని పార్లర్ ప్రారంభించారు. అయితే మొదటి నెల సంపాదన రూ. 5000 వచ్చింది.





చేనేత కార్మికుల కోసం...

అక్కడ వస్త్ర పరిశ్రమలో పవర్ లూమ్స్ రావటంతో మిల్లులున్నవాళ్ళు ఆర్థికంగా బాగున్నారు. కానీ అందులో పని చేసేవాళ్ళు, చేనేత కార్మికులు ఆకలి చావులకు గురయ్యేవారు. వారి కుటుంబాలకి ఏమైనా చెయ్యాలనుకున్నారు. వారి పిల్లలకు ఏదైనా ఉద్యోగాలుంటే ఇప్పించమని అడిగారు. తన చేతిలోని విద్య వారి పిల్లలకి ఉచితంగా నేర్పించారు శైలజ. భార్య పట్టుదల చూసి భర్త ఆమెకు అండగా నిలిచారు. ట్రైనింగ్ ఇచ్చిన పిల్లలకు హైదరాబాద్‌లో ఉద్యోగాలిప్పించారు.

బ్యూటీ స్కూలు మొదలు పెట్టి

తర్వాత పాలిటెక్నిక్ కాలేజ్‌లో కమ్యూనిటీ డెవెలప్ మెంట్ త్రూ పాలిటెక్నిక్‌లో ఒక కోర్సు ఇవ్వటానికి సెంట్రల్ గవర్న మెంట్ అవకాశమిచ్చింది. దాని ద్వారా 30,000 మంది విద్యార్థులకు బ్యూటిషియన్ కోర్సులో ట్రైనింగ్ ఇచ్చారు. 3000 మందికి పైన ఉద్యోగా లిప్పించారు. అది తన జీవితంలో సాధించిన ఒక విజయమంటారు శైలజ. తర్వాత తనే ఒక బ్యూటీ స్కూలు స్థాపించాలని అనుకున్నారు. ఆ సమయంలోనే పరిచయమైన ఒక వ్యక్తి ఈమెకు కార్పొరేట్ స్థాయిలో ఒక బ్యూటీ స్కూలు, ప్లేస్‌మెంట్స్ కూడా వచ్చేటట్లు పెడితే బాగుంటుందన్నారు. కొంత ఆలోచన తర్వాత కరీంనగర్‌లోని ప్రశాంతి నగర్‌లో 2015లో బ్యూటీ స్కూలు మొదలు పెట్టారు. అది మొదలుపెట్టాక సిరిసిల్లలో వున్న డాక్టరు స్నేహితులు ఈవిడ కృషి చూసి మహిళా వ్యాపారవేత్తలకు రుణాలు ఇచ్చే సదుపాయం ఉందని చెప్పారు. దీని గురించి తెలుసుకునేందుకు హైదరాబాద్‌లో శ్రీరామ్‌ను కలిశారు. వారు "మీరిప్పుడు చేస్తున్న ప్రాజెక్టుకు అనుబంధంగా ఏమి చెయ్యగలరో ఆలోచించండి, ప్రాజెక్టు రిపోర్టు తయారు చెయ్యటానికి నేను సహాయం చేస్తా" అన్నారు. శైలజ అప్పుడు ఆలోచించటం మొదలు పెట్టారు.

కోటి రూపాయల లోన్‌తో...

సౌందర్య రంగంలో వున్న ఆమె సౌందర్య సాధనాలు ఎందుకు తయారు చెయ్యకూడదు అనుకున్నారు. అంతకు ముందే బ్యూటీ పార్లర్ నడిపేటప్పుడు ఫేస్ ప్యాక్‌ల వంటివి సొంతంగా తయారు చేసి వాడేవారు. అవి చాలా బాగున్నాయని అందరూ మెచ్చుకునేవారు. ఆ ధైర్యంతో శ్రీరామ్ సహకారంతో సౌందర్య సాధ నాలు తయారు చేసే పరిశ్రమకి అవసరమైన ప్రాజెక్టు రిపోర్ట్‌ని బ్యాంక్‌కి సమర్పించారు. అప్పటికి శైలజకు ప్రాజెక్టు, దాని రిపోర్టు, దానికి సంబంధించిన విషయాలు ఏమీ తెలియవు. అన్నీ శ్రీరామ్ చూసు కున్నారు. అయితే అతనికి విదేశాలలో మంచి అవకాశం వచ్చి వెళ్ళి పోయారు. దాంతో బ్యాంక్ లోన్ వస్తుందనే ఆశను ఆమె వదిలేసుకు న్నారు. కొన్ని రోజులకు బ్యాంకు వారు ఆమె వద్దకు వచ్చి "మేడమ్ మీరు మళ్ళీ బ్యాంక్‌కి రాలేదేంటి' అడిగారు. అంత పెద్దలోన్ మాకెక్కడ వస్తుందనే సంశయంతో రాలేదన్నారు. 'అలాంటి అను మానాలెందుకండీ, మీకు కోటి రూపాయల లోన్ మంజూరు అయింది' అని చెప్పారు. ఆవిడ సంతోషం వర్ణనాతీతం. అంత లోను తన ప్రయత్నాలేమీ లేకుండా, ష్యూరిటీగా ఏ ఆస్తీ పెట్టకుండా రావటం అనేది మాటలు కాదు కదా. కేంద్ర ప్రభుత్వం బ్యాంకు ద్వారా ఒక యస్.సి. అభ్యర్థికి వారి ప్రాజెక్టు రిపోర్టు ఆధారంగా కోటి రూపాయలు మంజూరు చెయ్యటానికి అవకాశం వుందనీ, అదే తనకు వచ్చిందని ఆమెకు తర్వాత తెలిసింది. ప్రాజెక్టు రిపోర్టు తయారీలో సహాయం చేసిన శ్రీరామ్ విదేశాల నుంచే శైలజకి కంప్యూటర్ పరిజ్ఞానమంతా నేర్పారు.

ఉత్పత్తులకు శ్రీకారం...

2015లో కరీంనగర్‌లోని ప్రగతినగర్‌లో బ్యూటీ స్కూల్ స్థాపించారు. 2019లో బ్యూటీ ప్రొడక్ట్స్ ఉత్పత్తికి శ్రీకారం చుట్టారు. విదేశాల వారు 5 కోట్ల వస్తువులకి ఆర్డర్ ఇచ్చారు. కానీ వచ్చి చూసి ఫ్యాక్టరీ పూర్తి హంగులతో వుంటేగానీ ఆర్డర్ ఇవ్వలేమన్నారు. ఆ సమయంలోనే తెలిసిన వారు ఇల్లు ఒకటి ఖాళీగా ఉందని దాన్ని తన ఫ్యాక్టరీకి ఉపయోగిం చుకోవల్సిందిగా చెప్పారు. దాంతో 9 సంవత్సరాలకి లీజు రాసుకుని ఫ్యాక్టరీ మొదలు పెట్టారు. అప్పటి నుండి అంచె లంచెలుగా అనేక ఉన్నతులు సాధించారు. తెలంగాణా స్టేట్ మోడల్ స్కూల్స్‌కి స్కిల్ డెవలప్ మెంట్ ప్రోగ్రామ్స్ ఎస్సెసర్‌గా ఈవిడని ఆహ్వానిస్తారు. ఈవిడ దగ్గర విద్యనభ్యసించిన వారిలో 20మంది పైన ఈ స్కూల్స్‌లో పని చేస్తున్నారు. అలాగే నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వారు నిర్వహించే బ్యూటీ కోర్సు ప్రోగ్రాంలకు ఎగ్జామినర్‌గా వెళ్తారు. మహిళలపై జరుగుతున్న హింసకు వ్యతిరేకంగా ఏర్పాటు చేసిన కమిటీ సభ్యులు పది మందిలో ఈమె కూడా ఒకరు.

చెత్తబుట్టలో పడేశామన్నారు

పరిశ్రమ స్థాపించి ఇన్నేండ్లయినా సమస్యలు ఇప్పటికీ తప్పటం లేదు. ఎంతో శ్రమ పడి జెమ్‌లో (గవర్నమెంట్ ఇ మార్కెటింగ్ సంస్థ)లో తమ ఉత్పత్తులు విక్రయించటానికి నమోదు చేసుకున్నారు. ఆర్డర్లు వస్తున్నాయి. కానీ పంపిన సరకు డబ్బు వెంటనే రాకపోవటం వల్ల పెట్టుబడి సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తున్నది. జెమ్ నుంచి డిఫెన్స్ వారి ఆర్డర్ రూ. 75,000కి వచ్చింది. చైనా బార్డర్ దగ్గర 4 గం.లు లోపలకి ప్రయాణం చెయ్యాలి. దానికి వేరే వాహనం వుండాలి. ఆ ఖర్చులు రూ. 4,000 మీరే పెట్టుకోవాలి అన్నారు. సైనికులకోసం పంపే ఆర్డరు కదా అని ఉత్సాహంగా ఆ ఖర్చు కూడా పెట్టుకుని పంపారు. తర్వాత ఒక మహిళ ఫోన్ చేసి మీ సరుకులు బ్రాండెడ్ కాదు. మేము చెత్తబుట్టలో పడేశాము. మీ బిల్ పే చెయ్యలేమని చెప్పారు. బిడ్డింగ్‌లో వచ్చిన ఆర్డర్, సైనికుల కోసమని ఎంతో శ్రమపడి పంపినది అలా అయ్యేసరికి నీరుగారిపోయారు.

ఎంపికైన ఏకైక మహిళ

వి హబ్ వారు ఎపిడమిక్ సమయంలో హర్ ఎండ్ నౌ ప్రోగ్రాంకి శైలజను సెలెక్ట్ చేశారు. దీని ద్వారా బిజినెస్‌లో నేర్చుకోవాల్సిన అనేక మెళకువల గురించి ఆన్ లైన్ ట్రైనింగ్ ఇచ్చారు. శైలజ బ్రాండింగ్‌లో ఎదుర్కొంటున్న ఇబ్బందులు గమనించి వారి ఆర్థిక సహాయంతో బ్రాండిగ్ క్రియేట్ చేశారు. ఆ సమయంలో ట్రైనింగ్ ఇచ్చిన జర్మనీ యూనివర్సిటీ వారు వివిధ రాష్ట్రాలనుంచి ఒక్కొక్క పారిశ్రామికవేత్తనెన్నుకుని వారి గురించి వుయ్ మీన్ బిజినెస్ (WE mean business.. 20 women entrepreneurs 20 stories) అనే పుస్తకం వేశారు. అందులో తెలంగాణా నుంచి ఎంపికైన ఏకైక మహిళ శైలజ. మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్ ప్రైజస్ అండర్ మినిస్ట్రీ ఆఫ్ కార్పొరేట్ ఎఫైర్స్ (కేంద్ర ప్రభుత్వం) వారు వారి ప్రోగ్రాములకు, క్లాసులు నడపటానికి, వర్క్ షాపులకు శైలజని ఆహ్వానిస్తుంటారు. ఇప్పటి వరకు శైలజకి 16 అవార్డులు వచ్చాయి.

వ్యాపారవేత్తలుగా ఎదగాలి

ఇన్ని ఆందోళనలలో భర్తకి మూడు సార్లు హార్ట్ ఎటాక్ వచ్చింది. శైలజ తల్లి మరణించారు. ఆ సమయంలో ఏడాదిపాటు శైలజ డిప్రెషన్‌లోకి వెళ్ళారు. ఆరోగ్యం విపరీతంగా పాడయింది. డాక్టర్లు ఈవిడ ఇంక రెండు నెలలకన్నా బతకదు, ఈ రెండు నెలలూ జాగ్రత్తగా చూసుకోండి అని చెప్పి పంపించారు. కానీ శైలజ దృఢ సంకల్పానికి మారు పేరు. 'వ్యాపారమంటే అది తమ పని కాదు, తాము చెయ్యలేమని భయపడే తన జాతివారిని మంచి వ్యాపారవేత్తలుగా చెయ్యాలి. అంటే నా కష్టాలు వాళ్ళకి తెలియ కూడదు. అవి తెలిస్తే ఇన్ని కష్టాలు మేము పడలేమని ఇటువైపే చూడటం మానేస్తారు. నా విజయాలే చూడాలి వాళ్ళు. దానితో వాళ్ళు కూడా స్ఫూర్తి పొంది ముందుకు రావాలి' అంటారు శైలజ.

రోజాస్ బ్యూటీ వరల్డ్

ఆరోగ్యం కుదుటపడిన తర్వాత వ్యాపారం చూసుకోవడం మొదలు పెట్టారు. ప్రస్తుతం వారు సెలూన్ సర్వీసెస్, బ్యూటీ ట్రైనింగ్ స్కూల్ నడపటమే



కాకుండా పర్సనల్ కేర్ ప్రోడక్ట్స్, హౌస్ హోల్డ్, హౌస్ కీపింగ్, స్కిన్ అండ్ హైర్ కేర్‌కి సంబంధించి ఆర్గానిక్ ఉత్పత్తులు తయారు చేస్తున్నారు. ఇంతకీ శైలజ నడిపే సంస్థ పేరు చెప్పలేదు కదూ రోజాస్ ఇండస్ట్రీస్ (స్కిన్ ఫ్రెండ్లీ). రోజాస్ బ్యూటీ వరల్డ్ అండ్ బ్యూటీ స్కూల్ (బ్యూటీ - వెల్ నెస్ - కెరియరి బిల్డింగ్). వీరి బ్రాండ్ పేరు సిన్నోవె (synnove) అంటే Gift of Sun. తాను అభివృద్ధిలోకి రావటమేగాక తనవారిని అభివృద్ధి పథంలో నడపాలని తపనపడే శైలజ ఆశయం నెరవేరాలి.

- పి.యస్.యమ్.లక్ష్మి 9866001629

దద్దరిల్లిన పార్లమెంట్

(మొదటిపేజీ తరువాయి)

హోరెత్తించాయి. సభలో గందరగోళం నెలకొనటంతో స్పీకర్ సభను మధ్యాహ్నం 2 గంటల వరకూ వాయిదా వేసినా. సభలో మార్పు రాకపోవడంతో మంగళవారానికి వాయిదా వేశారు.

రాజ్యసభలోనూ ఇదే పరిస్థితి

రాజ్యసభలోనూ ఇదే అంశంపై గందరగోళం చోటుచేసుకుంది. సభ ప్రారంభం అయిన వెంటనే కేంద్ర మంత్రి పియూష్ గోయల్ ఈ అంశాన్ని సభలో లెవనెత్తుతూ, భారత ప్రజాస్వామ్యంపై చేసిన వ్యాఖ్యలపై రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దేశంలో ఎమర్జెన్సీ విధించిన సమయంలో ప్రజాసామ్యం ఏమైంది? చట్టాల ప్రతులను చించేసినప్పుడు ప్రజాస్వామ్యం ఏమైంది? అప్పుడు ప్రజాస్వామ్యం పోయిందే కానీ, ఇప్పుడు కాదంటూ ఆయన వ్యాఖ్యానించారు. గోయల్ వ్యాఖ్యలను రాజ్యసభలో ప్రతిపక్ష నేత ఖర్గే ఖండించారు. సభలో సభ్యుడు కాని వ్యక్తిని పిలిచి క్షమాపణ చెప్పాలని అడగడం ఏమిటని నిలదీశారు. 'ప్రజాస్వామ్యాన్ని అణచివేసి, నాశనం చేసే వారు ప్రజాస్వామ్యాన్ని, దేశ గౌరవాన్ని కాపాడాలని మాట్లాడుతున్నారు' అని విమర్శించారు. చట్టబద్ధమైన పాలన లేదనీ, అదానీ-హిండెన్‌బర్గ్ అంశం నుంచి దృష్టి మరల్చేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదనీ, తామంతా కలిసికట్టుగా ఉన్నామనీ, అదానీ అంశంపై జేపీసీని డిమాండ్ చేస్తూనే ఉంటామని చెప్పారు. దీంతో అధికార, ప్రతిపక్షాల నినాదాల మధ్య సభలో గందరగోళం నెలకొనడంతో సభ మధ్యాహ్నం 2 గంటల వరకూ వాయిదా పడింది. సభ తిరిగి ప్రారంభమైనా పరిస్థితిలో మార్పు లేకపోవడంతో మంగళవారానికి వాయిదా పడింది.

10 వేల మందితో కిసాన్ లాంగ్ మార్చ్

(మొదటిపేజీ తరువాయి)

లాభదాయకమైన ప్రకటించాలనీ, ఉల్లిపాయలకు క్వింటాల్‌కు రూ 2000 మద్దతు ధర ప్రకటించాలనీ, తక్షణమే క్వింటాల్‌కు రూ. 600 సబ్సిడీ ఇవ్వాలనీ, ఎగుమతి విధానాల్లో మార్పులు చేయాలని కూడా ఈ మార్చ్ ప్రధానంగా డిమాండ్ చేస్తోంది. అలాగే రైతులకు పూర్తి రుణమాఫీ చేయాలని, పెండింగ్‌లో ఉన్న విద్యుత్ బిల్లులను రద్దు చేయాలని, 12 గంటల పాటు విద్యుత్ సరఫరా చేయాలని, అకాల వర్షాలు, ఇతర ప్రకృతి విపత్తులు కారణంగా నష్టపోయిన పంటలకు ప్రభుత్వం, బీమా కంపెనీలు నష్ట పరిహారం ఇవ్వాలని కూడా మార్చ్ డిమాండ్ చేస్తోంది. ఇప్పటికే సాగులోఉన్న అటవీ భూములు, పచ్చిక బయళ్ళ, దేవాలయ, ఇనాం, వక్ఫ్, బినామీ భూములను సాగుదార్ల పేరుతో పట్టాలు ఇవ్వాలని మార్చ్ డిమాండ్ చేస్తోంది. పీఎం హౌసింగ్ స్కీమ్ సబ్సిడీని రూ. 1.40 లక్షల నుంచి రూ 5 లక్షలకు పెంచాలనీ, కొత్తగా సర్వే నిర్వహించి దరఖాస్తు దారుల పేర్లను 'డి' లిస్టులో ఉంచాలనీ, ఒక వేళ తప్పనిసరి పరిస్థితుల్లో భూ సేకరణ చేయాల్సి వస్తే కేరళ ఫార్ములా ప్రకారం పరిహారం ఇవ్వాలని కూడా మార్చ్ డిమాండ్ చేస్తోంది. అలాగే వయోజన, ప్రత్యేక పెన్షనును నెలకు రూ. 4 వేలకు పెంచాలని, 2005 తరువాత జాయిన్ అయిన ప్రభుత్వ ఉద్యోగులకు పాత పెన్షన్ పథకాన్ని పునరుద్ధరించాలని, ఎయిడెడ్ పాఠశాలలకు 100 శాతం నిధులు ఇవ్వాలని, ప్రభుత్వ పోస్టుల్లో అన్ని ఖాళీలను భర్తీ చేయాలనీ, కాంట్రాక్ట్ కార్మికులు, స్కీమ్ వర్కర్లందరినీ ప్రభుత్వ ఉద్యోగులుగా క్రమబద్ధీకరించాలనీ, ప్రభుత్వ ఉద్యోగుల్లో నకిలీ ఆదివాసీలను తొలగించి, వారి స్థానంలో నిజమైన ఆదివాసీలను నియమించాలని మార్చ్ డిమాండ్ చేస్తోంది. ఈ మార్చ్‌కు ఏఐకేఎస్ అఖిల భారత అధ్యక్షులు, పొలిట్ బ్యూరో సభ్యులు అశోక్ ధావలే, తదితరులు పాల్గొన్నారు. ఏఐకేఎస్ రాష్ట్ర కార్యదర్శి అజిత్ నవాలే నేతృత్వం వహిస్తున్నారు.

జయహో నాటు

(మొదటిపేజీ తరువాయి)

సినిమా ఏకంగా మరో 6 ఆస్కార్‌లను కైవసం చేసుకుని 95వ ఆస్కార్ అవార్డుల్లో ప్రథమ స్థానంలో నిలిచింది. మొత్తం 11 నామినేషన్లతో బరిలోకి దిగిన 'ఎవ్రీథింగ్ ఎవ్రీవేర్ ఆల్ ఎట్ వన్స్' చిత్రం ఉత్తమ దర్శకుడు, ఉత్తమ నటి, ఉత్తమ సహాయ నటి, ఉత్తమ సహాయ నటుడు, ఉత్తమ స్క్రీన్‌ప్లే, ఉత్తమ ఎడిటింగ్ విభాగాల్లో అవార్డులను గెలిచి రికార్డు క్రియేట్ చేసింది. అలాగే ఉత్తమ సినిమాటోగ్రఫీ, ఉత్తమ ప్రొడక్షన్ డిజైన్, ఉత్తమ ఒరిజినల్ స్కోర్, ఉత్తమ విదేశీ చిత్రం విభాగాల్లో 'ఆల్ క్వైట్ ఆన్ ది వెస్టర్న్ ఫ్రంట్' చిత్రం సొంతం చేసుకుని ద్వితీయ స్థానంలో నిలిచింది. ఇక 'ది వేల్' చిత్రం కూడా బెస్ట్ మేకప్, ఉత్తమ నటుడు కేటగిరీల్లో ఆస్కార్లను దక్కించుకుంది. ఈ ఏడాది ఉత్తమ నటుడిగా బ్రెండన్ ఫ్రాసెర్ (ది వేల్), ఉత్తమ నటిగా మిషెల్ యో (ఎవ్రీథింగ్ ఎవ్రీవేర్ ఆల్ ఎట్ వన్స్), ఉత్తమ దర్శకులుగా డానియెల్ క్వాన్, డానియెల్ షైనెర్ట్ (ఎవ్రీథింగ్ ఎవ్రీవేర్ ఆల్ ఎట్ వన్స్) ఆస్కార్‌లను సొంతం చేసుకున్నారు.

ప్రశాంతంగా ఎమ్మెల్సీ పోలింగ్

నవతెలంగాణ-సిటీబ్యూరో

మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ టీచర్స్ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. మొత్తంగా పోలింగ్ 90.40శాతం నమోదైంది. నాగర్‌కర్నూల్, వనపర్తి, జోగులాంబ-గద్వాల్, నారాయణపేట్, వికారాబాద్ జిల్లాల్లో 90శాతానికిపైగా పోలింగ్ నమోదైంది. మహబూబ్‌నగర్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి, హైదరాబాద్ జిల్లాల్లో 80శాతానికిపైగా పోలింగ్ నమోదైంది. అత్యధికంగా జోగులాంబ-గద్వాల్ జిల్లాలో 97.15 శాతం నమోదుకాగా, అత్యల్పంగా హైదరాబాద్ జిల్లాలో 82.25శాతంగా నమోదైంది. టీఎస్ యూటీఎఫ్ నుంచి పాపన్నగారి మాణిక్‌రెడ్డి, పీఆర్‌టీయూ టీఎస్ నుంచి గుర్రం చెన్నకేశవరెడ్డి, పీఆర్‌టీయూ తెలంగాణ నుంచి కాటేపల్లి జనార్థన్‌రెడ్డి, ఎస్టీయూటీఎస్ నుంచి భుజంగరావు, బీజేపీ నుంచి ఏవీఎన్ రెడ్డి, స్వతంత్ర అభ్యర్థులు జి.హర్షవర్ధన్‌రెడ్డి, అయినేని సంతోష్‌కుమార్, బీసీటీఏ నుంచి ఎస్.విజయ్‌కుమార్ ఇలా మొత్తం 21 మంది పోటీలో ఉన్నారు.

బ్యాలెట్ బాక్సులన్నీ సరూర్‌నగర్ స్టేడియంలోని స్ట్రాంగ్ రూమ్‌కు చేరుకున్నాయి. ఈనెల 16వ తేదీ ఉదయం 6గంంటల నుంచి ఓట్లను లెక్కించనున్నారు. ఒక్కరోజులోనే ఓట్ల లెక్కింపు పూర్తి చేయడానికి అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు.

స్పెషల్ ఆఫీసర్ల నియామకం

ఈనెల 16 ఓట్ల లెక్కింపు సందర్భంగా 8 మంది అదనపు కలెక్టర్లు, జీహెచ్‌ఎంసీ అదనపు కమిషనర్‌ను కేటాయించారు. వీరిలో ఐదుగురు ఐఏఎస్ అధికారులు ఉన్నారు. వికారాబాద్ అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ, రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతీక్ జైన్, జోగులాంబగద్వాల్ జిల్లా అదనపు కలెక్టర్ అపూర్ చౌహాన్, నాగర్‌కర్నూల్ జిల్లా అదనపు కలెక్టర్ ఎం.మనుచౌదరీ, నారాయణపేట్ అదనపు కలెక్టర్ మయాంక్ మిట్టల్, జీహెచ్‌ఎంసీ అదనపు కమిషనర్(ఎన్నికలు) పంకజ, మహబూబ్‌నగర్ జిల్లా అదనపు కలెక్టర్ కె.సీతారామారావు, వనపర్తి జిల్లా అదనపు కలెక్టర్ డి.వేణగోపాల్, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా అదనపు కలెక్టర్ ఏ.నర్సింహ్మారెడ్డి ఉన్నారు. ఐదుగురు ఐఏఎస్ అధికారులను స్పెషల్ ఆఫీసర్లుగా నియమించారు. కౌంటింగ్ హాల్-1కు పంకజ, సీతారామారావు, కౌంటింగ్ హాల్-2కు డి.వేణుగోపాల్, ఏ.నర్సింహ్మారెడ్డిని నియమించారు. వీరితోపాటు కౌంటింగ్ సిబ్బంది, స్టేషనరీ, బ్యాలెట్ బాక్సులను కౌంటింగ్ కేంద్రానికి తరలింపు, ఇతర కార్యక్రమాల నిర్వహణకు అధికారులను కేటాయిస్తూ జిల్లా ఎన్నికల అధికారి ఉత్తర్వులు జారీచేశారు. వికారాబాద్ జిల్లాలో 1890 ఓట్లకుగాను 1790 ఓట్లు పోలయ్యాయి. దోమ, బొంరాస్‌పేట, పెద్దేముల్ మండలాల్లో వందశాతం పోలింగ్ నమోదైంది. పోలింగ్ కేంద్రాలను వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి



సందర్శించారు. అదనపు ఎస్పీమురళీధర్ భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. రంగారెడ్డి జిల్లాలో మొత్తం 9,186 మంది ఓటర్లు ఉన్నారు. వీరి కోసం 31పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. 7,879 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. రాజేంద్రనగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోలింగ్ కేంద్రాన్ని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ హరీశ్ సందర్శించారు. పోలింగ్ కేంద్రాల వద్ద వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. వనపర్తి జిల్లా కిల ఘనపూర్‌లో 11 మంది ఓటర్లు ఉండగా.. 25 మంది సిబ్బందిని ఏర్పాటు చేశారు.

జిల్లా పేరు	ఓటర్ల సంఖ్య	పోలింగ్ శాతం
మహబూబ్‌నగర్	3461	87.75
నాగర్‌కర్నూల్	1822	93.96
వనపర్తి	1335	93.48
జోగులాంబగద్వాల్	877	97.15
నారాయణపేట్	664	93.77
రంగారెడ్డి	9186	86.90
వికారాబాద్	1890	94.76
మేడ్చల్-మల్కాజ్‌గిరి	6536	83.54
హైదరాబాద్	3949	82.25
మొత్తం	29,720	90.40

రేపటినుంచి ఇంటర్ పరీక్షలు

- సర్వం సిద్ధం చేసిన అధికారులు
- పరీక్ష రాయనున్న 9,47,699 మంది
- 1,473 పరీక్షా కేంద్రాల ఏర్పాటు
- విద్యార్థులు ఒత్తిడికి లోనుకావొద్దు : సబిత

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ పరీక్షల నిర్వహణ కోసం ఇంటర్ బోర్డు అధికారులు సర్వంసిద్ధం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకో కుండా ఏర్పాట్లను పూర్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్ ప్రథమ సంవత్సరం నుంచి 4,82,677 మంది, ద్వితీయ సంవత్సరం నుంచి 4,65,022 మంది కలిపి మొత్తం 9,47,699 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. రాష్ట్రంలో 1,473 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో ప్రభుత్వ జూనియర్ కాలేజీలు, ప్రభుత్వ రంగ కాలేజీలు 614, ప్రయివేటు జూనియర్ కాలేజీలు 859 ఉన్నాయి. రాష్ట్రంలో 1,473 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 1,473 మంది డిపార్ట్‌మెంటల్ అధికారులు, 26,333 మంది ఇన్విజిలేటర్లు, 75 మంది ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు, 200 మంది సిట్టింగ్ స్క్వాడ్‌లను ఇంటర్ బోర్డు నియమించింది. ఇంటర్ పరీక్షల నిర్వహణపై విద్యాశాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి సోమవారం హైదరాబాద్‌లో జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటర్మీడియట్ విద్యార్థులు ఒత్తిడి, భయాందోళనలకు లోనుకాకుండా పరీక్షలకు హాజరై విజయం సాధించాలని తెలిపారు. ఇంటర్మీడియట్ పరీక్షలకు విద్యార్థులు ఒత్తిడికి లోనుకాకుండా చూడాల్సిన బాధ్యత ఆయా యాజమాన్యాలతో పాటు అధ్యాపకులు, తల్లిదండ్రులకు ఉందని అన్నారు. పరీక్షలపై విద్యార్థులకున్న సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేసి వారిలో మనోధైర్యాన్ని నింపాలని కోరారు. రాష్ట్రంలో బుధవారం నుంచి నిర్వహించనున్న ఇంటర్ పరీక్షలకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేశామని వివరించారు. జిల్లా స్థాయి కమిటీ చైర్మెన్లుగా కలెక్టర్లు బాధ్యతతో వ్యవహరించి పరీక్షల నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లు తలెత్తకుండా చూడాలని మంత్రి ఆదేశించారు. ఇంటర్ పరీక్షలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను



రూపొందించుకోవాలని సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద ప్రత్యేక జాగ్రత్తలతోపాటు విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు, తాగునీరు, ఓఆర్‌ఎస్ అందుబాటులో ఉంచాలని కోరారు. పరీక్షా కేంద్రాల వద్దకు విద్యార్థులు సకాలంలో చేరేందుకు వీలుగా ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయాలని ఆర్టీసి అధికారులను ఆదేశించారు. పరీక్షల నిర్వహణ సమయంలో తలెత్తే సమస్యలకు సత్వర పరిష్కారం లభించే విధంగా ప్రత్యేకంగా కంట్రోల్ రూం ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. పరీక్షా కేంద్రాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తూ ఎప్పటికప్పుడు వాటిని మానిటరింగ్ చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పరీక్షలు సమర్థవంతమైన రీతిలో, పారదర్శకంగా నిర్వహించాలని కోరారు. పరీక్షల సమయంలో విద్యుత్‌కు ఆటంకం కలగకుండా చూడాలని కలెక్టర్లను ఆదేశించారు. హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం విద్యార్థులకు కల్పించామన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. విద్యార్థుల్లోని ఒత్తిడిని తగ్గించడానికి కౌన్సిలర్ల ద్వారా వారికి మోటివేషన్ ఇప్పించి పరీక్షలకు పూర్తి స్థాయిలో సన్నద్ధం చేయించాలని కోరారు. ఈ సమావేశంలో విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ, ఇంటర్ బోర్డు కార్యదర్శి నవీన్ మిట్టల్ తదితరులు పాల్గొన్నారు.

రక్షణశాఖపై సుప్రీం ఆగ్రహం

(మొదటిపేజీ తరువాయి)

తీర్పులో సుప్రీం పేర్కొంది. అయితే సుప్రీంకోర్టు ఆదేశాల్ని బేఖాతరు చేస్తూ, బకాయిల చెల్లింపు గడువు పెంచుతూ రక్షణశాఖ ఏకపక్షంగా నోటిఫికేషన్లు జారీచేసింది. ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ సీజేఐ చంద్రచూడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. "చట్టాన్ని తన చేతుల్లోకి తీసుకోవటమే ఇది. ఇలాంటి ప్రయత్నం చేయరాదు. గడువు పెంచుతూ జారీచేసిన నోటిఫికేషన్లు ముందు రద్దు చేసిన తర్వాతే, కేంద్రం దరఖాస్తును పరిశీలిస్తా"మని అటార్నీ జనరల్ ఆర్.వెంకట రమణికి తెలిపారు. చెల్లించాల్సిన బకాయిలు ఎంత ఉన్నాయి? ఎంచుకున్న పద్ధతులేంటి? వృద్ధులు, వితంతు మహిళలకు తొలి ప్రాధాన్యత ఇస్తున్నారా? అనే వివరాలు ఇవ్వాలని సీజేఐ ఆదేశించారు. కేసు విచారణను మార్చి 20నాటికి వాయిదా వేశారు.

పిటిషనర్లు, మాజీ సైనిక ఉద్యోగుల తరఫున సీనియర్ న్యాయవాది హుజెఫా అహ్మదీ వాదనలు వినిపించారు. "పెన్షన్ బకాయిల చెల్లింపు గడువును కేంద్రం పదే పదే పొడగిస్తోంది. కేంద్రం ఇదే విధంగా వ్యవహరిస్తే, బకాయిల చెల్లింపు పూర్తవ్వడానికి 2024 దాకా ఆగాలి. ఇది చాలా చాలా అన్యాయం. బకాయిల చెల్లింపు తాత్సారం చేయటం వల్ల ఎంతోమంది నష్టపోతున్నారు. ఈమధ్యకాలంలో 4లక్షల మంది పెన్షనర్లు చనిపోయారు. వారు బకాయిలు అందుకోలేరు. ఈ విషయం కోర్టు దృష్టికి తీసుకొచ్చాను. పెన్షనర్లకు చెల్లింపులు అనగానే నిధులు లేవన్న సంగతి కేంద్రానికి గుర్తుకు వస్తోంది" అని హుజెఫా అహ్మదీ అన్నారు.

సీబీఐ విచారణ వద్దు...

(మొదటిపేజీ తరువాయి)

న్యాయమూ ర్తులు జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ ఎంఎం సుందరేష్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. తెలంగాణ పోలీసుల తరఫు సీనియర్ న్యాయవాది దుష్యంత్ దవే వాదనలు వినిపిస్తూ విచారణను సీబీఐకి అప్పగించడాన్ని వ్యతిరేకించారు. 'నేను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని అడిగాను. కేసును సీబీఐ స్వాధీనం చేసుకోలేదు' అన్నారు. దర్యాప్తుకు సంబంధించిన పత్రాలను తాము సీబీఐకి అందచేయలేదని తెలిపారు. బీజేపీ తరఫు సీనియర్ న్యాయవాది మహేష్ జెఠ్మలానీ వాదనలు వినిపించారు. 'కేసు కోర్టులో ఉండగా సీబీఐ విచారణ కొనసాగించకూడదు. అది నిరుపయోగంగా మారుతుంది. ఇది సాధారణ నియమం. విచారణ కొనసాగించొద్దు. లేదంటే మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాల్సి ఉంటుంది. మేము యథాతథ స్థితికి ఆదేశిస్తాం' అని ధర్మాసనం పేర్కొంది. కేసు తదుపరి విచారణను జూలై 31కి వాయిదా వేసింది.

ఐక్యంగా ముందుకుసాగుదాం

(మొదటిపేజీ తరువాయి)

పార్టీల రాష్ట్ర కార్యదర్శులు కూనంనేని సాంబశివరావు, తమ్మినేని వీరభద్రం ఒక ప్రకటన విడుదల చేశారు. భవిష్యత్తు కార్యాచరణ గురించి కీలక నిర్ణయాలు తీసుకున్నామని తెలిపారు. దేశంలో, రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ పరిస్థితులు, కమ్యూనిస్టు ఉద్యమం ఎదుర్కొంటున్న సవాళ్ళ, బాధ్యతల గురించి సమావేశంలో చర్చించామని పేర్కొన్నారు. రాబోయే కాలంలో ఉభయ కమ్యూనిస్టు పార్టీలు మరింత దృఢంగా ఐక్యంగా వ్యవహరించాలని నిర్ణయించామని వివరించారు. ఈనెలలో సీపీఐ(ఎం), ఏప్రిల్, మేలో సీపీఐ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నిర్వహించబోయే ప్రచారోద్యమాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర పార్టీలు విడిగా పిలుపులిచ్చినప్పటికీ పరస్పరం సంఘీభావాలు, సహకారంతో రాష్ట్రంలో ఈ ఉద్యమం ద్వారా ప్రజల్లోకి చొచ్చుకుపోవాలని సమావేశం నిర్ణయించిందని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ వ్యతిరేక శక్తుల ఐక్యతకు కృషిచేస్తూ పొత్తులు, ఎత్తులలో ఉభయ కమ్యూనిస్టులు ఐక్యంగా వ్యవహరించాలని సమావేశం అభిప్రాయపడిందని వివరించారు. ఈ సమావేశంలో సీపీఐ నుంచి చాడ వెంకటరెడ్డి, పల్లా వెంకటరెడ్డి, తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, సీపీఐ(ఎం) నుంచి చెరుపల్లి సీతారాములు, జూలకంటి రంగారెడ్డి, జాన్‌వెస్లీ, పోతినేని సుదర్శన్ పాల్గొన్నారు.

ధనావత్ పద్మకు డాక్టరేట్



నవతెలంగాణ-బోడుప్పల్

బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ నివాసం ఉంటున్న ధనావత్ పద్మకు ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి డాక్టరేట్ అందించారు. ఈ మేరకు సోమవారం నాడు ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో తెలుగు విభాగం అధ్వర్యంలో ఏర్పాటు చేసిన డాక్టరేట్ ప్రదానోత్సవంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు విభాగం అధ్యక్షులు ఆచార్య కాశీం చేతుల మీదుగా అందుకున్నారు. తెలంగాణ కథలలో గిరిజన జీవన చిత్రం అనే అంశంపై ఆచార్య సూర్యా ధనుంజయ పర్యవేక్షణలో చేసిన పరిశోధనకుగాను ఈ అవార్డు అందుకున్నట్లు తెలిపారు. ఉమ్మడి నల్గొండ జిల్లా మేళ్లచెరువు మండలం, జగ్గుతండాకు చెందిన గిరిజన మహిళ నేడు ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి తెలుగు విభాగం డాక్టరేట్ పొందడం పట్ల ఆమె కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పద్మ మాట్లాడుతూ పరిశోధనలో తనకు సహకరించిన ప్రతి ఒక్కరికీ పేరు పేరునా ధన్యవాదాలు తెలిపారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం



నవతెలంగాణ-సంతోష్‌నగర్

అఖిల భారత ఎన్.టీ.ఆర్ అభిమాన సంఘాల సమాఖ్య సభ్యులు మరియు నగర తెలుగు యువత నాయకులు శ్రీ దాస్ ప్రకాష్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. అఖిలభారత ఎన్.టీ.ఆర్ అభిమాన సంఘాల సమాఖ్య అధ్యక్షులు పిన్నమనేని సాయిబాబా, నగర అధ్యక్షులు నాగునగేష్, దాస్‌ప్రకాష్ మృతికి సంతాపాన్ని తెలియజేస్తు వారి కుటుంబసభ్యులను పరామర్శించి, వారికి ఆర్థిక సహాయం అందించి భరోసా కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి బార్ల శ్రవణ్ కుమార్, సల్వార్ శ్రీరాములు, రాజేశ్వరగౌడ్, వేణు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

మంత్రి సబితా ఇంద్రారెడ్డి



నవతెలంగాణ-బడంగ్‌పేట్

రాష్ట్ర ప్రభుత్వం సీఎం కేసీఆర్ నాయకత్వంలో క్రీడలను ఎంతగానో ప్రోత్సహిస్తున్నారని, యువతకు క్రీడలతోనే మానసిక ఉల్లాసంతోపాటు మనోధైర్యం కల్గుతుందని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి అన్నారు. సోమవారం మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న సుల్తాన్‌పూర్‌లోని ఏబీఆర్ఆర్ క్రీడా మైదానంలో బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలను పార్టీ అధ్యక్షులు రామిడి రాంరెడ్డి, కార్పొరేటర్ జెనిగ భారతమ్మలతో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సీఎం కేసీఆర్ నాయకత్వంలో క్రీడాకారులను ఎంతగానో ప్రోత్సహిస్తున్నారని తెలిపారు.

నేటి విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మంచి ప్రతిభను కనపర్చి గుర్తింపు పొందాలన్నారు. యువతకు క్రీడలతో మానసిక ఉల్లాసంతో మనోధైర్యం కల్గుతుందన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు నిర్వహించి క్రీడాకారులను ప్రోత్సహించటం అభినందనీయమన్నారు. క్రికెట్ పోటీలలో 40 జట్లు పాల్గొననున్నట్లు విజేతగా నిలిచిన జట్టుకు ప్రథమ బహుమతి రూ.50వేల నగదు, రెండవ బహుమతి రూ.25వేలు నగదుతో పాటు కప్పులు అందచేయటం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బొర్ర జగన్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యులు రఘునందనాచారి, పార్టీ సీనియర్ నాయకులు పెద్దబావి ఆనంద్‌రెడ్డి, వంగేటి లక్ష్మారెడ్డి, ఎల్లారెడ్డి, మాజీ ఉపసర్పంచ్ పోరెడ్డి వెంకట్ రెడ్డి, నాయకులు జెనిగ శ్రీనివాస్, బొర్ర మాధవ రెడ్డి, పురుషోత్తం, వి.మధు, బాబు క్రికెట్ పోటీల నిర్వహకులు అమర్‌సింగ్, రమేష్, బద్రు నాయక్, తిరుపతి, లచ్చు క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

మార్నింగ్ వాక్‌తో ప్రజా సమస్యలు తెలుస్తాయి

ఎల్బీ నగర్ శాసన సభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి



నవతెలంగాణ-ఎల్బీనగర్

ఎమ్మెల్యే తాను నిత్యం ప్రజల్లో ఉంటున్న మార్నింగ్ వాక్‌తో మరిన్ని సమస్యలు తెలుస్తాయని ఎల్బీనగర్ శాసన సభ్యులు దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. సోమవారం మన్సురాబాద్ డివిజన్ పరిధిలోని కాస్మో పాలిటిన్ కాలనీ, వీకర్ సెక్షన్ కాలనీ, అమ్మదయ కాలనీ, రాగల ఎంక్లేవ్, వివేకానందనగర్ కాలనీల యందు పాదయాత్ర చేశారు. దానిలో భాగంగా కాస్మోపాలిటిన్ కాలనీ నందు పార్క్ స్థలం పక్కనే ఉన్న వీకర్ సెక్షన్ కాలనీకి అనుకొని ఉండడంతో కాలనీవాసులు మాకు కూడా ఇంకో వైపు నుంచి గేటు పెట్టాలని ప్రతిపాదనలు చేశారు. దానిలో భాగంగా ఇరువర్గాల మరోసారి కూర్చోపెట్టి మాట్లాడి తగు పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే వీకర్ సెక్షన్ కాలనీ నందు రోడ్డు మీద వృధాగా వదిలిన మంచినీరు మీద కాలనీవాసులచే మాట్లాడారు. నీరు అలా రోడ్డు మీద వృధాగా వెళ్లకుండా తగు కట్టడి చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే అమ్మదయ కాలనీ నందు మన్సురాబాద్ పెద్ద చెరువు నందు పార్క్‌ను అభివృద్ధి చేశామని, కాలనీవాసుల కోరిక మేరకు చెరువు వెనుక వైపు పెద్దగేటు కాకుండా చిన్న గేటు పెట్టించామన్నారు. రాగాల ఎన్‌క్లేవ్ నందు రోడ్డు మరమ్మతుల పనులు కూడా త్వరితగతిన పూర్తిచేస్తామని తెలిపారు. వివేకానంద నగర్ కాలనీ నందు మూడు నెలల నుంచి డ్రైనేజీ పొంగిపొర్లు తున్న నేపథ్యంలో అధికారులచే చర్చించి శాశ్వత పరిష్కారం చేయడం జరుగుతుందని అన్నారు. నియోజకవర్గ పరిధి లోని ప్రధాన సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కారం చేస్తూ, ఒక రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతామని తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు జక్కిడి మల్లారెడ్డి, మాజీ అధ్యక్షులు టంగుటూరి నాగరాజు, యువ నాయకులు జక్కిడి రఘువీర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, రమేష్, అశోక్ యాదవ్, జగదీశ్, రాంకోటి, వెంకన్న, శ్రీధర్ పలు అధ్యక్ష, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతా

ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల



నవతెలంగాణ-సంతోష్‌నగర్

ప్రజల సమస్య పరిష్కారానికి అభివృద్ధి లక్ష్యంగా, సంక్షేమ ఫలాన్ని అందించి మలక్‌పేట నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్ది తెలంగాణ రాష్ట్రంలో ఆదర్శంగా తీసుకోవాలని ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ ఆదేశానుసారంగా మలక్‌పేట నియోజకవర్గం ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాలా అన్నారు. సోమవారం నియోజకవర్గం డివిజన్ పరిసర ప్రాంతాల్లో జీహెచ్ఎంసీ అధికారులతో పర్యటించారు. నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులను అధికారులతో కలిసి ఎమ్మెల్యే బాలల సైదాబాద్ డివిజన్ సంకేశ్వర్ బజార్ నాలాల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, జనాభా పెరుగుదలనుగుణంగా ఎలాంటి సమస్య తలెత్తకుండా చూడవలసిన బాధ్యత కాంట్రాక్టులదేని ఆదేశించారు. అనంతరం ఈనెల రంజాన్ పండుగ సందర్భంగా ముస్లిం సోదరులకు సమస్య లేకుండా చూడాలని కోరారు. డ్రైనేజీ వ్యవస్థ, మంచినీరు, సీసీ రోడ్లు పరిశుభ్రత పాటించాలన్నారు. ఎక్స్ రోడ్ హనిఫియ మస్జిద్ కమ్యూనిటీ ప్రెసిడెంట్ అబ్దుల్ అజీజ్, ఫిరోజ్, సన్ వాజ్, సోషల్ వర్కర్స్ రాజపతి, నరసింహ, స్థానిక నాయకులు అధికారులు కలిసి పర్యవేక్షించారు. సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సీనియర్ నాయకులు, అధికారులు, సిబ్బంది కార్యకర్తలు, అభిమానులు, సభ్యులు, యువకులు, పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఏకపక్షంగా వ్యవహరిస్తున్న టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్

బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ సామల బుచ్చిరెడ్డి



నవతెలంగాణ-బోడుప్పల్

బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ సూపర్ వైజర్ రాధాకృష్ణ రెడ్డి ఏకపక్ష నిర్ణయాలతో మున్సిపల్ కార్పొరేషన్‌కు తీవ్రమైన నష్టం జరుగుతుందని బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ సామల బుచ్చిరెడ్డి అన్నారు. సోమవారం నాడు తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ రాధాకృష్ణ రెడ్డి టౌన్ ప్లానింగ్ విభాగాన్ని వసూళ్ల కేంద్రంగా మలుచుకుని ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ అటు ఉన్నాతధికారులను,ఇటు ప్రజాప్రతినిధులను తప్పుదోవ పట్టిస్తున్నారని వాపోయారు. నగరంలో ఎక్కడ కూడా టీఎస్ బీ పాస్ అనుమతులు లేకుండా చేపట్టిన నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని అనేకమార్లు సూచనలు చేసిన కూడా పెడచెవిన పెట్టాడని ఫలితంగా కార్పొరేషన్‌కు రావాల్సిన కోట్ల రూపాయల ఆదాయం రాకుండా పోయిందని హెచ్చరించారు. హరితహారం ద్వారా అనేక సంవత్సరాల నుండి బోడుప్పల్ ప్రధాన మార్గంలో సుందరంగా పెంచిన గార్డెన్‌ను ఏకపక్షంగా వ్యవహరించి ప్రచార బోర్డుల కోసం మొక్కలు నరికేసిన కూడా ఎజన్సీపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు అంటే అందులో అతని వాటా ఏమైనా ఉందా అని ప్రశ్నించారు. మేం ప్రజలకు జవాబుదారీగా ఉంటుంటే అతను ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ కార్పొరేషన్‌కు చెడ్డ పేరు తెచ్చేలా చూస్తున్నారని అన్నారు. అతని వసూళ్ల చిట్టాను త్వరలోనే ఉన్నత అధికారులకు అందించి అతని చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేస్తానని చెప్పారు.

ఏజెన్సీపై కఠిన చర్యలు తప్పవు

- కార్పొరేషన్ డీఈ శారద
- 'హోర్డింగ్‌ల కోసం మొక్కలు నరికేశారు' కథనానికి స్పందన

నవతెలంగాణ-బోడుప్పల్

'హోర్డింగ్‌ల కోసం మొక్కలు నరికేశారు' అనే శీర్షికతో ఆదివారంనాడు 'నవతెలంగాణ'లో ప్రచురితమైన కథనానికి బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ డీఈ హరితహారం పర్యవేక్షకులు శారద స్పందించారు. హోర్డింగ్‌లకు అనుమతులు మంజూరు చేసిన అంశం తమకు తెలియదని, ఒకవేళ అనుమతులు ఇస్తే సంబంధిత విభాగం మాకు సమాచారం ఇచ్చి ఉంటే మొక్కలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసేవాళ్ళమని అసలు యాడ్ ఏజెన్సీ వాళ్ళు ఇష్టానుసారంగా మొక్కలు ఎందుకు, ఎవరిని అడిగి నరికేశారో చెప్పాలంటూ నోటీసులు జారీ చేస్తామని నవతెలంగాణకు తెలిపారు. ఈ సందర్భంగా నవతెలంగాణ ప్రతినిధితో మాట్లాడిన డీఈ మొక్కలు నరికేసిన అంశం మా దృష్టికి రాగానే పరిశీలించామని అక్కడ సుమారు 60కి పైగా మొక్కలు నరికేసినట్లు మా దృష్టికి వచ్చింది అన్నారు. దీనిపై కమిషనర్‌కు లేఖ రాసి మొక్కలు నరికేసిన యాడ్ ఏజన్సీకి నోటీసులు జారీచేస్తామని తెలిపారు. అంతేకాకుండా నిరంతరం నగరం పచ్చని మొక్కల పెంపుదల కోసం అహర్నిశలు కృషి చేస్తున్నామని, ఎవరైనా మొక్కలు నరికేస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

ఈత చెట్టుపై నుంచి కింద పడి గీత కార్మికుడు మృతి



నవతెలంగాణ-హయత్‌నగర్

ఈత చెట్టు మీద నుండి గీత కార్మికుడు పడి దుర్మరణం పాలైన ఘటన హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్ఐ చందర్‌సింగ్ తెలిపిన వివరాల ప్రకారం అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధిలోని తారామతిపేట గ్రామంలో నివాసం ఉంటున్న దండుకృష్ణ స్వామి(58) రోజు మాదిరిగా సోమవారం కూడా ఈత చెట్టు ఎక్కి కల్లు గీసేందుకు వెళ్ళాడు. కొంతసేపటికి చెట్టు పై నుండి కింద పడిపోవడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు చూసి అతని కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా, ఘటనా స్థలానికి గ్రామ సర్పంచి మూల మహేష్ గౌడ్, పోలీసులు చేరుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వాహనదారులకు అవగాహన కార్యక్రమం



నవతెలంగాణ-బోడుప్పల్

వాహనాలు నడిపే సమయంలో ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించి ప్రమాదాలను నిరోధించాడానికి కృషి చేయాలని ఉప్పల్ ట్రాఫిక్ సీఐ పార్థసారథి అన్నారు. జాతీయ భద్రత వారోత్సవాలలో భాగంగా సోమవారం నాడు పర్వతాపూర్‌లోని అరోరా టెక్నాలజికల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ కాలేజీలోని స్టూడెంట్ ఆక్టివిటీ కమిటీ, సేఫ్టీ క్లబ్ మరియు ఉప్పల్ ట్రాఫిక్ సిబ్బంది సంయుక్త ఆధ్వర్యంలో ఉప్పల్ క్రాస్ రోడ్స్ వద్ద వాహనాలను నడిపేవారు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప్పల్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ పార్థసారథి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ సిగ్నల్స్ అనుగుణంగా ముందుకి వెళ్తూ పక్క వాహనానికి ఇబ్బంది కలగకుండా వాహనాలు నడపాలని తెలిపారు. మరొక ఇన్స్‌పెక్టర్ శాంసన్ జోసెఫ్ మాట్లాడుతూ ప్రతి ఒక్క ద్విచక్ర వాహనదారి హెల్మెట్‌ను తప్పకుండా ధరించాలని మరియు త్రిబుల్ రైడింగ్‌కి పాల్పడకూడదు అని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ శ్రీకాంత్ జట్ల, భద్రత అవగాహన కార్యక్రమాలు నిర్వహించిన స్టూడెంట్ ఆక్టివిటీ కమిటీని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సేఫ్టీ క్లబ్ కోఆర్డినేటర్ ఫరానా, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రయినేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతా



నవతెలంగాణ-సంతోషనగర్

లలితబాగ్ డివిజన్ ఫతే షా నగర్ వార్డు నెంబర్ 36 పరిధిలోని నెలకొన్న డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతానని కాలనీలో నెలకొన్న డ్రైనేజీ మరమ్మతులను చేపట్టారు. పారిశుధ్య కార్మికులతో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా కాలనీ అధ్యక్షులు మొహమ్మద్ ఆరిఫ్ ఖాన్ స్థానిక నాయకులతో కలిసి పరిశీలిస్తూ మరమ్మతులు చేపట్టారు. ఈ సందర్భంగా అధ్యక్షులు మాట్లాడుతూ.. కాలనీలో నెలకొన్న సమస్య వల్ల తలెత్తిన సమస్యను స్థానికుల విజ్ఞప్తి మేరకు పరిశీలించి హెచ్ఎండబ్ల్యుఎస్ కార్మికుల ద్వారా పరిష్కరించడం జరిగిందన్నారు. భవిష్యత్తులో పునరావృతం కాకుండా చర్యలు తీసుకునే విధంగా ప్రతివాడలో మురుగునీరు మరమ్మతులు చేస్తూ డ్రైనేజీ ప్రవాహాన్ని క్షుణ్ణంగా పరిశీలించి సమగ్రంగా తీసుకోవలసిన చర్యలపై అధికారులకు చర్చించడం జరిగిందన్నారు. నిరంతరం పర్యవేక్షణతో త్వరితగతిన పనులు పూర్తి చేసి, 1991-92లో మొదటిసారిగా వేసిన డ్రైనేజీ పూర్తిగా దెబ్బతింది, సమస్య పరిష్కారానికి ఫీట్ పొడవున కొత్త డ్రైనేజీ వ్యవస్థకు కలపాని సమస్యకు పరిష్కారం చూపిస్తామని మహమ్మద్ ఆరిఫ్ ఖాన్ తెలిపారు. కాలనీలలో అన్ని రకాల మౌలిక వసతులు కల్పనకు కృషి చేస్తానని, డ్రైనేజీ, రోడ్లు, మంచినీరు, విద్యుత్ దీపాలు, వంటి అన్ని రకాల మౌలిక వసతులు కల్పనకు పెద్దపీట వేస్తామన్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూస్తామని ఆయన చెప్పారు. స్థానిక సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ప్రజలకు కోరారు. ఈ కార్యక్రమంలో స్థానికులు నాయకులు సీనియర్ నాయకులు తెలంగాణ రాష్ట్ర మీడియా ఇన్చార్జి సింగ్ అభిమానులు పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

ఘనంగా కవిత జన్మదిన వేడుకలు





నవతెలంగాణ-ఎల్బీనగర్

భారత జాగృతి అధ్యక్షురాలు, శాసన మండలి సభ్యురాలు కల్వకుంట్ల కవిత జన్మదినం వేడుకలు ఘనంగా నిర్వహించారు. చైతన్యపురి డివిజన్ మాజీ కార్పొరేటర్ జిన్నారం విఠల్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలలో ఎల్బీనగర్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి ముద్దగౌని రామ్మోహన్‌గౌడ్ ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు. దిల్‌సుఖ్‌నగర్ కనకదుర్గ దేవాలయంలో కల్వకుంట్ల కవిత ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని 101 కొబ్బరి కాయలు కొట్టి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం చైతన్యపురి డివిజన్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన రక్తదానం శిబిరంను ప్రారంభించారు. అనంతరం జీహెచ్ఎంసి పారిశుధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేశారు. మాజీ కౌన్సిలర్ బూరుగు తులసీదాస్, డివిజన్ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పవన్, శ్రీనివాస్ యాదవ్, గట్టు శ్రీనివాస్, గంగిడి సుదర్శన్ రెడ్డి, పోచిరెడ్డి, రమణా రెడ్డి, విజయరంగ, అవుల సురేందర్, శోభారాణి, సంగీత, సరిత, తిరుమల్ రెడ్డి, వీరన్న యాదవ్, కృష్ణమూర్తి, లక్ష్మీ నారాయణ, వెంకట్ రెడ్డి, పూర్ణ చందర్ రావు, శ్రీను, ప్రభాకర్ రావు, అంజయ్య, ప్రమోద్, టింకు, ఐలేష్ యాదవ్, శ్రీకాంత్, ఆనంద్ జైన్,రమేష్ పాల్గొన్నారు.

గౌతమినగర్ కాలనీలోని శాంతినికేతన్ మానసిక వికలాంగుల పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. డివిజన్ మాజీ అధ్యక్షులు నక్క వెంకటస్వామి యాదవ్, చందా లింగారెడ్డి, ముద్దగౌని చంద్రకాంత్‌గౌడ్, ఎల్బీనగర్ నియోజకవర్గం జాగృతి కన్వీనర్ అవుల సురేందర్, గాయిత్రి బ్యాంక్ కాలనీ అధ్యక్షురాలు సరస్వతి, ప్రశాంత్ గౌడ్, పారంద స్వామి, మాజీ వార్డ్ కమిటీ సభ్యురాలు పద్మ, ప్రవీణ్ గౌడ్, రంజిత్ గౌడ్, మనీష్ గౌడ్, స్వప్న, సత్య, వాణి, ఉమ, శ్రీధర్, శేఖర్ ఆనంద్, యస్వంత్ వున్నారు.

పద్మశ్రీ కిన్నెర మొగులయ్యకు వారణాసి సత్కారం



నవతెలంగాణ - మీర్‌పేట్

కృషి ఉంటే మనుషులు ఋషులవుతారనే వాక్యానికి నిదర్శనంగా నిలిచిన పద్మశ్రీ దర్శనం కిన్నెర మొగులయ్యను మీర్‌పేట్ ఆర్టీసీ ఉద్యోగి వారణాసి సుధాకర్‌చారి సముచితంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మట్టిబిడ్డగా 12 మెట్ల అరుదైన కిన్నెర వాయింపులో మెలుకువలు సాధించి భీమ్లా నాయక్ సినిమాలో టైటిల్ సాంగ్ పాడి దేశవ్యాప్తంగా అందరి మన్ననలు అందుకున్న వ్యక్తి మొగులయ్య అన్నారు.

పూర్వీకుల నుంచి వారసత్వంగా వస్తున్న అద్భుత కళకు పట్టం కట్టి, అడ్డంకులను అధిగమిస్తూ సామన్య స్థాయి నుంచి అసమాన్య స్థాయికి ఎదిగి భారత ప్రభుత్వం నుంచి పద్మశ్రీ అవార్డు అందుకోవడం ఆయన స్ఫూర్తివంతమైన జీవితానికి నిదర్శనమని సుధాకర్ కొనియాడారు. కళలను ఆదరిస్తూ, కళాకారులను గౌరవిస్తూ సంప్రదాయ కళారూపాలను భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని సూచించారు. ఈ కార్యక్రమంలో మీర్‌పేట్ 31వ డివిజన్ బీఆర్ఎస్ నాయకులు రాజు ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఇతర రాష్ట్రాల పేదలకు ఉప్పల ఫౌండేషన్ సేవలు

- ఉప్పల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఒకేరోజు ఐదుగురు నిరుపేద కుటుంబాలకు చెందిన అమ్మాయిల పెండ్లిలకు మంగళసూత్రం, మెట్టెలు విరాళం



నవతెలంగాణ-నాగోల్

నాగోల్, కో-ఆపరేటివ్ బ్యాంక్ కాలనీలో ఉప్పల శ్రీనివాస్‌గుప్త క్యాంప్ కార్యాలయంలో ఐదుగురు అమ్మాయిల వివాహం గురించి, బీదర్‌కు చెందిన శిల్ప, రాజన్న సిరిసిల్లకు చెందిన గిద్దల అఖిల, బొగ్గులకుంటకు చెందిన పేదింటి యువతి, తట్టి అన్నారం, అబ్దుల్లాపూర్ మెట్‌కు చెందిన ప్రీతి, కామారెడ్డి జిల్లా, ఘన్‌పూర్‌కు చెందిన తేజ, వారి కుటుంబ సభ్యులు వచ్చి కలిసిన సందర్భంగా వారి కుటుంబ ఆర్థిక పరిస్థితి తెలుసుకొని, ఉప్పల ఫౌండేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మెన్ ఉప్పల ఫౌండేషన్ చైర్మెన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్త, పెద్ద కుమారుడు ఉప్పల సాయి తేజ చేతుల మీదుగా మంగళ సూత్రం, మెట్టెలు, చీర, గాజులు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా టూరిజం చైర్మెన్ ఉప్పల శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ ఉప్పల ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత 23 సంవత్సరాలుగా నిరుపేద కుటుంబానికి చెందిన అమ్మాయిల పెండ్లిళ్లకు మంగళ సూత్రం, మెట్టెలు, చీరె, గాజులు విరాళం ఇవ్వడం జరుగుతున్నది. ఈ విరాళం ఒక్క పేద ఆర్యవైశ్యులకు మాత్రమే కాకుండా అన్ని కులాలకు చెందిన వారికి, అన్ని ప్రాంతాల నిరుపేద కుటుంబాలకు చెందిన ఆడబిడ్డల పెండ్లి కోసం పుస్తె, మెట్టెలు, చీర, గాజులు సహాయం చేయడం జరుగుతుందని అన్నారు. అలాగే తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పథకం, కేసీఆర్ మానసపుత్రిక అయిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకంను నిరుపేద ఆడబిడ్డలు అందరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

ప్రశాంతంగా ముగిసిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్, ఎమ్మెల్సీ నర్సిరెడ్డి



నవతెలంగాణ-హయత్‌నగర్

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు హయత్ నగర్‌లో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో 61,61ఎ కేంద్రాల్లో సోమవారం మొత్తం 900మంది ఓటర్లు ఉండగా, 814 మంది ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఘటనా స్థలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసేందుకు ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ హరీష్, ఇబ్రాహీంపట్నం ఆర్‌డీఓ వెంకటాచారిలు సందర్శించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూసేందుకు హయత్‌నగర్ పోలీసులు 3అంచెల బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఇన్స్‌పెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు.

ఎల్బీనగర్



మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు సోమవారం నిర్వహించారు. సరూర్ నగర్ వీఎం హోమ్‌లో పోలింగ్ బూత్ ఏర్పాటు చేశారు. అదేవిధంగా అన్ని ఉపాధ్యాయ సంఘాల నాయకులు అక్కడే మకాం వేసి పోలింగ్ పూర్తి అయ్యే వరకు అక్కడే ఉన్నారు. పోలింగ్ జరుగుతున్న తీరును పరిశీలించారు.



మహబూబ్‌నగర్- రంగారెడ్డి- హైదరాబాద్ జిల్లాల టీచర్‌ఎమ్మెల్సీ పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. సరూర్‌నగర్‌లోని వీఎం హోమ్‌లో ఏర్పాటు చేసిన ఐదు పోలింగ్ కేంద్రాలకు స్వయంగా వెళ్లి పోలింగ్ సరళిని, ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ హరీష్ పరిశీలించారు. 3085ఓటర్లకు గాను 2537 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునారు. సరూర్‌నగర్ పరిధిలో 82.24 శాతం పోలింగ్ అయినట్లు పోలింగ్ అధికారి జయశ్రీ తెలిపారు.

మీర్‌పేట్



హైదరాబాద్ రంగారెడ్డి మహబూబ్‌నగర్ ఉపాధ్యాయ నియోజకవర్గ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. జిల్లెలగూడ చల్లా లింగారెడ్డి ప్రభుత్వ పాఠశాలలో రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. రెండు (74,74/ఎ) పోలింగ్ కేంద్రాలలో మొత్తం ఓటర్లు 1110 ఉండగా 955 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. రాచకొండ పోలీస్ కమిషనర్ డిఎస్ చౌహన్, ఎల్బీనగర్ డీసీపీ సాయి శ్రీ, వనస్థలిపురం ఏసీపీ పురుషోత్తం రెడ్డి, బాలాపూర్ తహసీల్దార్ జనార్దన్ రావు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులు మానిక్ రెడ్డి, ఏవిఎన్ రెడ్డి తదితరులు సందర్శించడం జరిగింది.

గుండెపోటుతో చనిపోయిన బీఆర్ఎస్ కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్

నాగారం మున్సిపాలిటీ రాంపల్లి గ్రామంలోని తాటికొండ నర్సింగ్ ఇటీవల గుండెపోటుతో చనిపోవడంతో నర్సింగ్ కుటుంబానికి నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి రూ.10వేలు, బీఆర్ఎస్ నాయకులు రూ.70వేలతో కలిఅసి మొత్తం రూ.80వేలను ఆర్థిక సాయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఎలిజాల నాగేష్ గౌడ్, కో-ఆప్షన్ సభ్యుడు క్యాసారం అశోక్ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు మచ్చ శ్రీనివాస్ గౌడ్, గండి అంజయ్య గౌడ్, వరకాల పెంటయ్య గౌడ్, నెలుట్ల విజయ్ భాస్కర్, శ్రీశైలం శంకర్ రెడ్డి, సురేందర్, మహేందర్, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఏడో వార్డు అభ్యర్థిగా ప్రకటించండి





నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ బోర్డ్‌కు జరగనున్న ఎన్నికల్లో ఏడో వార్డు నుంచి తాను బరిలో ఉంటున్నట్టు తనకు బీఆర్ఎస్ మద్దతు ఇచ్చి తనను అభ్యర్థిగా ప్రకటించాలని ఏడో వార్డు బీఆర్ఎస్ అధ్యక్షుడు తేజ్‌పాల్ సోమవారం మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, బీఆర్ఎస్ మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్ రెడ్డిని ఎమ్మెల్యే సాయన్న కుమార్తె నివేదితతో పాటు పలువురు ప్రముఖులను విన్నపాలు చేశారు. వినతి పత్రాలను అందజేశారు. ఈసారి తనను ఏడో వార్డు అభ్యర్థిగా ప్రకటించాలని ఆయన నాయకులను కోరారు. తనకు వార్డులో గట్టిపట్టు ఉందని పేర్కొన్నారు.

ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

- రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబిత ఇంద్రారెడ్డి
- ఇంటర్ పరీక్షల నిర్వహణపై జిల్లా కలెక్టర్‌తో వీడియో కాన్ఫరెన్స్



నవతెలంగాణ-మేడ్చల్‌కలెక్టరేట్

ఈ నెల 15వ తేదీ నుంచి ఏప్రిల్ 4 వ తేదీ వరకు జరిగే ఇంటర్ పరీక్షలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసి ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. సోమవారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్‌తో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇంటర్ పరీక్షల నిర్వహణకు కంట్రోల్ రూం నంబర్ 040-27118584 ఏర్పాటు చేసినట్టు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. జిల్లాలో ఇంటర్ వార్షిక పరీక్షల నిర్వహణకు 133 పరీక్షా కేంద్రాల్లో అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశామనీ, నిరంతర విద్యుత్ సరఫరా, తాగునీటి సౌకర్యం, పారిశుద్యం, ఫర్నీచర్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. పరీక్ష కేంద్రాల పరిసరాల్లో 144 సెక్షన్ అమలు చేస్తున్నట్టు తెలిపారు. పరిసరాల్లో ఉన్న జిరాక్స్ షాపులు మూసేసామనీ, పరీక్షలలో ఎలాంటి మాల్ ప్రాక్టీస్ జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నామనీ, ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్ ఏర్పాటు చేశామని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రథమ సంవత్సరంలో జనరల్ 62,342 మంది విద్యార్థులు, ఒకేషనల్ కోర్సులో 1,452 మంది మొత్తం 63,794 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తారనీ, ద్వితీయ సంవత్సరంలో జనరల్‌లో 54,146 మంది, ఒకేషన్ కోర్సులో 995 విద్యార్థులు మొత్తం 55.141 పరీక్షలు రాస్తారని వివరించారు. ఈ సందర్భంగా ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు జిల్లా వ్యాప్తంగా జనరల్‌లో 1,16,488 మంది, ఒకేషనల్ కోర్సులో 2,447 మంది విద్యార్థులు మొత్తం 1,18,935 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని కలెక్టర్ తెలిపారు. ఇంటర్మీడియట్ పరీక్షల నేపథ్యంలో వారు నిర్వహించాల్సిన విధులకు సంబంధించి అన్ని శాఖల అధికారులతో ముందస్తుగానే సమావేశాలు నిర్వహించామనీ, ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహిస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. ఇప్పటివరకు హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోని విద్యార్థులు నేరుగా ఇంటర్మీడియట్ వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకునే విధంగా అవగాహన కల్పిస్తామని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కిషన్, సంబంధిత శాఖ అధికారులు, సిబ్బంది. తదితరులు పాల్గొన్నారు.

చెత్త కుప్పల మీద పిచ్చి మొక్కలు మొలుస్తున్నాయి..!





నవతెలంగాణ-నాచారం

భూగర్భ డ్రయినేజీ శుభ్రం చేసిన చెత్తను నెలలు గడుస్తున్నా తొలగించకపోవడంతో పిచ్చి మొక్కలు మొలుస్తున్నాయని కాంగ్రెస్ నాయకుడు మొసలి శ్రీనివాస్ రెడ్డి, దుర్గా నగర్ స్థానికులు చిరంజీవి, నారాయణరెడ్డి పేర్కొన్నారు. మల్లాపూర్ డివిజన్ పరిధిలోని అశోక్ నగర్, దుర్గా నగర్‌లో దుర్గంధ భరితంగా మారుతున్నాయి. మెట్రో వాటర్ వర్క్ సీవరేజ్ అధికారుల అలసత్వం.. సిబ్బంది నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి. డ్రయినేజీలు పొంగిపొర్లుతున్నా.. మురుగు రోడ్లపై పరుగు పెడుతున్నా.. పట్టించుకోని అధికారుల తీరుపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మురుగు, దుర్వాసన, దోమలతో రోగాల బారిన పడి దవఖానల పాలవుతున్నామని స్థానిక ప్రజలు వాపోతున్నారు. జీహెచ్ఎంసీ వాటర్ వర్క్స్ అధికారులకు మొర పెట్టుకోగా అమాసపున్నానికి వచ్చి డ్రయినేజీ శుభ్రం చేస్తారు..? కానీ ఒడ్డున వేసిన చెత్త కుప్పలు తొలగించడానికి నెలలు పడుతుందనీ, దీంతో ఈ చెత్తకుప్పలపై మొక్కలు మొలుస్తున్నాయి అంటే అధికారుల పనితీరుకు అద్దం పడుతుంది. మల్లాపూర్ డివిజన్ లోని ఏ కాలనీలో చూసినా డ్రయినేజీ మురుగు పరుగులు.. చెత్తకుప్పల దర్శనంతో కాలనీలు దుర్గంధ భరితంగా మారుతున్నాయి. సమస్య వచ్చినప్పుడు సిబ్బంది చీదరించుకుంటారు. తూతూ మంత్రంగా డ్రయినేజీలను శుభ్రం చేస్తారు. ఎక్కడి చెత్త కుప్పలు అక్కడే వదిలేసి వెళతున్నారు. డ్రయినేజీ చెత్త కుప్పలు తొలగించాలని జీహెచ్ఎంసీ మెట్రో వాటర్ వర్క్స్ సీవరేజ్ అధికారులకు, స్థానిక కార్పొరేటర్‌కు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఉలుకు పలుకు ఉండదు. స్థానిక ప్రజలు డ్రయినేజీ మురుగులోనే మరిగిపోతున్నారు. తమ సమస్య ఎవరికీ చెప్పుకోమంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు స్థానిక ప్రజలు. ఇప్పటికైనా జీహెచ్ఎంసీ మెట్రో వాటర్ వర్క్స్ సీవరేజ్ అధికారులు స్పందించి డ్రయినేజీ మురుగు సమస్యను పరిష్కరించి శుభ్రం చేసిన చెత్త కుప్పలను ఎప్పటికప్పుడు తొలగించి ప్రజలను రోగాల బారి నుంచి కాపాడాలని వేడుకుంటున్నారు.

నాచారం హెచ్‌పీ పెట్రోల్ బంకులో కల్తీ పెట్రోల్

- అటువైపే చూడని తూనీకల కొలతల అధికారులు
- తనిఖీలు చేపట్టని సివిల్ సప్లై ఆఫీసర్లు





నవతెలంగాణ-నాచారం

కల్తీకి కాదేది అనర్హం అన్న చందంగా ప్రస్తుత మార్కెట్‌లో ప్రతి వస్తువు కల్తీయే. నాచారం గణేష్ ఆటో ఫ్యూల్స్ హెచ్‌పీ పెట్రోల్ బంక్ నుండి నాచారంకు చెందిన తిరుపతి బైక్ లో పెట్రోల్ అయిపోవడంతో వైజయంతి దగ్గర నిలిచిపోయింది. దగ్గరలో ఉన్న హెచ్ పీ పెట్రోల్ బంక్ కు నుండి బాటిల్ లో పెట్రోల్ నింపుకొని వచ్చి బైక్ లో పెట్రోల్ పోస్తున్న క్రమంలో కలరు మార్పుగా వాటర్ వచ్చినట్లుగా గమనించి వెంటనే బంకు వద్దకు వెళ్లి చూపించగా మాకు సంబంధం లేదని దాటవేసే ప్రయత్నం చేశారు. దీంతో బాధితుడు తిరుపతి తూనీకల కొలతలు, సివిల్ సప్లై అధికారులకు ఫిర్యాదు చేయగా అధికారులు స్పందించలేదు. సమాచారం అందుకున్న మీడియా పెట్రోల్ బంకుకు వెళ్లి హెచ్‌పీ బంక్ నిర్వాహకుడు ఆనందును నిలదీయగా మీడియా ముందు బంకులో నుంచి పెట్రోల్ ను చూపించి తప్పించుకునే ప్రయత్నం చేశాడు. అదే క్రమంలో వినియోగదారులు గతంలో నాకు కూడా ఇలానే వచ్చిందంటూ మీడియా ముందు తెలియజేయడంతో పెట్రోల్ బంక్ సిబ్బంది దురుసుగా వ్యవహరిస్తూ నానా హంగామా సృష్టించారు. పెట్రోల్ కోసం కొచ్చిన వినియోగదారులు సిబ్బంది మధ్య కొంత ఘర్షణ వాతావరణం చోటు చేసుకుంది. నిర్వాహకుడు ఆనంద్ ఇరువురికి సరిది చెప్పి పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నం చేశారు. పలుమార్లు కల్తీ వస్తుందని వాహనదారులు బంకు నిర్వాహకులకు చెప్పినా పెడచెవిన పెట్టి యధావిధిగా కొనసాగించడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి బంకులో పెట్రోల్ క్వాలిటీ చెక్ చేసిన తర్వాతనే వినియోగదారులకు విక్రయించాలి కానీ అందుకు విరుద్ధంగా నాచారం హెచ్‌పీ పెట్రోల్ బంకులు బాటిల్‌లో ఎలాంటి ఆధారాలు లేకుండా విక్రయిస్తున్నారు. తూనీకల కొలతల అధికారుల పర్యవేక్షణ లోపంతో బంకు నిర్వాహకులు సెట్టింగ్ పెట్టి మూడు నాలుగు పాయింట్లు తక్కువ చేసి విక్రయిస్తున్నా పట్టించుకునే వారు లేరని వాహనదారులు ఆరోపిస్తున్నారు. ఒకవైపు పెట్రోల్ ధరలు విపరీతంగా పెంచుతూ మరొకవైపు కల్తీ, క్వాలిటీ తక్కువ చేస్తూ సొమ్ము చేసుకుంటున్నా బంకు నిర్వాహకులపై బాధ్యతాయుతంగా వ్యవహరిస్తున్న అధికారుల తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎవరి వాటా వారికి వెళుతుంది. అంతా కల్తీమయం అవుతుందని పెట్రోల్ వినియోగదారులు, వాహనదారులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు వినియోగదారులు ఫిర్యాదులను పెడచెవున పెట్టి అక్రమాలకు, కలీతి వ్యాపారులకు కొమ్ముకాస్తున్న సివిల్ సప్లై అధికారులు, తూనీకల కొలతల అధికారుల తీరు పట్ల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు తమ తీరు మార్చుకొని మార్కెట్లో వినియోగదారుడు మోసాలకు గురి కాకుండా చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నారు.

వేసవిలో ప్రజల దాహార్తిని తీరుస్తాం



నవతెలంగాణ-మల్కాజిగిరి

వేసవిలో ప్రజల దాహార్తిని తీరుస్తామని గౌతమ్‌నగర్ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ అన్నారు. సోమవారం ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ఆదేశాల మేరకు గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని ఐఎన్ నగర్‌లో కార్పొరేటర్ పవర్ బోర్ మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఎండ కాలం వస్తుందనీ, ఐఎన్ గుట్ట పైకి వాటర్ సమస్యను లేకుండా మరమ్మతులు చేయిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రామూయాదవ్, నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు పాల్గొన్నారు.



దోమల నివారణ కోసం సొంత నిధులతో బీఆర్ఎస్ కీసర మండల ఉపాధ్యక్షుడు వంగేటి పర్వత్‌రెడ్డి పిచుకారీ చేయించారు. గోధుమకుంట గ్రామపంచాయతీ పరిధిలోని టీపీఎస్ కృష్ణానగర్ కాలనీ, హెవెన్ డౌన్ కాలనీలో దోమల నివరణ కోసం ముందస్తుగా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. దోమల వల్ల అనేక రకాల వ్యాధులు వస్తున్నాయని గుర్తించి అనారోగ్యంతో బాధపడకూడదు అని ముందస్తుగా దోమల పొగ కాలనీ బస్తీలలో పిచుకారీ చేయించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా కాలనీ అసోసియేషన్ సభ్యులు వంగేటి పర్వత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్

విద్యార్థులకు ప్రాథమిక దశ నుంచే ప్రయోగాత్మక పాఠాలు నేర్పించాలి



నవతెలంగాణ-నాచారం

విద్యార్థులకు ప్రాథమిక దశ నుంచే ప్రయోగాత్మక పాఠాలు నేర్పించాలని సీసీఎంబీ సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ విజయ్ భాస్కర్ అన్నారు. సోమవారం మల్లాపూర్ శక్తి సాయి నగర్ లోని సాయి విద్యానికేతన్ హై స్కూల్లో నిర్వహించిన సైన్స్ ఫెయిర్ కు ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులు ప్రతిభకు పదును పెట్టి వివిధ రకాల సైన్స్ పరికరాలను పరిశీలించిన ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే పిల్లలకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించడం ద్వారా ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దవచ్చు అన్నారు. వారిలో దాగివున్న ప్రతిభకు ప్రోత్సాహం అందిస్తే భవిష్యత్తులో సైంటిస్టులు, డాక్టర్లు, ఇంజినీర్లు అయ్యే అవకాశం కల్పించిన వారిమవుతామని చెప్పారు. ఉపాధ్యాయులు పిల్లలతో స్నేహపూర్వకంగా వ్యవహరిస్తూ సంపూర్ణ అవగాహన కలిగిన విద్యార్థిగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయుల పైనే ఉందని గుర్తు చేశారు. సైన్స్ ఫెయిర్ లో ప్రతిభా కనబరిచిన విద్యార్థినీ, విద్యార్థులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథి డాక్టర్ కేజే రెడ్డి, పాఠశాల కరస్పాండెంట్ ధనుంజయ్ రావు, హెడ్మాస్టర్ రాఘవేందర్, ఆర్టీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకుడు ప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మహిళలు వంటింటికే పరిమితం కాకూడదు



నవతెలంగాణ-నాచారం

మహిళలు వంటింటికే పరిమితం కాకుండా సమాజంలో సగభాగంగా ముందుకు సాగినప్పుడే అన్ని రంగాల్లో రాణించవచ్చని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ రేష్మ హుస్సేన్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆమె మాట్లాడుతూ అవని నుండి అంతరిక్షం వైపు ప్రయాణిస్తున్న నేటి సమాజంలో మహిళ ఏ రంగంలో తక్కువ కాదని గుర్తు చేశారు. విద్యతోనే స్త్రీ పురోగతి సాధించవచ్చని అన్నారు. క్రమశిక్షణ, పట్టుదల, సంకల్పం ఉంటే ఎంతటి కష్టానైనా అధిగమించి ఆదర్శ మహిళగా ఎదగవచ్చని పేర్కొన్నారు. నేటి ఆధునిక యుగంలో మహిళ ఏ రంగంలో తక్కువ కాదనీ, పురుషులతో సమానం అవనిలో సమతూగుతుందని గుర్తు చేశారు. మహిళగా విద్యారంగంలో రాణిస్తూ ప్రిన్సిపాల్‌గా గురుత్వార బాధ్యతను నిర్వర్తిస్తున్న డాక్టర్ రేష్మ హుస్సేన్ పలువురు మహిళలు సన్మానించారు. ఈ కార్యక్రమంలో వివిధ జిల్లాల నుంచి వచ్చిన మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్స్ విద్యార్థినులు, టీచర్లు, ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.



ఘనంగా ఎమ్మెల్సీ కవిత జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-నేరేడ్‌మెట్/మల్కాజిగిరి

నిజామాబాద్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత జన్మదిన వేడుకలను సోమవారం మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ఆధ్వర్యంలో ఆనంద్ బాగ్ క్యాంప్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కార్పొరేటర్లు సునీత రాము, మీనా ఉపేందర్ రెడ్డి, యాదవ్, శాంతి శ్రీనివాస్ రెడ్డి, సబితా అనిల్ కిషోర్, ప్రేమ్ కుమార్ కేక్ కట్టింగ్ చేసి, కవితకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కల్వకుంట్ల కవిత తెలంగాణ సంస్కృతిని ప్రపంచ స్థాయికి తీసుకు వెళ్లారన్నారు. వివిధ దేశాల్లో బతుకమ్మ సంబరాలు నిర్వహించిన ఘనత ఆమెకే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్కాజ్గిరి సర్కిల్ అధ్యక్షుడు పిట్ల శ్రీనివాస్, రాము యాదవ్, గుండా నిరంజన్, ఉపేందర్ రెడ్డి, నర్సింగ్ రావు, సత్యమూర్తి, బాబు, సత్యనారాయణ, బాలకృష్ణ, సయ్యద్ మబ్బు, భాగ్యనంద్ రావు, సిద్దిరాములు, నహీం ఖాన్, విజయ కుమారి, వైశాలి, కవిత, జయశ్రీ, తదితరులు పాల్గొన్నారు.


జీపీ కార్మికుల ఐదు నెలల వేతనాలను వెంటనే చెల్లించాలి

- తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్.శ్రీనివాస్
- మేడ్చల్-మల్కాజిగిరి కలెక్టరేట్ ఎదుట పంచాయతీ కార్మికుల ధర్నా



నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్

గ్రామ పంచాయతీ కార్మికుల ఐదు నెలల వేతనాలను వెంటనే చెల్లించాలని తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్.శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మేడ్చల్-మల్కాజిగిరి కలెక్టరేట్ ఎదుట పంచాయతీ కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉన్న గ్రామపంచాయతీ కార్మికులకు ఐదు నెలల నుంచి జీతాలు ఇవ్వలేదన్నారు. సీఎం ఇచ్చిన హామీ ప్రకారం డబుల్ బెడ్ రూమ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. దళితులకు న్యాయం చేస్తామని ముఖ్యమంత్రి చెప్పిన ఐదు నెలల జీతం ఇవ్వక పోవడం అవివేకం అన్నారు. సీఐటీయూ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కోశాధికారి ఉన్ని కృష్ణ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న గ్రామపంచాయతీ కార్మికుల జీతాలు గురించి రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి మాట్లాడక పోవడం బాధాకరమన్నారు. దళితులైన గ్రామపంచాయతీ కార్మికులకు 5 నెలల జీతాలని చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పి.రవి, మల్లయ్య, సుధాకర్, లక్ష్మమ్మ, పద్మ, శ్రీను, యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.



కీసర దాయరలో మల్లన్న కల్యాణం, బోనాల జాతర

నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్

కీసర దాయరలో మల్లన్న కల్యాణం, బోనాల జాతర ఘనంగా నిర్వహించారు. ఈ కల్యాణ మహోత్సవానికి గ్రామస్తుల ఆహ్వానం మేరకు టీపీసీసీ సీనియర్ అధికార ప్రతినిధి, మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ కో-ఆర్డినేటర్ సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి హాజరై స్వామి వారి కల్యాణాన్ని తిలకించి ఆలయంలో జరిగిన పూజా కార్యక్రమంలో పాల్గొని వేద పండితుల ఆశీర్వచనాలు అందుకున్నారు. మల్లన్న స్వామి కల్యాణం సందర్భంగా కీసర గ్రామ వార్డు సభ్యులు రామిడి స్వప్న విజయ్‌రెడ్డి ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని హరివర్ధన్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ బీ బ్లాక్ అధ్యక్షులు వేముల మహేష్‌గౌడ్, ఘనాపూర్ గ్రామ సర్పంచ్ బద్దం గోపాల్‌రెడ్డి, కీసర మండల నాయకులు ఉమాపతి శర్మ, చిక్కుడు రమేష్, జూపల్లి రవీందర్, మధుసూదన్‌రెడ్డి, కందాడి సత్తిరెడ్డి, కృష్ణారెడ్డి, జూపల్లి సాయిలు, శివరాం రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సజావుగా ముగిసిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు

- ఓటు హక్కును వినియోగించుకున్న 5,460 మంది ఉపాధ్యాయులు
- జిల్లా వ్యాప్తంగా 83.54 శాతం పోలింగ్ నమోదు



నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సజావుగా జరిగాయి. సోమవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో 14 పోలింగ్ కేంద్రాల్లో మొత్తం 6,536 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉండగా అందులో ఎన్నికల సమయం ముగిసేటప్పటికి 5,460 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అందులో మహిళా ఓటర్లు 2,905 మంది, పురుషులు 2,555 మంది ఉన్నారు. దీంతో జిల్లాలో 83.54 శాతం ఓటింగ్ నమోదయ్యింది. జిల్లాలోని కీసరలో 8 పోలింగ్ కేంద్రాలు, మల్కాజిగిరిలో 6 పోలింగ్ కేంద్రాల అన్నింటిలోనూ అన్ని వసతులు సమకూర్చమని తెలిపారు. జిల్లాలోని ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ సరళిని జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్ ఎప్పటికప్పుడు పరిశీలించారు. దీంతో పాటు మైక్రో అబర్జర్వర్లు, పోలీసులు ఓటింగ్ కు సంబంధించి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకున్నామన్నారు.

IN THE COURT OF THE HON'BLE SENIOR CIVIL JUDGE, CHEVELLA, RANGA REDDY DISTRICT AT : CHEVELLA I.A.NO. 559 OF 2022 IN O.S.NO. 117 OF 2017

BETWEEN :-
SMT. K. BHAGYAMMA @ ATHYEM BHAGYAMMA & ANOTHER
....PETITIONERS/PLAINTIFFS
AND
ATHYEM SRISAILAM & OTHERS
....RESPONDENTS/DEPENDENTS

TO
DOMADUGU SRIKANTH REDDY S/0. D. MANIK REDDY AGED ABOUT: 44 YEARS, OCT: PVT. EMPLOYEE, R/O. H.NO.1-31-10/301, SRICHAKRA AVENUE, STREET NO.7, SRI SATYA SAI ENCLAVE, OLD BOWENPALLY, SECUNDERABAD.
....RESPONDENT/DEFENDANT NO.6

NOTICE

PLEASE TAKE NOTICE THAT THE PETITIONERS/PLAINTIFFS HAVE FILED SUIT FOR PARTITION AND SEPARATE POSSESSION AGAINST THE RESPONDENTS/DEFENDANTS AND THE ABOVE I.A. FILED UNDER ORDER 1 RULE 10 OF C.P.C. AND I.A AND SUIT WAS POSTED ON 21/03/2023 FOR YOUR APPEARANCE. SO YOU ARE HEREBY INFORMED TO APPEAR BEFORE THE SAID HON'BLE COURT ON 21/03/2023 AT 10.30 AM, FAILING WHICH THE ABOVE MATTER WILL BE DECIDED IN ACCORDANCE WITH LAW.

(BY ORDER OF THE COURT)

SD/-
I. NAGENDER RAO
B. SRISAILAM
ADVOCATES
9-1-364/B/8, GANDHI NAGAR, OPP: BAPUGHAT, LANGER HOUZ, HYDERABAD.

PUBLIC NOTICE

The General public is hereby informed that our clinet Shriram Finance Limited Shivam Branch. Hyderabad Dist is dealing with financing business in the course of business **Sri. M. Naresh, S/o.M. Narsimha,** approached our client for finance and accepted to deposit his title deeds in respct of his property i.e. All that the house bearing No.3-43/3/1, admeasuring 75 Sq.yards or 62.7 Sq.mtrs, Gramakantam, with plinth area 250 Sq.feet (A.C.C.), Situated at Singaipally, Thumkunta Municipality, Shamirpet Mandal, Medchal Malkajgiri District and Bounded as follows:-
NORTH : 20' Wide Road **SOUTH** :House of Goutham **EAST** : Open Place of Neighbours **WEST** : House of Ramadevi towards security for the loan availed by him. If any person or persons having any claim. right, title or interest in the above said property may approach the undersigned within 7 days from the date of this publication or else our clinet will proceed with the transaction.

S.SRINIVAS RAO
A.SUPRIYA
ADVOCATES
H.No.2-19-79/A/10/A, Balaji Enclave Extn, East Kalyanpur, Uppal, Hyderabad - 500 039 Cell: 9948104019

IN THE COURT OF HON'BLE JUNIOR CIVIL JUDGE, MAHESHWARAM AT: MAHESHWARAM O.S.No. 206 of 2022

Between:
Smt. Pritee Kumari and others
....Plaintiffs
And
Vijaya Laxmi and another
.....Defendants

To
Smt, T. Vijaya Laxmi, W/o. T. Narsimha Reddy, Aged about 54 years, Occ: House wife, R/o. H.No.8-2-42/39, New Maruthi Nagar, Karmanghat, Saroornagar mandal, R.R.Dist.
....Defendant No.1

NOTICE

The above named plaintiffs filed above suit for perpetual injunction and same is posted along with I.A.No.864/2022 and I.A.No.865/2022 for your appearance on 28.3.2023 at 10.30 hours. Hence this paper publication for your i.e. defendant No.1 appearance without fail.

//By order of the Court//
V. RAGHAVA REDDY
ADVOCATE
Plot No.5, Viratnagar Colony, Karmangat, Hyderabad - 97
(M) 9347071007
Counsel for the plaintiffs

IN THE COURT OF THE VII SENIOR CIVIL JUDGE CUM III ADDL ASJ: RANGA REDDY DISTRICT COURT: AT L.B.NAGAR O.S.NO. 772 OF 2019

BETWEEN:
Bank of India, Sanjeeva Reddy Nagar Branch, Hyderabad
.. Plaintiff
Vs
Korra Santhya
.. Defendant

To
Korra Santhya, S/o Korra Pakera R/o Plot No.6, Injapur, Turkayamjal, Hayathnagar, Hyderabad – 501510.
Please take the notice that the Plaintiff Bank filed O.S. No. 772 of 2019 for recovery of an amount of Rs.6,90,408/- plus interest from the Defendant. Summons sent to Defendant was returned unserved. Hence the Hon'ble Court ordered summons to Defendant by way of publication. The OS is posted to 03.04.2023 for your appearance. You are required to appear before the Hon'ble Court on that day by 10:30 am either in person or through an Advocate or else the matter will be preceded in your absence.

"By The Order Of the Hon'ble Court"
P.G.S.PRASAD
Advocate
Flat No.107, Sovereign Shelters Apartments, Lakdikapool, Hyderabad-4
Ph: 9440255431 & 7981430645

IN THE COURT OF THE HON'BLE ADDL. SENIOR CIVIL JUDGE, RANGA REDDY DIST AT: IBRAMMPATAN IA No. 171. OF 2023. IN O.S.No 2712 OF 2007

Between:
Y. Surender Reddy S/o. Bhupathi Reddy
...Petitioner/Plaintiff
AND
Y. Bhupal Reddy & Others
....Respondents/Defendants
1. Y. Sharada D/o. Late Y. Jarardhan Reddy
2. Y. Madhukar Reddy S/o. Late Y. Jarardhan Reddy
3. Y. Saritha D/o. Late Y. Jarardhan Reddy

All are Rio. Mall Village, Yacharam Mandal, R.R.District
....Respondents/Proposed Defendants No. 17 to 19

Please take notice that the above suit is filed for Partition and Separate Possession in the above case the Defendant No.4 Yaparla Janardhan Reddy died his LR's impleaded in I.A.No. 171 of 2023 in O.S.No. 2712 of 2007 is posted for appearance of the legal heirs of the Defendant No.4 Y. Janardhan Reddy his LR's (Y. Sharada, Y. Madhukar and Y. Saritha) to appear before the court on 21.03.2023 if any person or persons having any objection/claims kindly appear either in person or through an advocate in the above Court at 10-30 a.m. on the above said date, as otherwise the matter will be decided on merits.

// By Order of Court//
B.KAMALAKAR
Advocate
Office at: H.No. 5-5-94/215 Road No.7/4, Hills Colony, Vanastalipuram, Hyderabad.
Mobile No. 9676673769

IN THE COURT OF THE HON'BLE X JUNIOR CIVIL JUDGE; CITY CIVIL COURT AT HYDERABAD O.S.No. 1083 OF 2023

Between :-
1. Gandikota Ramadevi W/o.Late G. Raghu Rama Sarma Aged, about 68 Years, Occ : Housewife,
2. Gandikota Uday Kiran S/0. Late G. Raghu Rama Sarma, Aged about 46 Years, Occ : Business,
3. Gandikota Pavan Chaitanya Kiran S/o. Late G. Raghu Rama Sarma, Aged about 42 Years, Occ : Business,

All are R/o.H.No.1-1-230/8, Vivek Nagar, Chikkadpally, Musheerabad, Hyderabad.
.....Plaintiffs
AND
1. Tahsildar Musheerabad,
2. All concerned
.....Defendants

To
ALL CONCERNED

WHEREAS the above named Plaintiff has instituted a Suit for declaration in lieu of declaring the legal status of Plaintiff's as Legal Heirs of Late G. Raghu Rama Sarma. In view of this any person having claim/s or objections in respect of the above mentioned suit, shall appear before said court on 27-03-2023at 10.30 a.m., in person or through Advocate, thereafter no further claims will be entertained in any manner.

// BY THE ORDER OF THE COURT //
P. NAVEEN KUMAR
Advocate
H.No.17-1-386/1/86, Keshavnagar, Champapet, Hyderabad -- 500 079, Phone No-9391505195

కంటి వెలుగులో 7,44,041 మందికి ఐ స్క్రీనింగ్

నవతెలంగాణ-సిటీబ్యూరో

కంటి వెలుగు కార్యక్రమంలో నేటి వరకు 7,44,041 మంది కంటి పరీక్షలు చేయించుకున్నారు. కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా ఇప్పటి వరకు 1,93,321 మందికి రీడింగ్ అద్దాలను ఉచితంగా పంపిణీ చేశారు. 1,06,817 మందికి ప్రిస్కిప్షన్ అద్దాలను పంపిణీ చేశారు. 4,18,780 మందికి ఎటువంటి కంటి జబ్బులు లేవని గుర్తించారు. సోమవారం 17,972 మందికి ఐ స్క్రీనింగ్ చేయగా 2,886 మందికి రీడింగ్ అద్దాలను పంపిణీ చేశారు. 1,784 మందికి ప్రిస్కిప్షన్ అద్దాలను త్వరలో అందజేయనున్నారు. 12,879 మందికి ఎటువంటి కంటి జబ్బులు లేవని గుర్తించారు.

మహేంద్ర మెదరు కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చాలి

- మేదర సంఘం నగర అధ్యక్షులు కే మురళీ కృష్ణ



నవతెలంగాణ-అంబర్‌పేట

మహేంద్ర మెదరు కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చాలని మేదర సంఘం నగర అధ్యక్షులు కే మురళీ కృష్ణ కోరారు. సోమవారం హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అమోయ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సానుకూలంగా స్పందించిన జిల్లా కలెక్టర్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మేదర్ సంఘం ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, కోశాధికారి పాత కోటి మహేష్, ప్రచార కార్యదర్శి భార్గవ్, సంఘం పెద్దలు పుట్టా యాదగిరి, జోర్రి గల శ్రీధర్, రజినీ కాంత్, బాలచందర్, శ్రీశైలం,సత్తయ్య,నాగరత్నం తదితరులు పాల్గొన్నారు.

ఓయూలో హరితహారం మొక్కల సంరక్షణ గాలికి..

- కొన్నిచోట్ల నీళ్లు లేక.. ఇంకొన్ని చోట్ల అగ్నికి ఆహుతి..
- మా వద్ద నిధులు లేవు.. హెచ్ఎండీఏ వారే తిరిగి బాధ్యతలు స్వీకరించాలి : ఓయూ గ్రీన్ బెల్ట్ డైరెక్టర్ డా.శ్రీనివాసులు



నవతెలంగాణ-ఓయూ

సీఎం కేసీఆర్ ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారం కార్యక్రమం ఓయూలో అధికారుల అలసత్వంతో నీరుగారి పోతుంది. ఓయూలో నాటిన మొక్కలను చూసుకునే వారు లేక అవి ఎండిపోతుండగా.. ఇంకొన్ని అగ్నికి ఆహుతవుతున్న దుస్థితి నెలకొంది. 2019 సంవత్సరం ఓయూకు ఇన్‌చార్జి వీసీ గా ఉన్న కమిషన్ ఐఏఎస్‌అర్వింద్ కుమార్ ఓయూలో పలుమార్లు పర్యటించి హరితహారం కార్యక్రమంలో భాగంగా ఓయూలో విరిగా మొక్కలు నాటాలని సూచించారు.దాంతో హెచ్ఎండీఏ వారు మొక్కల నాటడమే కాకుండా వాటిని సంరక్షణ బాధ్యతను తీసుకొని ఈ ఆగస్టు వరకు కంటికి రెప్పలా కాపాడుకుంటూ పర్యవేక్షించారు. అనంతరం ఓయూలో కొద్దీ మంది అధికారులకు వీటి సంరక్షణకై బాధ్యతలు అప్పగించారు. అయితే వారు మొక్కల సంరక్షణ బాధ్యతను మరిచిపోవడంతో అవి ఎండిపోవడం జరుగుతోంది. ఇప్పటికైనా మొక్కల సంరక్షణ పట్టించుకోవాలని సంఘాల జాక్ చైర్మెన్ వేల్పుల సంజయ్, పూర్వ విద్యార్థి టీపీసీసీ రాష్ట్ర నేత వరంగల్ రవి, ఓయూ పర్యావరణ వేత్త విజయ్ నాయక్‌లు కోరుతున్నారు.

కరోనా సమయంలో కూడా కంటికి రెప్పలా.. కానీ నేడు..?

కరోనా సమయంలో కూడా హెచ్ఎండీఏ అధికారులు నిత్యం అప్రమత్తంగా ఉంటూ హరితహారం మొక్కలను సంరక్షించారు. హరితహారం కార్యక్రమంలో భాగంగా రహదారుల వెంట " హెడ్జ్ మొక్కలు " కూడా నాటారు. అవి ఎంతో ఏపుగా పెరిగి ఓయూలో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఇచ్చాయి. ఓయూలో 10 చోట్ల 'మియవాకి' విధానంలో నాటిన మొక్కలు వాటి సంరక్షణ కోసం హెచ్ఎండీఏ వారే ఫెన్సింగ్ ఏర్పాటు చేసి, ఉదయం, సాయంత్రం నిత్యం నీళ్ల పోసి సంరక్షణ కోసం నిత్యం ప్రత్యేక శ్రద్ధ చూపారు. మొక్కల మధ్యలో పెరిగిన గడ్డిని, పిచ్చి మొక్కలను కూడా వారే తొలగించి మొక్కల సంరక్షణ బాధ్యతలు స్వీకరించారు.

తక్షణమే అధికారులు స్పందించాలి



ఓయూ పర్యావరణ పరిరక్షణ సమితి తరపున హరిత హారం మొక్కలను పరిశీలించాము. అధికారుల నిర్లక్ష్యం వల్ల ఉస్మానియా యూనివర్సిటీలో మొక్కలు నీళ్ల లేక ఎండిపోతున్నాయి. తక్షణమే అధికారులు మొక్కలకు నీళ్ల పెట్టి వాటిని కాపాడాలి. మరోపక్క ఇష్టారితిన చెత్తను కాల్చడం వల్ల మంటలు వ్యాపించి చెట్లు కాలిపోతున్నాయి అధికారులు మంటలు వ్యాప్తి చెందకుండా నియంత్రించి, వృక్షాలను కాపాడాలని డిమాండ్ చేస్తున్నాము. తక్షణమే అధికారులు స్పందించి కాంట్రాక్టర్ పై, అధికారులపై చర్యలు తీసుకోవాలి.

-పర్యావరణ పరిరక్షణ సమితి ఓయూ అధ్యక్షుడు ఈఎన్‌వీ విజయ్ నాయక్

నీరుగారుతోన్న ఆశయం

నాటి ఇన్‌చార్జి వీసీ, కమిషన్ అరవింద్ కుమార్ ప్రత్యేక దృష్టి సారించి ఓయూను ఒక దట్టమైన హరితవనంగా మార్చారు. దానిలో భాగంగానే ఇటీవలే రాజ్యసభ సభ్యుడు సంతోష్ కుమార్ "ఆక్సిజన్ పార్క్ " ను కూడా ప్రారంభించారు. తాము ఆక్సిజన్ పార్క్ ఏర్పాటు చేశాము అని ఓయూ అధికారులు గొప్పలు చెప్పుకుంటున్నారు. కానీ ప్రస్తుతం హెచ్ఎండీఏ వారు వెళ్లి పోవడం, పర్యవేక్షణ బాధ్యత చూసే నాథుడు లేక ఓయూలో నేడు మొక్కలు ఎండిపోతున్నాయి. ఇంకొన్ని చోట్ల ఫెన్సింగ్ ఊడి గేదెలు, మేకలు వాటిని తినటం, ఇంకొన్ని చోట్ల ఓయూ సిబ్బంది లేక ఇతరులు ఎండి పోయిన ఆకులు, చెత్తను నిప్పు అంటించడంతో మంటలు వ్యాపించి మొక్కలు, వృక్షాలు అగ్నికి ఆహుతవుతున్నాయి.

కనిపించని బోర్డులు.. మాయం అయిన వాటర్ ట్యాప్‌లు, పైపులు.

నాడు హెచ్ఎండీఏ ఏర్పాటు చేసిన ఐరన్ బోర్డ్‌లు కూడా మాయం కావడంతో పాటు మొక్కలకు నీటి సరఫరా కోసం ఏర్పాటు చేసిన వాటర్ పైపులు, ట్యాప్‌లు కూడా కొన్ని సెక్టర్‌లు మాయమయ్యాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని, చెత్తుకు, ఎండిన ఆకుల నిప్పు ఎవరు పెట్టుతున్నారో వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, అవులు, గేదెలు,మేకలు రాకుండా చర్యలు చేపట్టాలని విద్యార్థులు, అటు వాకర్స్, పర్యావరణ పరిరక్షణ నేతలు కోరుతున్నారు. రానున్న వేసవి కాలం ఈ సమస్యలు మరింత గా జఠిలం కాకుండా తక్షణమే సంరక్షణ చర్యలు చేపట్టాలన్నారు.

హెచ్ఎండీఏ బాధ్యతలు స్వీకరించాలి

మొక్కల నిర్వహణకు మా వద్ద నిధులు లేవు. ఇంకా ఈ మొక్కలు పెరిగే వరకు మళ్ళీ హెచ్ఎండీఏ వారే బాధ్యత చెప్పటాలి. లేదా వారు ఇతర దాతలు, సంస్థలు అయిన వీటి సంరక్షణ కోసం కృషి చేసేలా చొరవ చూపాలి. మరొక రెండు సంవత్సరాలు హెచ్ఎండీఏ బాధ్యతలు స్వీకరించాలని కోరుతున్నాము.

– ఓయూ గ్రీన్ బెల్ట్ డైరెక్టర్ డా.శ్రీనివాసులు

అతి తక్కువ పోలింగ్ హైదరాబాద్ జిల్లాలోనే..

- ముగిసిన టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్



నవతెలంగాణ-సిటీబ్యూరో

మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ టీచర్స్ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ముగిసింది. మొత్తంగా 90.40శాతం పోలింగ్ జరగగా అతి తక్కువ పోలింగ్ హైదరాబాద్ జిల్లాల్లోనే నమోదు కావడం గమనార్హం. హైదరాబాద్ జిల్లాలో 82.25శాతంగా నమోదైంది. పోలింగ్ ముగియడంతో బ్యాలెట్ బాక్సులను సరూర్‌నగర్ స్టేడియంలో స్ట్రాంగ్ రూమ్‌కు చేర్చారు. ఈనెల 16వ తేదిన ఎన్నికల కౌంటింగ్ జరగనుంది.



చేనేత కళాకారులను ప్రోత్సహించాలి

- ఐఏఎస్ అధికారిణి శైలజా రామయ్యర్



నవతెలంగాణ-బంజారాహిల్స్

చేనేత కళాకారులను ప్రోత్సహించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, చేనేత వస్త్రాలను ప్రతి ఒక్కరూ ధరించాలని ఐఏఎస్ అధికారిణి శైలజా రామయ్యర్ సూచించారు. సోమవారం శ్రీనగర్ కాలనీలోని సత్యసాయిని గమాగమంలో ఇండియన్ సిల్క్ గ్యాలరీ పేరిట స్పెషల్ వెడ్డింగ్, ఉగాది సంప్రదాయ ఎగ్జిబిషన్‌ను ఆమె ప్రారంభించారు. తెలంగాణకు చెందిన చేనేత మహిళా కళాకారులు ఆరుగురికి నగదు పురస్కారంతో పాటు ఘనంగా సత్కరించి వారిని ప్రతిభను ప్రశంసించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇక్కడి వస్త్రాలు చాలా ఆకర్షణీయంగా ఉన్నాయని, చేనేత కళాకారుల నైపుణ్యం స్పష్టంగా కనబడుతుందని అన్నారు. చేనేత కళాకారులను ప్రోత్సహిస్తున్న ఇండియన్ సిల్క్ గ్యాలరీ నిర్వాహకులు శ్రీనివాసరావు, వినయ్ కుమార్ లను అభినందించారు. దేశంలోని ప్రముఖ చేనేత కళాకారులు తమ ఉత్పత్తులైన సిల్క్,కాటన్,డిజైనరీ చీరలను సుమారు 100 స్టాల్స్‌లో ఈనెల 21 వరకూ ప్రదర్శిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో మినిస్ట్రీ ఆఫ్ టెక్స్టైల్స్ ఎన్‌ఫోర్స్మెంట్ డైరెక్టర్ డాక్టర్ అరున్ కుమార్,హాండ్లూమ్ క్యురేటర్ శ్రీదేవి నిరుప్ పాల్గొన్నారు.

మహిళలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యత

- డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్



నవతెలంగాణ-ఓయూ

అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తూ తమ సత్తాను చాటుతున్నారని డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమాల్లో భాగంగా సోమవారం సితాఫలమండీలో బీఆర్ఎస్ మహిళా నాయకురాలు సరోజినీ, బందం ఏర్పాటు చేసిన మహిళా దినోత్సవ కార్యక్రమంలో పద్మారావు గౌడ్ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ.. సికింద్రాబాద్‌లో సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో మహిళలకు తాము శక్తి వంచన లేకుండా ప్రోత్సాహాన్ని కల్పిస్తున్నామని, మహిళల స్వావలంభనకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. మహిళా అభ్యున్నతికి సాధికారతకు తాము కల్పిస్తున్న ప్రాధాన్యతను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, వివిధ రంగాలకు చెందిన మహిళలను సత్కరించారు. కార్పొరేటర్లు, సామల హేమ, కంది శైలజ, బీఆర్ఎస్ మహిళా నేతలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే



నవతెలంగాణ-అంబర్‌పేట

ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. సోమవారం అంబర్ పేట డివిజన్ పరిధిలోని పటేల్ నగర్‌లో చిలకమ్మ గల్లీలో కార్పొరేటర్ ఇ.విజయ్ కుమార్ గౌడ్‌తో కలిసి ఎమ్మెల్యే పర్యటించారు. స్థానికంగా ఉన్న డ్రయినేజీ సమస్యను స్థానిక బస్తి ప్రజలను అడిగి తెలుసుకుని వెంటనే సంబంధిత అధికారులని పిలిపించి సమస్య పరిష్కారం కోసం నూతన డ్రయినేజీ పైప్ లైన్ వేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గురువారం నూతన డ్రయినేజీ పైప్ లైన్‌కు శంకుస్థాపన చేసి చిలకమ్మ గల్లీలో డ్రయినేజీ సమస్య లేకుండా చేస్తామని తెలియజేశారు, ఈ కార్యక్రమంలో అధికారులు ఏఈ మజీద్,వర్క్ ఇన్‌స్పెక్టర్‌లు రమేష్, దుర్గ, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు డివిజన్ అధికార ప్రతినిధి మహేష్ ముదిరాజ్, హైమద్,నర్సింగ్ రావు, లవంగు లక్ష్మణ్, వినోద్ గంగపుత్ర, తదితరులు పాల్గొన్నారు.



ఓయూ ఇంజనీరింగ్ కళాశాల పరిశోధనలకు ఐఎస్ఓ గుర్తింపు

నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల పలు విభాగాల్లో ప్రతిష్టాత్మక ఐఎస్ఓ గుర్తింపు లభించింది. అత్యుత్తమ నాణ్యత, ప్రమాణాలతో ఐఎస్ఓ 9001 సర్టిఫికెట్ సాధించింది. పర్యావరణ గ్రీన్ ఆడిట్‌లో ఐఎస్ఓ 14001, ఎనర్జీ ఆడిట్ లో ఐఎస్ఓ 50001 ధ్రువీకరణ లభించింది. నాణ్యమైన, రుచికరమైన ఆహారాన్ని అందిస్తున్న గంగా, కిన్నెర, బాలికల హాస్టల్ మెస్‌లు, ఇంజినీరింగ్ కళాశాల క్యాంటీన్, యూనివర్సిటీ గెస్ట్ హౌస్‌లకు ఫుడ్ సెఫ్టీ ఐఎస్ఓ 22000తో గుర్తించింది. ఆయా విభాగాల్లో నాణ్యతలో రాజీ లేకుండా కృషి చేసిన ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేశ్, ఆయా విభాగాల అధిపతులు, పరిపాలనా అధికారులను వీసీ ప్రొ. రవిందర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొ. పి. లక్ష్మీనారాయణ, ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్సీ కవిత జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-ఓయూ

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత జన్మదినాన్ని పురస్కరించుకొని గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి సికింద్రాబాద్ పరిధిలోని తార్నాక డివిజన్ డిప్యూటీ మేయర్ క్యాంప్ కార్యాలయంలో సోమవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. అనంతరం బీఆర్ఎస్ కార్మిక విభాగ అధ్యక్షుడు మోతె శోభన్ రెడ్డి తో కలిసి తమ నివాసంలో కేక్‌ను కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ. మహిళల హక్కుల కోసం మాట్లాడే ఓ ఝాన్సీ రాణి అని కొనియాడారు.



డిప్యూటీ మేయర్ క్యాంప్ కార్యాలయంలో..



అశోక్ నగర్‌లోని జాగ్రుతి కార్యాలయంలో..

అడిక్‌మెట్ : భారత్ జాగ్రుతి సమితి అధ్వర్యంలో ఎమ్మెల్సీ కవిత జన్మదిన వేడుకలను అశోక్ నగర్ లోని జాగ్రుతి కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జయ సింహ హాజరై మాట్లాడుతూ ఎమ్మెల్సీ కవిత వల్లే దేశ వ్యాప్తంగా మహిళల సాధికారత పెరిగిందన్నారు. కనుమరుగైన బతుకమ్మ పండుగకు జాగ్రుతి కార్యక్రమాల ద్వారా విశిష్టత పెరిగిందన్నారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద మహిళల కోసం ఎమ్మెల్సీ కవిత పోరాటం చేశారని గుర్తు చేశారు.



స్పోర్ట్స్ చైర్మెన్‌కు టీఎస్‌సీపీఎస్ ఎంప్లాయిస్ యూనియన్ డైరీ-2023 అందజేత

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

టీఎస్‌సీపీఎస్ ఎంప్లాయిస్ యూనియన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు నరేందర్ రావు ఆధ్వర్యంలో రాష్ట్ర స్పోర్ట్స్ చైర్మెన్ ఈ. ఆంజనేయులు గౌడ్ ను సోమవారం కలిసి యూనియన్ డైరీ -2023 అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు నరేందర్‌రావు మాట్లా డుతూ సీపీఎస్ విధానం వల్ల ఉద్యోగులకు కలిగే నష్టాలను, ఇబ్బందులను తెలియజేశారు. పదవీ విరమణ తర్వాత లభించే మార్కెట్ ఆధారిత పెన్షన్ వద్ధప్యంలో ఇబ్బందిగా పరిణామించే అవకాశం ఉంది కాబట్టి సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లాల్సిందిగా కోరారు. ఉద్యోగులకు చెల్లించాల్సిన బిల్లులు కొన్ని ఆలస్యం కావడంతో ఉద్యోగుల్లో ఆందోళన నెలకొన్నదని.. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు శ్రీధర్, జాయింట్ సెక్రటరీ సుధాకర్, ప్రభాకర్, వెంకట్, ప్రసాద్ గౌడ్ లు పాల్గొన్నారు.

మైక్రోబయలజీ విభాగాన్ని సందర్శించిన డా. తిరుమల దేవి



నవతెలంగాణ-ఓయూ

ఓయూలోని మైక్రోబయాలజీ విభాగాన్ని సోమవారం డాక్టర్ తిరుమల దేవి కన్నెగంటి సందర్శించారు. మెంఫిస్, యూఎస్ఏలోని సెయింట్ జూడ్ పిల్లల ఆస్పత్రిలో పనిచేస్తున్న ప్రపంచంలోని అగ్రశ్రేణి 1 శాతం శాస్త్రవేత్తలలో ఆమె ఒకరు. మైక్రోబయాలజీ డిపార్ట్‌మెంట్ (పీహెచ్డీ 2001) పూర్వ విద్యార్థి కూడా. డాక్టర్ కన్నెగంటి ఉస్మానియా యూనివర్సిటీలో మైక్రోబయాలజీ విభాగాధిపతి, ఇండో-అమెరికన్ మాజీ విజిటింగ్ ప్రొఫెసర్ అయిన సందీప్త బూర్గులతో ఆమె కొనసాగుతున్న సహకారంలో భాగంగా ఉస్మానియా యూనివర్సిటీలోని మైక్రోబయాలజీ విభాగాన్ని సందర్శించారు. ఆమె పర్యటన సందర్భంగా ఎంఎస్సీ మైక్రోబయాలజీ విద్యార్థులతో సంభాషిం చారు. వారి కెరీర్‌లో సైన్స్‌ను ఎంచుకోవడానికి వారిని ప్రోత్సాహించారు. సైన్స్‌ని వత్తిగా ఎలా కొనసాగించాలో పని కంటే అభిరుచిగా ఎలా కొనసాగించాలి అనే దాని గురించి మాట్లాడారు. విద్యార్థుల కెరీర్‌ను రూపొందిం చడంలో మంచి ఉపాధ్యాయుల ప్రాముఖ్యతను ఆమె నొక్కిచెప్పారు. ఈ రోజు సైన్స్‌లో తన స్థానానికి తన పాఠశాల, కళాశాల ఉపాధ్యాయులు ఎలా కారణమో గుర్తుచేసుకున్నారు. ఓయూలోని మైక్రోబయాలజీ విభాగం ఆధ్వర్యంలో మైక్రోబయాలజీ బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్‌పర్సన్ డాక్టర్ హమీదా బీ, మైక్రోబయాలజీ రిటైర్డ్ ప్రొ. గోపాల్ రెడ్డి ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. విద్యా ర్థులు, అధ్యాపకులు, పరిశోధన విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా వంజరీ టింకు జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-అంబర్‌పేట

అంబర్ పేట నియోజకవర్గానికి చెందిన వంజరీ టింకు జన్మదినాన్ని పురస్కరించుకొని విద్యానగర్‌లో అనాథా శ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మౌనిక, కాశీ నరేష్, తదితరులు పాల్గొన్నారు.

'నాణ్యతతో పనులు పూర్తి చేయండి'



నవతెలంగాణ- బంజారా హిల్స్

సోమాజిగూడలో గల సంగీత్ నగర్‌లో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను జీహెచ్ఎంసీ డీఈ చైతన్య, ఏఈ చరణ్‌తో కలిసి స్థానిక కార్పొరేటర్ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి విజయ రెడ్డి సోమవారం పరిశీలించారు. లెవెలింగ్ సరిగ్గా వేయాలని,పనులలో నాణ్యత పాటించాలని,వర్షపు నీటి పైపులైను డ్యామేజ్ అయిన క్యాచ్ పీట్లను సరిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్ర మంలో కాలనీవాసులతో పాటు కాంగ్రెస్ నాయకులు మహేష్ యాదవ్, హరికృష్ణ, వాసు పాల్గొన్నారు.

చరిత్ర పరిశోధనలు భారతీయ సంస్కృతిని తెలియజెప్పాయి

- ప్రముఖ చరిత్ర కారుడు ప్రో.రతన్ లాల్



నవతెలంగాణ-ఓయూ

చరిత్ర పరిశోధనలు భారతీయ చరిత్ర ,సాంస్కృతిని ఓయూ చరిత్ర శాఖ సెమినార్ ప్రపంచ దేశాలకు నిర్మాణాత్మకం అయిన రీతిలో తెలియజేసిందని అలహాబాద్ కల్యాణి యూనివర్సిటీ మాజీ వీసీ, ప్రముఖ చరిత్ర కారుడు ప్రో.రతన్ లాల్ హంగ్లు అన్నారు. సోమవారం ఓయూ చరిత్ర శాఖ ఆధ్వర్యంలో హెడ్ అండ్ కన్వీనర్ ప్రో.అంజయ్య పర్యవేక్షణ లో " రీసెంట్ ట్రెండ్స్ ఆఫ్ హిస్టారికల్ రీసెర్చ్ " అనే అంశంపై రెండు రోజుల జాతీయ సెమినార్ ఓయూ ఆర్ట్స్ కళాశాలా సెంటినరి హల్ 133 రూమ్‌లో నిర్వహించారు. ప్రో.రతన్ మాట్లాడుతూ ఆచార్య ఆర్.సి. మంజూదర్ ఆధ్వర్యంలో వెలువడిన భారతీయ విద్యా భవన్ సిరీస్ సంపుటలు దేశ చరిత్రకు సంబంధించిన ప్రాచీన మధ్యయుగ, ఆధునిక చరిత్రలోని ఘట్టాలను నిష్పక్షపాతంగా వివరించడంలో సఫలీకతం అయినట్లు చెప్పారు. నేటికి మంజూదర్ సంపుటలు దేశ చరిత్రకారులకు, పరిశోధకులకు,మార్గదర్శనం చేస్తున్నట్టు పేర్కొన్నారు. 1980 సంవత్సరానికి ముందు మంజూదర్ భారతీయ విశ్వవిద్యాలయయాల్లో జరిగిన చరిత్ర పరిశోధనలను తరువాత కాలంలో ఎన్నో రకాలుగా మార్పులకు లోనయ్యాయన్నారు. కాంగ్రెస్ పార్టీ దేశ సామాజిక, ఆర్థిక ,పునర్నిర్మాణం విషయం లో పెంపొందించిన పాత్రను చరిత్ర కారులు రచన ల్లో విభిన్న మైన కోణంలో అధ్యయనం చేశారని చెప్పారు. చరిత్రకారులు అధికారులను అర్థం చేసుకుని తమ భావా లను వక్రీకరించకుండా వ్యక్తం చేయాలని సూచించారు. యుగ విభజన దేశ చరిత్రలో తప్పనిసరి అయినప్పటికీ జాతీయ సమగ్రతను పరిరక్షించే విషయంలో ప్రాంతీయ స్థాయి చరిత్ర కారులు కూడా నిర్మాణాత్మక పాత్ర పోషించాలన్నారు. విభాగం హెడ్ కన్వీనర్ డా.అంజయ్య మాట్లాడుతూ. ఇంత వరకు జరిగిన చరిత్ర పరిశోధన ల్లో ఉన్న సత్యలు,అసత్యాలు,ఇటీవలే కాలం లో లభ్యమైన ప్రాథమిక ఆధారాల నైపథ్యం లను విశ్లేషించటానికి స్థానిక చరిత్ర, సంసతిని ,వారసత్వ సంపద పరిరక్షణకు సమాజానికి తెలియజేయడమే ఈ రెండు రోజుల సెమినార్ ప్రధాన ఉద్దేశ్యం అని చెప్పారు.సెమినార్ లో ఓయూ వీసీ ప్రో.రవీందర్, మాజీ వీసీ ప్రో.సులేమాన్ సిద్దికీ, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రో.చింత గణేష్, చరిత్ర విభాగం హెడ్ ప్రో.అంజయ్య, విభాగం అధ్యాపకులు ప్రో.ఇందిర ప్రో. లావణ్య, డా.రమేష్, డా.అరుణ, చరిత్రకారులు, పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులు పాల్గొన్నారు.



ఖేలో - ఇండియా ఉమెన్స్ లీగ్ పోటీలు

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఖేలో - ఇండియా ఉమెన్స్ సైక్లింగ్ లీగ్‌ను చరిత్రలో నగరవాసులకు తొలి సారిగా చూసే అవకాశం దక్కింది. ఓయూ క్యాంపస్‌లో సైక్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, కేంద్రమంత్రిత్వ శాఖ, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా సహకారంతో ఖేలో ఇండియా ఉమెన్స్ లీగ్‌ను సోమవారం ప్రారంభించారు. సైక్లింగ్‌తోపాటు రోడ్ అండ్ ట్రాక్ క్రీడలను నిర్వహిస్తున్నామని ఖేలో - ఇండియా ఉమెన్స్ సైక్లింగ్ లీగ్ కోఆర్డినేటర్ మాక్స్‌వెల్ ట్రేవర్, అదనపు ఆర్గనైజర్ ఎం.కే.పాశా తెలిపారు. ఈ పోటీల్లో 12-16 సంవత్సరాల వయస్సుగలవారితోపాటు 18 సంవత్సరాలపైన మహిళల పాల్గొంటున్నారు. సౌత్‌జోన్‌లో ఆంధ్రప్రదేశ్, అండమాన్ అండ్ నికోబార్ ఐలాండ్స్, తెలంగాణ, కర్ణాటక, కేరళ, తమిళనాడు ఆరు రాష్ట్రాలు పాల్గొంటున్నాయన్నారు. ఈ పోటీలు సౌత్‌జోన్‌లోని బీజాపూర్, త్రివేండ్రంలో ముగుయనున్నాయని తెలిపారు. హైదరాబాద్‌లోని ఓయూ క్యాంపస్‌లో సైక్లింగ్ ఈవెంట్ ఈనెల 16 వరకు జరుగనున్నాయన్నారు. ఉమెన్స్ సైక్లింగ్ లీగ్ పోటీల్లో తెలంగాణ, అంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన 89 మంది మహిళా రైడర్లు పాల్గొంటారని తెలిపారు.

మోడీ ప్రభుత్వంపై శ్రామిక వర్గం తిరగబడాలి'

- ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజ్



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

కార్మికులు సృష్టించిన సంపదను బడా పెట్టుబడిదారులైన అదానీ, అంబానీలకు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం దోచిపెడుతుందని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజ్ ధ్వజమెత్తారు. కార్పొరేట్ పరిశ్రమల అధిపతులకు మేలు చేస్తున్న మోడీ ప్రభుత్వంపై శ్రామిక వర్గం తిరుగుబాటు చేయాలని పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు హిమాయత్ నగర్‌లోని ఎస్.సత్యనారాయణరెడ్డి భవన్ లో జరుగుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర సంఘాలు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల శిక్షణా శిబిరం ముగింపు సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం సంపన్న వర్గాలకు, పెట్టుబడిదారులకు దేశ సంపదను దోచిపెడుతూ కార్మిక వర్గానికి తీరని అన్యాయం చేస్తుందని ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వ తిరోగమన విధానాలు తిప్పికొట్టేందుకు ఈ నెలలో ఏఐటీయూసీ ఇతర సంఘాలను కలుపుకుని, రాష్ట్ర స్థాయి సదస్సు హైదరాబాద్ నగరంలో నిర్వహించనున్నట్టు వెల్లడించారు. మే నెల నుంచి ఆగస్టు 8 వరకు క్విట్ ఇండియా దినోత్సవంలో భాగంగా పోరుయాత్రలు, మోటర్ సైకిల్ యాత్రలు, సభలు, సమావేశాలు నిర్వహించి సంఘటిత, అసంఘటిత శ్రామిక వర్గాల్లో చైతన్యం కల్పిస్తామని తెలిపారు. ఆగస్టు 9న హైదరాబాద్‌లో భారీ నిరసన సభను నిర్వహించనున్నట్లు తెలిపారు. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత ఎప్పుడూ జరగని విధంగా కార్మిక హక్కులపై, చట్టాలపై కేంద్ర ప్రభుత్వం దాడి చేస్తున్నదని ఆరోపించారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధర పెంచి, జీఎస్టీ భారం మోపి ప్రజలపై కార్మికులపై మోయలేని భారం మోపి మోడీ ప్రభుత్వం నడ్డివిరిచిందన్నారు. కార్మిక చట్టాల రక్షణ కోసం కార్మికవర్గంలో చైతన్యం కల్పించేందుకు రాష్ట్ర, జిల్లా స్థాయి శిక్షణా శిబిరాలు నిర్వహిస్తామన్నారు. యథాతథంగా కార్మిక చట్టాలను అమలు చేయాలని, ప్రజలపై పన్నుల భారం తగ్గించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఏఐటీయూసీ సీనియర్ నాయకులు రత్నాకర్ రావు మాట్లాడుతూ..కార్మిక వర్గం రెట్టింపు ఉత్సాహంతో సమరశీల పోరాటాలకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు యం.డి.యూసుఫ్ మాట్లాడుతూ.. ధరల పెరుగుదలకు అనుగుణంగానే డి.ఎ. పెరుగుతుందని పేర్కొన్నారు. ఏఐటీయూసీ పోరాటాల ఫలితంగానే డి.ఎ. పెంపుదల జరిగిందని గుర్తు చేశారు. ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహ్మా మాట్లాడుతూ.. కార్మిక వర్గంలో సైద్ధాంతిక ఆలోచన ఉన్నప్పటికీ కార్మిక వర్గ దక్పథాన్ని అలవర్చుకోవల్సిన అవసరం ఉందన్నారు. ఏఐటియుసికి పలు యూనియన్లు అనుబంధంగా ఉన్నప్పటికీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ బలమైన సంఘంగా ఉందని గుర్తు చేశారు. ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.చంద్రయ్య "యూనియన్ రిజిస్ట్రేషన్, అనుబంధ రుసుము అన్న" అంశంపై సుదీర్ఘంగా వివరించారు. 34 అంశాలను లోతుగా వివరించారు.పలువురు నాయకులు అడిగిన అంశాలకు వివరణ ఇచ్చారు.శిక్షణా తరగతులకు ప్రిన్సిపాల్ గా ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పి.ప్రేంపావని వ్యవహరించారు.

మ్యాన్ హోల్ మరమ్మతు చేయండి

నవతెలంగాణ-కూకట్‌పల్లి

కూకట్ పల్లి సర్కిల్ ఆల్విన్ కాలనీ డివిజన్ జయనగర్ కాలనీ ఎల్లమ్మ చెరువు సమీపంలో కొన్ని రోజులుగా రోడ్డు మధ్యలో ఉన్న మ్యాన్ హోల్ మూత పూర్తిగా ధ్వంసమై, వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందికరంగా మారింది. అందులోనూ మ్యాన్ హోల్ మూల మలుపులో ఉండటం వల్ల కార్ల చక్రాలు గుంతలో పడిపోవడం కార్లు డ్యామేజ్ అవుతున్నాయనీ, ద్విచక్ర వాహనదారులు చూసుకోకుండా వచ్చి ప్రమాదాలకు గురవుతున్నారని స్థానికులు వాపోతున్నారు. మ్యాన్ హోల్ మూతను వెంటనే మరమ్మత్తు చేసి సమస్యను పరిష్కరించాలనీ స్థానిక ప్రజలు కోరుతున్నారు.



ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎస్టీయూ, సీపీఐ నాయకులు

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్



కుత్బుల్లాపూర్ మండలంలోని ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో సీపీఐ అనేక ప్రజా సంఘాలు బలపరిచిన ఎస్టీయూ అభ్యర్థి భుజంగరావు గెలుపు కోరుతూ సోమవారం సీపీఐ మండల కార్యదర్శి ఉమా మహేష్, ఏఐటీయూసీ అధ్యక్షులు హరినాథ్, ఏఐటీయూసీ నాయకులు రాములు, శ్రీనివాస్, నరసింహ రెడ్డి, ఎస్టీయూ నాయకులు రామకృష్ణ, భగవత్ చారి, పెంటయ్య, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

90 శాతం తెలిసిన వాళ్లే లైంగికంగా వేధిస్తున్నారు

- తెలంగాణ హైకోర్టు జడ్జి రాధారాణి
- వీ ఫర్ ఉమెన్ అవార్డుల కార్యక్రమం

నవతెలంగాణ-సిటీబ్యూరో

90 శాతం తెలిసిన వాళ్లే లైంగికంగా వేధిస్తున్నారు అని తెలంగాణ హైకోర్టు జడ్జి రాధారాణి అన్నారు. వీ ఫర్ ఉమెన్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ రంగాల్లో ప్రతిభ కనబర్చిన మహిళలను రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో అవార్డులతో సత్కరించారు. ఈ కార్యక్రమానికి హైకోర్టు జడ్జి రాధారాణి, ప్రముఖ సింగర్ కౌసల్య, మేజర్, ఎన్ సిసి ఆఫీసర్ జయసుధ, సంస్థ ఫౌండర్ డాక్టర్ ప్రతిభాలక్ష్మి జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా హైకోర్టు జడ్జి రాధారాణి మాట్లాడుతూ సమాజంలో ఏం జరుగుతుందనేది ప్రతి మహిళా అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రతి విషయాన్నీ మహిళలు ఆనందించడం నేర్చుకోవాలన్నారు. చదువు ఒక్కటే సరిపోదనీ, చదువుతో పాటు మహిళలకు ధైర్యం రావట్లేదన్నారు. వివిధ



వేడుకల్లో ముగ్గుల పోటీ లాంటివి పెట్టకుండా బాలికలకు ధైర్యం నేర్పండి అన్నారు. ఇంట్లో నుంచి ఆడపిల్లలు బయటికి వెళ్లకుండా ఆపుతున్నారనీ, అదే మగపిల్లలను ఎందుకు ఆపడం లేదో అర్థం కావడం లేదన్నారు. పేదరికంలో ఉన్న మహిళలను వేదిస్తున్నారనీ, ఉద్యోగాల పేరుతో లైంగికంగా ఇబ్బందులు పెడుతున్నారన్నారు. చదువుకున్న మహిళలు ఇంట్లో కూర్చుంటే అది సమాజానికి మంచిది కాదన్నారు. మన వాళ్లకు, మన ఇంట్లో వాళ్లకు, సమాజానికి మనమే రోల్ మాడల్ అవ్వాలన్నారు. సమాజంలో అన్ని రంగాల్లో మహిళలు ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన 10 మంది మహిళలను సత్కరించారు. ప్రతి మహిళ జీవితం ఒక ప్రేరణ కలిగించే కథే అనే అతిథులు అన్నారు. సన్మాన గ్రహీతలు అందరితో మాట్లాడి, మిగతా మహిళలకు ప్రేరణను అందించారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు డా.ప్రతిభా లక్ష్మి మాట్లాడుతూ ఒక తరం మహిళలు కష్టపడి, తమ మగ పిల్లలకు, మహిళలను గౌరవించడం, వారికి సహకరించడం నేర్పించాలి అన్నారు. ఈ ఏడాది అంతర్జాతీయ మహిళా దినోత్సవం థీమ్ ప్రకారం, మహిళలు సాంకేతికతను, కొత్త పరిశోధనలను ఉపయోగించి, లింగ సమానత్వాన్ని సాధించే దిశగా వెళ్ళాలి అని చెప్పారు. ఈ కార్యక్రమంలో డా.జ్యోత్స్న వైద్యుల విభాగంలో, డా.కృష్ణవేణి ప్రొఫెసర్, రమాదేవి రచయిత్రి, జ్యోత్స్న న్యాయవాది, హిరణ్య టీచర్, చిన్మయి సైకాలజిస్ట్, భాగ్యలక్ష్మి గృహిణి, రజిత రైతు విభాగంలో సన్మానాన్ని పొందారు. ఈ కార్యక్రమంలో డా.విజయ లక్ష్మి, డా.సంధ్య, డా.సుధక్షన, డా.అన్నపూర్ణ, డా.మాధురి, ఐటీ, సంతోషి, అశ్విని, అభిరామ్, కరుణ, భవాని, సంజిత, రేణు, మనోజ్, స్నిగ్ధ, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలతో చదివితే ఉన్నత శిఖరాలకు

- బాలానగర్ జోన్ ఏసీపీ ఏ.గంగారాం



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

విద్యార్థులు చిన్ననాటి నుంచే క్రమశిక్షణతోపాటు పట్టుదలతో చదివితే భవిష్యత్తులో సమాజోద్ధారకులవుతారనీ, ఉన్నత శిఖరాలకు చేరుతారని బాలానగర్ జోన్ ఏసీపీ ఏ.గంగారం అన్నారు. గాజులరామారం డివిజన్ పరిధి లెనిన్ నగర్‌లో గల చైతన్య విద్యానికేతన్ పాఠశాల (బ్రాంచ్)వార్షికోత్సవ వేడుకలకు (తరంగ్) ఆయనతో పాటు గౌరవ అతిథులు విశ్రాంత ప్రధానోపాధ్యాయులు, ఫార్మల్ ఎడ్యుకేషన్ ప్రాజెక్ట్ అధికారి, కాల్వల ప్రకాష్ రాయుడు, పలు విభాగాల ఏసీపీలు కే.వెంకట్ రెడ్డి వి.భాస్కర్, కె.బాలకృష్ణారెడ్డి, స్థానిక కార్పొరేటర్ రావుల శేషగిరి, మేడ్చల్ జిల్లా ట్రాస్మా అధ్యక్షులు పాఠశాల చైర్మన్, కరస్పాండెంట్ శివరాత్రి యాదగిరితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఏసీపీ మాట్లాడుతూ అసాధ్యాన్ని సుసాధ్యం చేయగల సత్తా విద్యార్థులకు ఉందనీ, ఆ దిశగా విద్యతోపాటు క్రీడలు, శాస్త్ర, సాంకేతిక రంగాల్లో రాణించి దేశ ప్రతిష్ఠను ఇనుమడింపజేయాలని ఆకాంక్షించారు. విద్యార్థుల మనోభావాలకు అనుగుణంగా తల్లిదండ్రులు ప్రోత్సహించాలనీ, అప్పుడే వారి కలలు సాకారం అవుతాయని తెలిపారు. విద్యతోపాటు క్రీడలు శాస్త్ర సాంకేతిక రంగాల్లో రాణించి దేశ ప్రతిష్ఠలు ఇనుమడింపజేయాలని ఆకాంక్షించారు. పాఠశాల చైర్మన్ కరెస్పాండెంట్ శివరాత్రి యాదగిరి మాట్లాడుతూ తమ అధ్యాపక బృందం సమిష్టి కృషితోనే ప్రతి యేడు మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నామని స్పష్టం చేశారు. విద్యార్థి పట్ల వ్యక్తిగత శ్రద్ధ తీసుకుంటూ భావిభారతం పౌరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా తమ యాజమాన్యం సిబ్బంది కృషి చేస్తున్నామన్నారు. విద్యతోనే విశ్వాన్ని జయించవచ్చునని విద్యార్థులు సూచించారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతుల్ని ఎంతగానో అలరించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శివరాత్రి మంగ యాదగిరి, ట్రస్మా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వి.రామకృష్ణారావు, జగద్గిరిగుట్ట సీఐ పి.సైదులు, ట్రస్మ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.నాగరాజు, కోశాధికారి ఎండి.అజార్ ఖాన్, కుత్బుల్లాపూర్ మండల ట్రస్మ అధ్యక్షురాలు అల్వాల వనజ అశోక్, బాలానగర్ మండలం ట్రస్మా అధ్యక్షులు సుశీల్ కుమార్, కూకట్పల్లి మండల ట్రస్మా అధ్యక్షులు, జే.కమలాకర్ రావు, గండిమైసమ్మ మండల ట్రస్మ అధ్యక్షులు ప్రవీణ్ కుమార్, పాఠశాల ఇన్‌చార్జి సి.సరళ, గీత, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు' దేశంలోనే గొప్ప కార్యక్రమం



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

కంటి వెలుగు కార్యక్రమం దేశంలోనే గొప్ప కార్యక్రమం అని హైదర్ నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నే శ్రీనివాస్ రావు అన్నారు. రెండో విడత కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా హైదర్ నగర్ డివిజన్ పరిధిలోని హెచ్ఎంటీ హిల్స్ కాలనీలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు సెంటర్‌ను సోమవారం ఆయన ఆకస్మికంగా వెళ్ళి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ మానవ అవయవాల్లో అతి ప్రధాన అవయవం కన్ను అన్నారు. తెలంగాణలోని అంధత్వానికి గురైన అన్ని ప్రాంతాల ప్రజలకు, వారు ఎక్కడ నివసిస్తున్నా, ఏం చేస్తున్నా, ఏ కంటి సమస్య ఉన్నా వారైనా నివారణ మార్గాలను, అత్యున్నత నాణ్యత గలిగిన వైద్యం ఖర్చు లేకుండా అందుబాటులోనికి తేవడం రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు. కంటి సమస్యలున్న వారు మీ పరిసర ప్రాంతాల్లో ఉన్న కంటి పరీక్షా శిబిరంలో పాల్గొనాలని సూచించారు. ఉచితంగా కంటి పరీక్షలు, మందులు, కండ్ల అద్దాలు ఇవ్వనున్నట్టు తెలిపారు. ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు క్యాంపులు నిర్వహణ ఉంటుంది అనీ, మెడికల్ ఆఫీసర్ ఆధ్వర్యంలో 8 మంది వైద్య సిబ్బంది ఉంటారనీ, ఒక అప్టో మెట్రిస్ట్, ఒక సూపర్‌వైజర్, ఇద్దరు ఏఎన్ఎం, ముగ్గురు ఆశా, 1 డీఈవో టీంలో సభ్యులుగా ఉంటారన్నారు. కార్యక్రమంలో ఏఎంఎం సిబ్బంది, మాధవ్, రమణ రెడ్డి, శ్రీను పాల్గొన్నారు.

భూమిని కబ్జాకు పాల్పడుతున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలి : బాధితుడు మహ్మద్ సలీం

నవతెలంగాణ-మేడ్చల్



తన భూమిని కబ్జాకు పాల్పడుతున్న వ్యక్తులపై తగిన చర్యలు తీసుకుని కాపాడాలని బాధితుడు మహ్మద్ సలీం అన్నారు. సోమవారం మీడియా ముఖంగా ఆయన మాట్లాడుతూ మేడ్చల్ పట్టణంలోని సర్వే నంబర్ 622లో 11 గుంటల భూమిని 2016లో కిష్టపూర్‌కు చెందిన బండమీది మల్లమ్మ అనే మహిళ వద్ద నుంచి కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకునట్టు తెలిపారు. ఈ స్థలంలో కొందరు గుర్తుతెలియని వ్యక్తులు తను ఏర్పాటు చేసిన బోర్డ్‌లను తొలగించి కబ్జాకు ప్రయత్నిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే విషయమై కోర్టులో కేసు వేసి గత నెలలో ఇంజక్షన్ ఆర్డర్ తీసుకున్నట్టు తెలిపారు. కబ్జాకు పాల్పడుతున్న వ్యక్తులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఈ నెల 6వ తేదీన మేడ్చల్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. భూమి వివాదం కోర్టు పరిధిలో వుండగానే కొంత మంది గుర్తు తెలియని వ్యక్తులు కబ్జా చేస్తూ ప్రహరీ గోడ నిర్మిస్తున్నారనీ, ఆ వ్యక్తుల చట్టపరమైన చర్యలు తీసుకుని న్యాయం చేయాలని మహ్మద్ సలీం పోలీస్ ఉన్నత అధికారులను కోరారు.

డ్రయినేజీ సమస్య పరిష్కారానికి కృషి

నవతెలంగాణ-బాలానగర్

మూసాపేట సర్కిల్ ఫతేనగర్ డివిజన్ పరిధిలోని శివ శంకర్ కాలనీలోని బస్తీ వాసులు బస్తీలోని డ్రయినేజీ సమస్య ఔట్లెట్ వల్ల రివర్స్ రావడంతో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారనీ, జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, ఫతేనగర్ డివిజన్ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ దృష్టికి తీసుకు వచ్చారు. వెంటనే స్పందించిన కార్పొరేటర్ జలమండలి అధికారి డీజీఎం షంశీర్, మేనేజర్ అనిల్ గౌడ్ తో కలిసి సోమవారం కాలనీలో పాదయాత్ర నిర్వహించారు. ఈ క్రమంలో ఔట్లేట్ సమస్యను గుర్తించి ఎస్టీపీ కట్టడం వల్ల ఔట్లేట్ కు నష్టం జరిగినందున వెంటనే పునర్ నిర్మాణం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో బస్తీ వాసులతో పాటు సాయినాథ్ గౌడ్, శివరామ్, కరీమ్, తదితరులు పాల్గొన్నారు.



బ్యూటీ అండ్ బియాండ్ 11వ స్టోర్ ప్రారంభం

నవతెలంగాణ-సిటీబ్యూరో



స్కంధన్ని రిటైల్ ప్రయివేటు లిమిటెడ్ ఆధ్వర్యంలో కె.సురేష్ కుమార్‌రెడ్డి స్థాపించిన "బ్యూటీ అండ్ బియాండ్" అనే సిటీ-లీడింగ్ స్కిన్‌కేర్ స్టోర్ లిమిటెడ్ ఏఎస్ రావు నగర్‌లోని సోమయ్య టవర్స్‌లో కొత్త స్టోర్‌ను నటి, టీవీ ప్రెజెంటర్ శ్రీముఖి ముఖ్య అతిథిగా హాజరై బ్యూటీ అండ్ బియాండ్ డైరెక్టర్ జగతి రెడ్డి, బిజినెస్ హెడ్ శివ గోవర్ధన్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నటి శ్రీముఖి మాట్లాడుతూ బీ అండ్ బీ అనేది రోజువారీ అందం, శ్రేయస్సు అవసరాలను తీర్చగల అభివృద్ధి చెందుతున్న సర్వశక్తి-ఛానల్ రిటైల్ కంపెనీ అన్నారు. అన్ని ప్రముఖ బ్రాండ్‌లను ఒకే పైకప్పు కింద కలిగి ఉందనీ, చర్మ సంరక్షణ, జుట్టు సంరక్షణ, సువాసన, ఫిట్‌నెస్ వంటి అన్ని అవసరాలను క్లయింట్‌లు గుర్తించడం సౌకర్యంగా ఉంటుందని ఆమె పేర్కొన్నారు. ఆరోగ్య సంరక్షణ ఉత్పత్తులతో పాటు మన సౌందర్య సంరక్షణ ఉత్పత్తులను కనుగొనగలిగే ఇన్నర్, ఔటర్ బ్యూటీ అన్-రొటీన్ ఆలోచనతో వచ్చిన బీ అండ్ బీ వ్యవస్థాపకుల ఆలోచనను ఆమె ప్రశంసించారు. కస్టమర్‌లకు అవుట్‌లెట్‌గా ఒకే పైకప్పు కింద అన్ని బ్యూటీ బ్రాండ్‌లను అందించడం మంచి పరిణామమన్నారు. ఇక్కడ స్టోర్‌లో, మేబెల్‌లైన్, మామా ఎర్త్, హ్యూగో బాస్, లోరియల్, గార్నియర్, ఛాంబర్, మరెన్నో బ్యూటీ అండ్ బియాండ్ అన్ని ప్రీమియం బ్రాండ్‌లను కలిగి ఉన్నాయి. నటి శ్రీముఖి కొత్త స్టోర్‌ను ఆవిష్కరించడాన్ని చూడటానికి పరిసరప్రాంత ప్రజలు భారీగా వచ్చారు.

24వ రోజుకు 'హాత్ సే హాత్ జోడో అభియాన్ యాత్ర'

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్



సూరారం 129 డివిజన్ పరిధిలోని సంజయ్ గాంధీ నగర్ (మారుతి మెడికల్ షాప్), న్యూ షాపు నగర్‌లలో జెండా ఎగరవేసిన నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు టీపీసీసీ ప్రతినిధి కోలన్ హన్మంత్ రెడ్డి గడపగడపకు హాత్ సే హాత్ జోడో అభియాన్ స్టికర్ వేసి, కరపత్రాలు పంచుతూ బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాల ద్వంద్వ నీతిని, అధికారం కోసం మోసపూరిత హామీలతో ప్రజలకు జరిగిన అన్యాయం గురించి వివరించారు. రాబోయే ఎన్నికలలో కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు. గెలిపిస్తే అధికారంలోకి రాగానే తెలంగాణలో రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇస్తామన్నారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, రైతులకు వడ్డీ లేని రుణాలు, ఉన్న రుణాలకు రుణమాఫీ చేయనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షులు శ్రావణ్ కుమార్, ఆల్ ఇండియా దళిత సేన అధ్యక్షులు ఆవిజే జేమ్స్, పండరి రావు మారి సంతోష్ ముదిరాజ్, శ్రీశైలం యాదవ్, సంపంగి వెంకటేష్, సురేష్ రెడ్డి, కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం : కార్పొరేటర్ బాబురావు



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

క్రీడలు మానసిక ఉల్లాసానికి, శరీర ధారుఢ్యానికి ఎంతగానో దోహదపడుతాయని బాలాజీనగర్ డివిజన్ కార్పొరేటర్ పగుడాల శిరిష బాబురావు అన్నారు. సోమవారం డివిజన్ పరిధిలోని కేపీహెచ్‌బీ కాలనీ 15వ ఫేజ్ జంగిల్ బుక్ థీమ్ పార్కు వెనుక నూతనంగా నిర్మిస్తున్న లాంగ్ టెన్నిస్ కోర్టు కోసం జరుగుతున్న పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ పిల్లలు క్రీడ పట్ల అత్యంత ఉత్సాహం చూపే విధంగా అవకాశాలు కల్పిస్తూ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు చర్యలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. పిల్లలు క్రీడ పట్ల ఆకర్షితులైయ్యే విధంగా తల్లితండ్రులు ప్రోత్సహించాలన్నారు. పిల్లలు ఆటలు ఆడటంతో శరీరానికి మంచి వ్యాయామం లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అజయ్ రైన, భాస్కర్ రావు, నర్సింగ్ రావు, శారద, తదితరులు పాల్గొన్నారు.

భ్రమరాంబ మల్లికార్జున స్వామి కల్యాణోత్సవంలో వెంగల్‌రావు

నవతెలంగాణ-కూకట్‌పల్లి



కూకట్‌పల్లి మూసాపేట్ యాదవ్ బస్తీలోని శ్రీ భ్రమరాంబికా మల్లికార్జున స్వామి కల్యాణ మహోత్సవం సందర్భంగా స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన కూకట్ పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మాజీ కార్పొరేటర్ గొట్టిముక్కల వెంగళరావు.కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కుమార్ యాదవ్, తూము సంతోష్ కుమార్, తూము వేణు, ఎల్లేష్ యాదవ్, మల్లేష్, యాదవ్, రమేష్ యాదవ్, శ్రీకాంత్ యాదవ్, అంజయ్య యాదవ్, పద్మారావు యాదవ్, వెంకటేష్ యాదవ్, రాజు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కార్మికులందరూ ఐక్యమత్యంతో ఉద్యమించాలి

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్/జగద్గిరిగుట్ట



మార్బల్, టైల్స్ వర్కర్స్ అధ్యక్షులు కామ్రేడ్ సాయిలు అధ్యక్షతన కార్మికుల సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులందరూ తమ సమస్యలపై ఐక్యమత్యంతో ఉండి పోరాడాలనీ, తద్వారా మన హక్కులు సాధించుకోవచ్చని తెలిపారు. ప్రభుత్వం మంజూరు చేసే ఇన్సూరెన్స్ కార్డులను ప్రతి కార్మికుడు తీసుకోవాలనీ, ఇదివరకే తీసుకున్న వాళ్లు సమయానికి రెన్యువల్ చేయించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా సమావేశంలో సభ్యులందరూ ప్రతి అమావాస్యకు పని బంద్ పెట్టాలని తద్వారా కార్మికుల ఐక్యతను చాటాలని ఏకగ్రీవంగా తీర్మానాన్ని ఆమోదించారు. ఈ సమావేశంలో యూసుఫ్, జహంగీర్, నజీర్‌గౌస్, సాయిబాబా, కృష్ణ, రాజు, యాదగిరి, ఫాయిమ్, మెరాజ్, రవి, మాజిద్, ఇర్ఫాన్ పాషా పాల్గొన్నారు.

రామాలయం వార్షికోత్సవంపై సమీక్షా సమావేశం

నవతెలంగాణ-కూకట్‌పల్లి



కూకట్‌పల్లి రామాలయంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, రాబోయే శ్రీరామనవమి, ఆలయ వార్షికోత్సవంకు సంబంధించి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇందులో ప్రధానంగా శ్రీరామనవమి వేడుకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మంచి నీరు, అలంకరణ విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలనీ, భక్తులకు అందుబాటులో వైద్య సౌకర్యాలు కూడా కల్పించాలనీ, ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాబోవు వార్షికోత్సవాలకు సంబంధించి ఆలయ అలంకరణ యజ్ఞయాగాధులకు సంబంధించి సమీక్షించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ పగడాల బాబురావు, మాధవరం రంగారావు, దేవాదాయ శాఖ అధికారి ఆంజనేయులు, కమిటీ సభ్యులు తులసీరావ్, తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్ 2 ,3,4 ల ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ త్వరలో నిర్వహించే గ్రూప్ - 2, గ్రూప్ - 3, గ్రూప్ - 4 ఉద్యోగ నియామకాల్లో భాగంగా మేడ్చల్ జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ కేంద్రం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, జగ్జీవన్ రామ్ సూరారం భవనంలో నిర్వహించనున్నారు. మేడ్చల్ జిల్లాకు చెందిన షెడ్యూల్ కులాల నిరుద్యోగులు ఏదైనా కోర్సులో డిగ్రీ పూర్తి చేసి నిరుద్యోగులైన యువతీ ,యువకులకు స్పెషల్ ఫౌండేషన్ కోర్స్ గ్రూప్ - 2, గ్రూప్ - 3, గ్రూప్ - 4 లకు కోచింగ్ ఇస్తున్న తరుణంలో.. ఉచిత శిక్షణకు దరఖాస్తులు కోరుతున్నట్టు మేడ్చల్ - మల్కాజ్గిరి జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి సంస్థ అధికారి జి.వినోద్ కుమార్ తెలిపారు. అభ్యర్థుల ఉచిత శిక్షణతో పాటు అవసరమైన అధ్యాయన సామగ్రి, భోజన ఖర్చులు కూడా ఇవ్వనున్నట్టు తెలిపారు. అర్హత గల వారు ఈ కింది ఫోన్ నెంబర్ సంప్రదించాలని కోరారు. సహాయ సాంఘిక సంక్షేమ అధికారి ఫోన్ నెం.9618266091, వసతి గృహ సంక్షేమ అధికారి కొండలరావు ఫోన్ నెంబర్ 9000535051, వసతి గృహ సంక్షేమ అధికారి నరసింహ ఫోన్ నెంబర్ 9949183754ను సంప్రదించాలి.

బంగారు మైసమ్మ విగ్రహ పున ప్రతిష్టాపనలో ఎంపీపీ

నవతెలంగాణ-మేడ్చల్



మేడ్చల్ మండల పరిధిలోని రైలపూర్ గ్రామంలో బంగారు మైసమ్మ విగ్రహ పున ప్రతిష్టాపన ఉత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి దంపతులు, జిల్లా సమన్వయ సమితి అధ్యక్షుడు నందా రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు, జెడ్పీటీసీ హరివర్ధన్ రెడ్డి, సర్పంచ్‌లు నర్మదా గోపాల్ రెడ్డి, సురేందర్ ముదిరాజ్, ఎంపీటీసీ అనుప శ్రీకాంత్ రెడ్డి, ఉప సర్పంచ్ శివలక్ష్మి, మాజీ జెడ్పీటీసీ శైలజ హరినాథ్, కో-ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ అంతిరెడ్డి పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రమణారెడ్డి, మాజీ సర్పంచ్‌లు సాయికుమార్, నరసింహ, మాజీ ఉపసర్పంచ్ గోపాల్ రెడ్డి, నాయకులు వెంకటరామిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, నరేందర్ రెడ్డి, గ్రామస్తులు మనోహర్ బాబు, జల్లి మల్లేష్ బాబు, చంద్రశేఖర్, రాజ్ కుమార్, ప్రభాకర్, భద్రేశ్, కుమార్, సత్యనారాయణ, మల్లేష్, యాదగిరి, నరేందర్, విజయ్, రమేష్, నారాయణ, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతం

నవతెలంగాణ-శామీర్‌పేట



మహబూబ్ నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా ఉమ్మడి శామీర్ పేట మండలంలోని శామీర్ పేట జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలోని పోలింగ్ స్టేషన్ 97 లో సోమవారం ఎమ్మెల్సీ ఎన్నికల ఓటింగ్ కార్యక్రమం ప్రశాంతంగా ముగిసింది. ఈ ఎన్నికల్లో మొత్తం 149 మంది ఓటర్లు ఉండగా 125 మంది ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాగా పురుషులు 60, స్త్రీలు 65 మంది ఓటు వేసినట్లు (పి ఓ) ఎం.స్వామి తెలిపారు.

నవచిత్రం

వలస కుటుంబం చేసిన పోరాటానికి
ఆస్కార్ అవార్డుల పంట

ప్రపంచ సినీ చరిత్రలో అత్యంత ప్రతిష్టాత్మకంగా భావించే ఆస్కార్ వేడుకలు లాస్ ఏంజిల్స్‌లోని డాల్బీ థియేటర్‌లో ఘనంగా జరిగాయి. 95వ ఆస్కార్ అవార్డుల వేడుకకు దేశ, విదేశాల నుంచి సినీ తారలు హాజరయ్యారు. విభాగాల వారిగా అవార్డుల ప్రధానోత్సవం జరిగింది.

బెస్ట్ సపోర్టింగ్ యాక్టర్‌తో మొదలైన ఆస్కార్ అవార్డులు.. బెస్ట్ పిక్చర్ అవార్డుతో ముగిసాయి. రెండు భారతీయ సినిమాలు ఆస్కార్ గెలుచుకోవడంతో భారతీయ ప్రేక్షకుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. ఇక 'నాటు నాటు' పాటకు అవార్డు రావడంతో రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రజలు సంబురాలు చేసుకుంటున్నారు. ఆర్‌ఆర్‌ఆర్ బృందంపై ప్రశంసల జల్లులు కురిపిస్తున్నారు. మూడు నామినేషన్లతో బరిలోకి దిగిన మన దేశం రెండు అవార్డులను దక్కించుకోవడం విశేషం. 'ఎవ్రీథింగ్ ఎవ్రీవేర్ ఆల్ ఎట్ వన్స్' చిత్రానికి అవార్డుల పంట పండింది. ఈ సినిమా ఏకంగా ఏడు అవార్డులను గెలుచుకుంది. ఉత్తమ చిత్రం, ఉత్తమ దర్శకుడు, ఉత్తమ నటి, ఉత్తమ సహాయ నటి, ఉత్తమ సహాయ నటుడు, ఉత్తమ స్క్రీన్‌ప్లే, ఉత్తమ ఎడిటింగ్ విభాగాల్లో అవార్డులను గెలిచి చరిత్ర సృష్టించింది.



ఉత్తమ చిత్రం సహా ఆరు విభాగాల్లో అవార్డులు అందుకున్న 'ఎవ్రీథింగ్ ఎవ్రీవేర్ ఆల్ ఎట్ వన్స్' చిత్రం




రెండు ఆస్కార్లతో భారత్ విజయకేతనం

'ఎవ్రీథింగ్ ఎవ్రీవేర్ ఆల్ ఎట్ వన్స్' ఇదొక సైన్స్ ఫిక్షన్ చిత్రం. డేనియల్ క్వాన్, డానియెల్ షైనెర్ట్ సంయుక్తంగా దర్శకత్వం వహించారు. మిషెల్ యో, కి హుయ్ క్వాన్, జామీ లీ కర్టిస్ వంటి హేమాహేమీలతో ఇది రూపుదిద్దుకుంది. ఎవిలిన్ క్వాడ్ అనే చైనీస్ వలసదారుల కుటుంబం అమెరికాలో లాండ్రీ షాపు రన్ చేస్తుంటుంది. అనుకోకుండా ఓ రోజు వేరే ప్రపంచం నుంచి వచ్చిన తన లాంటి వాళ్లే ఆమెకు ఎదురవుతారు. ఆ మల్టీవర్స్ కలిగించే ప్రమాదాల వల్ల ఆమె ఎలాంటి పరిణామాలు ఎదుర్కొంది?, తన కుటుంబాన్ని ఎలా కాపాడుకుంది? అనే ఆసక్తికర అంశాలతో సినీ ప్రియులను ఆకట్టుకునేలా దీన్ని రూపొందించారు. మొత్తం 11 విభాగాల్లో నామినేషన్లు పొందిన ఈ చిత్రం ఉత్తమ చిత్రం సహా ఆరు అవార్డులను కైవసం చేసుకుని విజయ కేతనాన్ని ఎగురవేసింది.

నా మదిలో ఒకే ఒక కోరిక ఉండేది. అదే 'ఆర్‌ఆర్‌ఆర్' ఆస్కార్ కైవసం చేసుకోవాలని. ఈ సినిమా భారతీయులను గర్వపడేలా చేసింది. నన్ను ప్రపంచ శిఖరాగ్రాన నిలబెట్టింది. థ్యాంక్యూ కార్తికేయ. ఇలానే మరిన్ని చిత్రాలు చేసి ఇలాంటి ఘనతలు సాధ్యమయ్యేలా చేయాలి అంటూ ఆస్కార్ వేదికపై కీరవాణి భావోద్వేగానికి గురయ్యారు.

ఇక చంద్రబోస్ 'నమస్తే' అంటూ తెలుగులో చెప్పారు. నాటు నాటు పాటను అనౌన్స్ చేయగానే రాజమౌళి, ఆయన భార్య రమా సంతోషంతో భావోద్వేగానికి గురయ్యారు. కార్తికేయ దంపతులతో కలిసి గంతులేశారు. 'నాటునాటు' పాట రిచ్ నెస్‌కు కారణం రమా అని రాజమౌళి కొనియాడారు. ఈ పాటకు ఆమె కాస్ట్యూమ్ డిజైనర్‌గా పనిచేశారు.

ఆస్కా'ఆర్‌ఆర్‌ఆర్‌ర్' విజయానందంలో కీరవాణి, చంద్రబోస్



బెస్ట్ డాక్యుమెంటరీ షార్ట్ ఫిల్మ్ చిత్రంగా ఎంపికైన భారతీయ చిత్రం 'ది ఎలిఫెంట్ విస్పరర్స్'

బెస్ట్ డాక్యుమెంటరీ షార్ట్ ఫిల్మ్ విభాగంలో మన దేశం నుంచి నామినేట్ అయిన 'ది ఎలిఫెంట్ విస్పరర్స్' ఆస్కార్ దక్కించుకుంది. దర్శకురాలు కార్తికి గోన్‌సాల్వెస్, నిర్మాత గునీత్ మోగ్న ప్రతిష్టాత్మక ఆస్కార్ అవార్డులను అందుకున్నారు. తమ శ్రమను గుర్తించి, అవార్డును అందించిన అకాడమీ బృందానికి ధన్యవాదాలు చెప్పారు. దర్శకురాలిగా కార్తికి తొలి ప్రయత్నంలోనే ఆస్కార్‌ని సొంతం చేసుకోవడం విశేషం. 42 నిమిషాలు నిడివిగల ఈ చిత్రం రెండు అనాథ ఏనుగు పిల్లలను ఆదరించిన ఓ పేద దంపతుల కథ.

ఇక బెస్ట్ డాక్యుమెంటరీ ఫీచర్ ఫిల్మ్ విభాగంలో మన దేశం నుంచి నామినేట్ అయిన 'ఆల్ దట్ బ్రీత్స్'కి అవార్డు దక్కలేదు. ఈ చిత్రానికి షానక్ సేన్ దర్శకత్వం వహించాడు. ఈ విభాగంలో 'నవానీ' చిత్రం అవార్డు అందుకుంది.

95వ ఆస్కార్ అవార్డుల విజేతలు

ఉత్తమ చిత్రం:
ఎవ్రీథింగ్ ఎవ్రీవేర్ ఆల్ ఎట్ వన్స్
ఉత్తమ దర్శకుడు:
డానియల్ క్వాన్, డానియల్ స్కీనర్ట్- ఎవ్రీథింగ్ ఎవ్రీవేర్ ఆల్ ఎట్ వన్స్
ఉత్తమ నటుడు:
బ్రెండన్ ఫాసర్- దివేల్
ఉత్తమ నటి:
మిచెల్ యో
ఉత్తమ సహాయ నటుడు:
కే హ్యూ క్వాన్- ఎవ్రీథింగ్ ఎవ్రీవేర్ ఆల్ ఎట్ వన్స్
ఉత్తమ సహాయ నటి:
జామీ లీ కర్టిస్-ఎవ్రీథింగ్ ఎవ్రీవేర్ ఆల్ ఎట్ వన్స్
ఉత్తమ సినిమాటోగ్రఫీ:
జేమ్స్ ఫ్రెండ్- ఆల్ క్వైట్ ఆన్ ది వెస్టర్న్ ఫ్రంట్
ఉత్తమ ఎడిటింగ్:
పాల్ రోజర్స్-ఎవ్రీథింగ్ ఎవ్రీవేర్ ఆల్ ఎట్ వన్స్
ఉత్తమ ప్రొడక్షన్ డిజైన్:
క్రిస్టియన్ ఎమ్.గోల్డ్‌బెక్‌బీ సెట్ డెకరేషన్:ఎర్నెస్టన్ -ఆల్ క్వైట్ ఆన్ ది వెస్టర్న్ ఫ్రంట్
ఉత్తమ ఇంటర్‌నేషన్ ఫీచర్ ఫిల్మ్:
ఆల్ క్వైట్ ఆన్ ది వెస్టర్న్ ఫ్రంట్-ఎడ్వర్డ్ బర్గర్
ఉత్తమ యానిమేటెడ్ ఫీచర్ ఫిల్మ్:
గిల్లెర్మో డెల్ టోరో యొక్క పినోచియో.
ఉత్తమ డాక్యుమెంటరీ ఫీచర్ ఫిల్మ్:
నవనీ
ఉత్తమ డాక్యుమెంటరీ షార్ట్ ఫిల్మ్:
ది ఎలిఫెంట్ విస్పరెర్స్ -కార్తికి గోన్సాల్వ్స్, గునీత్ మోంగా
ఉత్తమ లైవ్ యాక్షన్ షార్ట్ ఫిల్మ్:
యాన్ ఐరిష్ గుడ్‌బై
ఉత్తమ ఒరిజినల్ స్కోర్:
వోల్కర్ బెర్టెల్మాన్ -ఆల్ క్వైట్ ఆన్ ది వెస్టర్న్..
ఉత్తమ ఒరిజినల్ సాంగ్:
నాటు నాటు- ఎమ్.ఎమ్ కీరవాణి, చంద్రబోస్
ఉత్తమ సౌండ్: టాప్ గన్: మావెరిక్
ఉత్తమ విజువల్ ఎఫెక్ట్స్:
అవతార్:ది వే ఆఫ్ వాటర్


కాలభైరవ, రాహుల్ సిప్లిగంజ్



ఈసారి ఆస్కార్ అవార్డుల ప్రదానోత్సవంలో బాలీవుడ్ అగ్రనటి దీపికా పదుకొనె ప్రెజంటర్‌గా మెరిసి అందర్నీ సర్‌ప్రైజ్ చేయటం ఓ విశేషమైతే, ప్రపంచ వ్యాప్తంగా విపరీతమైన క్రేజ్‌ని సొంతం చేసుకున్న 'ఆర్‌ఆర్‌ఆర్' నాటు పాట గురించి ఆస్కార్ వేదికపై చెప్పేందుకు రావడం మరో విశేషం.

'ఈ పాట ఆర్‌ఆర్‌ఆర్‌లో ఒక ముఖ్యమైన సన్నివేశంలో వచ్చింది. ఈ సినిమా స్నేహం ఆధారంగా, ముఖ్యంగా ఇద్దరు రియల్ లైఫ్ విప్లవ వీరులు అల్లూరి సీతారామరాజు, కొమరం భీం మధ్య నడిచింది. ఈ పాటని తెలుగులో పాడటమే కాకుండా, వలసవాద వ్యతిరేక ఉద్యమానికి నాందిగా ఇది

డు యూ నో నాటు..

ఉగ్రూతలూగించింది. ఈ పాటకి మిలియన్స్ కొద్దీ వ్యూస్ యూట్యూబ్ లోనూ, టిక్ టాక్ లోనూ, అలాగే వరల్డ్ వైడ్‌గా థియేటర్స్‌లో ప్రేక్షకులు లేచి డాన్స్ చేశారు కూడా. ఇది మొదటి ఇండియన్ ప్రొడక్షన్ కంపెనీ నుండి ఆస్కార్‌కి నామినేట్ అయిన మొదటి పాట కూడా' అని చెప్పి, 'నాటు అంటే మీకు తెలుసా' అని అడిగారు. 'ఒకవేళ మీకు తెలియకపోతే, ఇప్పుడు తెలుసుకుంటారు' అంతేకాదు 'నాటు నాటు' పాటా చూస్తూ వింటారు అని చెప్పారు. గాయకులు కాలభైరవ, రాహుల్ సిప్లిగంజ్ లైవ్‌లో పాడగా, వెస్టర్న్ డాన్సర్లు తమ డ్యాన్స్‌తో అలరించారు. ఈ పాట ప్రదర్శన పూర్తయిన తర్వాత అందరూ లేచి నిల్చుని చప్పట్లతో అభినందిచడం విశేషం.

దీపికా పదుకొనె


వైరల్ పిక్ : ఆస్కా'ఆర్‌ఆర్‌ఆర్‌ర్'ని ఇంటికి తీసుకొస్తున్నారట..

భారతీయులు గర్విస్తున్న క్షణాలివి

ఆస్కార్స్‌లో అవార్డు అందుకున్న తొలి భారతీయ చిత్రంగా ఆర్‌ఆర్‌ఆర్ నిలవడం అద్భుతమైన విషయం. ఇలాంటి అద్భుతమైన అవకాశం రావడానికి కారణం వన్ మ్యాన్ ఎస్ ఎస్ రాజమౌళి. ఆయన ప్రతీ భారతీయుడు గర్వపడేలా చేశారు. ఎన్టీఆర్, రామ్‌చరణ్, కీరవాణి, చంద్రబోస్, కాలభైరవ, రాహుల్ సిప్లిగంజ్.. మీరంతా కలిసి చరిత్ర సృష్టించారు.

- చిరంజీవి

'ఆర్‌ఆర్‌ఆర్' చిత్రంలోని 'నాటు నాటు' పాట బెస్ట్ ఒరిజినల్ సాంగ్ కేటగిరిలో ఉత్తమ పాటగా ఆస్కార్ అవార్డును సొంతం చేసుకోవడం భారతీయ సినీ చరిత్రలో అపూర్వ ఘట్టం. తెలుగు జాతితో పాటు దేశం గర్వించదగిన విజయమిది.

- బాలకృష్ణ

ఆస్కార్ బెస్ట్ ఒరిజినల్ సాంగ్‌గా నిలిచిన 'నాటు నాటు...' గీతంలోని తెలుగు పదం నేల నలుచెరగులా ప్రతి ఒక్కరితో పదం కలిపేలా చేసి హుషారెత్తించింది. ఆ హుషారు ఈ రోజు ఆస్కార్ వేదిక మీద రెట్టించిన ఉత్సాహంతో కనిపించింది. ఈ వేదికపై ఈ గీతాన్ని ప్రదర్శించడంతోపాటు అవార్డు పొందటం ద్వారా భారతీయ సినిమా స్థాయి మరో స్థాయికి చేరింది. అంతేకాదు భారతీయ దర్శకులు, నటులు, రచయితలకు స్ఫూర్తినిస్తుంది.

- పవన్‌కళ్యాణ్

ఆస్కార్ పురస్కారం అందుకోవడంలో సహకరించిన ప్రతీ ఒక్కరికీ కృతజ్ఞతలు చెప్పడం ఒక్కటే సరిపోదనిపిస్తోంది. నేనింకా కలలోనే ఉన్నాననిపిస్తోంది. 'నాటు నాటు' సాంగ్ కేవలం పాట మాత్రమే కాదు.. ఇది గ్లోబల్ ఎమోషన్. మేం గెలిచాం..ఓ ఇండియన్ సినిమాగా గెలిచాం.. ఓ దేశంగా గెలిచాం.

- రామ్‌చరణ్

మేం ఆస్కార్‌ను సాధించాం. అలాగే ఆస్కార్ గెలుచుకున్న మొదటి ఇండియన్ డాక్యుమెంటరీగా మమ్మల్ని గర్వపడేలా చేశారు. ఈ విధంగానే మీరు మరిన్ని కథలను చెప్పాలనుకుంటున్నాను. 'ది ఎలిఫెంట్ విస్పరర్స్' బృందానికి శుభాకాంక్షలు.

- ఎన్టీఆర్

నాటు..నాటు పాట హద్దుల్ని చెరిపేసింది. ప్రతిష్టాత్మక ఆస్కార్ మన సొంతమైంది. ఇది భారతీయ సినిమాకి అపురూపమైన ఘట్టం. ముఖ్యంగా తెలుగు సినిమాకి.

- మహేష్‌బాబు


ఆస్కార్ వేదికపై నాటు..నాటు లైవ్

1,2,3,4.. వరుసగా నాల్గోసారి బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ టీమ్ ఇండియా సొంతమైంది. టెస్టు క్రికెట్‌ను శాసించిన కంగారూలపై ఎదురులేని ప్రదర్శనలతో దుమ్మురేపిన టీమ్ ఇండియా.. ఆస్ట్రేలియాపై టెస్టు సిరీస్‌ను 2-1తో సొంతం చేసుకుంది. స్పందన లేని అహ్మదాబాద్ పిచ్‌పై నాల్గో టెస్టు డ్రాగా ముగియగా ఆతిథ్య జట్టు సిరీస్ విజయం సాధించింది. నాగ్‌పూర్, న్యూఢిల్లీ టెస్టుల్లో భారత్ గెలుపొందగా.. ఇండోర్‌లో ఆసీస్ విజయం సాధించి సిరీస్‌పై ఆసక్తి రేపింది. భారీ స్కోర్లు నమోదైన మొతెరాలో ఫలితం రాలేదు. 2016-17, 2018-19, 2020-21, 2022-23లలో భారత్ 2-1 తేడాతోనే బోర్డర్-గవాస్కర్ ట్రోఫీని కైవసం చేసుకుంది. 2016-17, 2022-23 సిరీస్‌లు భారత్‌లో ఆడగా.. 2018-19, 2020-21 సిరీస్‌లను ఆసీస్ గడ్డపై నెగ్గిన టీమ్ ఇండియా సరికొత్త చరిత్ర సృష్టించిన సంగతి తెలిసిందే. స్పిన్ పిచ్‌లపై ద్వైపాక్షిక టెస్టు సమరం ముగియగా.. ఈ ఏడాది జూన్ 7-11న లండన్‌లోని ది ఓవల్ మైదానంలో పచ్చిక పిచ్‌పై భారత్, ఆస్ట్రేలియా ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ టైటిల్ కోసం తలపడనున్నాయి.



ఎత్తర ట్రోఫీ..నాల్గోసారి

- వరుసగా 4వ సారి బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ సొంతం
- జీవం లేని పిచ్‌పై అహ్మదాబాద్ టెస్టు డ్రా
- 2-1తో టెస్టు సిరీస్ భారత్ కైవసం
- డబ్ల్యూటీసీ ఫైనల్లో టీమ్ ఇండియా

నవతెలంగాణ-అహ్మదాబాద్

భారీ స్కోర్లు నమోదైన అహ్మదాబాద్ టెస్టు చివరకు డ్రాగా ముగిసింది. ఐదు రోజుల్లో మూడు ఇన్నింగ్స్‌లైనా ముగియకపోవటంతో చివరి సెషన్ డ్రింక్స్ విరామం అనంతరం ఇరు జట్లు డ్రాకు అంగీకరించాయి. అహ్మదాబాద్ టెస్టు డ్రా కావటంతో బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ 2-1తో ఆతిథ్య భారత్ గూటికి చేరుకుంది. తొలుత ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 480 పరుగుల భారీ స్కోరు చేసింది. ఉస్మాన్ ఖవాజ (180), కామెరూన్ గ్రీన్ (114) సెంచరీలు సాధించారు. రవిచంద్రన్ అశ్విన్ (6/91) ఐదు వికెట్ల ప్రదర్శన చేశాడు. భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 571 పరుగుల భారీ స్కోరుతో తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సొంతం చేసుకుంది. విరాట్ కోహ్లి (186) మూడేండ్ల నిరీక్షణకు తెరదించుతూ టెస్టు సెంచరీ బాదగా, యువ ఓపెనర్ శుభ్‌మన్ గిల్ (128) స్వదేశంలో తొలి టెస్టు శతకం నమోదు చేశాడు. రెండో ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా 175/2తో ఉండగా కెప్టెన్ స్టీవ్ స్మిత్ డిక్లరేషన్ ప్రకటించి డ్రాకు అంగీకారం తెలిపాడు. మొతెరాలో శతక మోత మోగించిన విరాట్ కోహ్లి 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకున్నాడు. నాలుగు టెస్టుల సిరీస్‌లో రవిచంద్రన్ అశ్విన్ 25 వికెట్లు సహా 86 పరుగులు చేయగా..రవీంద్ర జడేజా 135 పరుగులు సహా 22 వికెట్లు పడగొట్టాడు. అశ్విన్, జడేజా సంయుక్తంగా 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డును అందుకున్నారు. లిటిల్ మాస్టర్ సునీల్ గవాస్కర్ చేతుల మీదుగా టీమ్ ఇండియా కెప్టెన్ రోహిత్ శర్మ బోర్డర్-గవాస్కర్ ట్రోఫీని అందుకున్నాడు.

సహకరించని పిచ్‌పై..! :

ఓవర్‌నైట్ స్కోరు 3/0తో ఐదో రోజు బ్యాటింగ్‌కు వచ్చిన ఆస్ట్రేలియాకు తొలి ప్రాధాన్యం తొలి ఇన్నింగ్స్ లోటు పూడ్చటం. ఐదో రోజు పిచ్‌పై పగుళ్లు ఏర్పడి స్పిన్‌కు ఏమాత్రం సహకరించినా.. అనూహ్య పరాభవం తప్పదని కంగారూ శిబిరం గ్రహించింది. దీంతో తొలుత ఆ జట్టు 91 పరుగుల తొలి ఇన్నింగ్స్ లోటును పూడ్చటంపై దృష్టి నిలిపింది. ఉదయం సెషన్ ఆరంభంలోనే నైట్ వాచ్‌మన్ మాథ్యూ కునేమాన్ (3)ను అవుట్ చేసిన అశ్విన్.. ఆటను రక్తికట్టించాడు. బంతి టర్న్ అవుతుందనే భావనతో అటు ఆసీస్, ఇటు భారత ఆటగాళ్లు కాస్త ఉత్కంఠకు లోనయ్యారు. కానీ పిచ్ నుంచి బౌలర్లకు ఎటువంటి సహకారం లభించలేదు. ఓపెనర్ ట్రావిశ్ హెడ్ (90, 163 బంతుల్లో 10 ఫోర్లు, 2 సిక్స్‌లు), మార్నస్ లబుషేన్ (63 నాటౌట్, 213 బంతుల్లో 7 ఫోర్లు) రెండో వికెట్‌కు శతక భాగస్వామ్యం జోడించారు. ఉదయం సెషన్లో వికెట్ నష్టానికి 70 పరుగులు జోడించిన ఆస్ట్రేలియా.. లంచ్ విరామం అనంతరం కాస్త జోరు పెంచింది. ఓపెనర్ ట్రావిశ్ హెడ్ టాప్ గేర్‌లో బ్యాటింగ్ చేశాడు. ఆరు ఫోర్లు, ఓ సిక్సర్‌తో 112 బంతుల్లోనే అర్థ సెంచరీ ముగించాడు. తొలి ఇన్నింగ్స్ లోటు అధిగమించిన అనంతరం ఆస్ట్రేలియా స్వేచ్ఛగా ఆడింది. మార్నస్ లబుషేన్ సైతం ఆరు ఫోర్లతో 150 బంతుల్లో అర్థ సెంచరీ పూర్తి చేశాడు. శతకం దిశగా సాగుతున్న ట్రావిశ్ హెడ్‌ను అక్షర్ పటేల్ పెవిలియన్‌కు చేర్చాడు. ఈ వికెట్‌లో టెస్టుల్లో అక్షర్ పటేల్ 50 వికెట్ల క్లబ్‌లో చేరాడు. 47 వికెట్లతో బోర్డర్-గవాస్కర్ ట్రోఫీని మొదలెట్టిన అక్షర్ పటేల్.. నాలుగు టెస్టుల్లో కలిపి 3 వికెట్లే పడగొట్టాడు. నాగ్‌పూర్ టెస్టులోనే 50 వికెట్ల క్లబ్ చేరతాడనే అంచనాలు ఉన్నప్పటికీ.. నాల్గో టెస్టు వరకు అక్షర్ పటేల్‌కు ఆ మైలురాయి వికెట్ దూరంగానే ఉండిపోయింది!. ఇక 158/2తో లంచ్ విరామానికి వెళ్లిన ఆస్ట్రేలియా.. డ్రింక్స్ విరామం లోపు మరిన్ని పరుగులు జోడించింది. ఈ సమయంలో చతేశ్వర్ పుజార, శుభ్‌మన్ గిల్ సైతం బంతితో వికెట్ వేట సాగించారు. డ్రింక్స్ విరామం అనంతరం మూడు ఓవర్లలోనే ఆస్ట్రేలియా కెప్టెన్ స్టీవ్ స్మిత్ డ్రాకు అంగీకరించటంతో అహ్మదాబాద్ టెస్టు అలా..అలా చప్పగా ముగిసింది.





స్కోరు వివరాలు :

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ : 480/10

భారత్ తొలి ఇన్నింగ్స్ : 571/10

ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్ : మాథ్యూ కునేమాన్ (ఎల్బీ) అశ్విన్ 6, ట్రావిశ్ హెడ్ (బి) అక్షర్ పటేల్ 90, మార్నస్ లబుషేన్ నాటౌట్ 63, స్టీవ్ స్మిత్ నాటౌట్ 10, ఎక్స్‌ట్రాలు :06, మొత్తం :(78.1 ఓవర్లలో 2 వికెట్లకు) 175.

వికెట్ల పతనం : 1-14, 2-153.

బౌలింగ్ : రవిచంద్రన్ అశ్విన్ 24-9-58-1, రవీంద్ర జడేజా 20-7-34-0, మహ్మద్ షమి 8-1-19-0, అక్షర్ పటేల్ 19-8-36-1, ఉమేశ్ యాదవ్ 5-0-21-0, శుభ్‌మన్ గిల్ 1.1-0-1-0, చతేశ్వర్ పుజార 1-0-1-0.

ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్లో..

బోర్డర్-గవాస్కర్ ట్రోఫీని 2-1తో గెల్చుకున్న టీమ్ ఇండియా టెస్టు సిరీస్ విజయంతో పాటు ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్లో చోటు దక్కించుకుంది. తొలి మూడు టెస్టుల్లోనే 2-1తో సిరీస్‌లో ముందంజ వేసిన టీమ్ ఇండియా.. చివరి టెస్టు డ్రా కావడానికి తోడు శ్రీలంక, న్యూజిలాండ్ తొలి టెస్టులో కివీస్ 3 వికెట్ల తేడాతో గెలుపొందటంతో అధికారికంగా ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్లో అడుగు పెట్టింది. ఇండోర్ టెస్టులో విజయంతో ఆస్ట్రేలియా సైతం ఐసీసీ డబ్ల్యూటీసీ ఫైనల్లో అడుగు పెట్టిన సంగతి తెలిసిందే. జూన్ 7-11న లండన్‌లోని ది ఓవల్ మైదానంలో ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ గద కోసం భారత్, ఆస్ట్రేలియా అమీతుమీ తేల్చుకోనున్నాయి.

2023 ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ వేటను ఇంగ్లాండ్ గడ్డపైనే మొదలెట్టిన భారత్.. వరుసగా రెండోసారి డబ్ల్యూటీసీ ఫైనల్లో ఆడనుంది. ఇంగ్లాండ్‌తో సిరీస్‌లో 2-1తో ముందంజలో ఉండగా.. కరోనా మహమ్మారి కారణంగా చివరి టెస్టు వాయిదా పడింది. ఐపీఎల్ అనంతరం ఇంగ్లాండ్‌లో చివరి టెస్టులో భారత్ కోల్పోయింది. దీంతో సిరీస్ డ్రాగా ముగిసింది. కానీ స్వదేశంలో న్యూజిలాండ్, శ్రీలంక, బంగ్లాదేశ్ సహా ఆస్ట్రేలియాపై సిరీస్ విజయాలు సాధించిన భారత్ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్లో ఆశలు సజీవంగా నిలుపుకుంది. 2021 ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్లో భారత్ నిర్దేశించిన 139 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని ఛేదించిన న్యూజిలాండ్.. ఐసీసీ డబ్ల్యూటీసీ గదను అందుకున్న తొలి జట్టుగా చరిత్ర సృష్టించింది.

ఆటలు

శ్రీలంకపై కివీస్ గెలుపు



క్రైస్ట్‌చర్చ్ : చివరి రోజు ఆట. చివరి సెషన్. ఆఖరు ఓవర్. ఆఖరు బంతి వరకూ ఉత్కంఠగా సాగిన శ్రీలంక, న్యూజిలాండ్ తొలి టెస్టులో ఆతిథ్య కివీస్ 2 వికెట్ల తేడాతో మెరుపు విజయం నమోదు చేసింది. 285 పరుగుల ఛేదనలో వరుణుడు ఆటకు ఆటంకం కలిగించాడు. దీంతో తొలి టెస్టులో డ్రా ఫలితం తప్పదేమో అనిపించింది. కానీ డార్లీ మిచెల్ (81), కేన్ విలియమ్సన్ (121 నాటౌట్) భాగస్వామ్యం మ్యాచ్‌ను మలుపు తిప్పింది. ఆద్యంతం ఉత్కంఠగా సాగిన టెస్టులో శ్రీలంక బౌలర్లు సైతం వికెట్లు పడగొడుతూ న్యూజిలాండ్‌పై ఒత్తిడి పెంచారు. చివరి ఓవర్లో 8 పరుగులు అవసరం కాగా.. కేన్ విలియమ్సన్ మూడో బంతికి బౌండరీ బాది కివీస్ శిబిరంలో వాతావరణం తేలిక పరిచాడు. చివరి బంతికి ఒక్క పరుగు అవసరం కాగా.. విలియమ్సన్ వెంట్రుక వాసి తేడాతో రనౌట్ నుంచి తప్పించుకుని ఉద్విగ్న విజయాన్ని అందించాడు. శ్రీలంక వరుసగా 355, 302 పరుగులు చేయగా.. కివీస్ తొలి ఇన్నింగ్స్‌లో 373 పరుగులు చేసింది.

శాట్స్ సమీక్షా సమావేశం



హైదరాబాద్ : తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ (శాట్స్) చైర్మెన్ ఆంజనేయగౌడ్ సోమవారం ఎల్బీ స్టేడియంలోని కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. శాట్స్ ఆధ్వర్యంలోని స్టేడియాల నిర్వహణ, జిల్లా స్థాయిలో క్రీడాధికారు ల పని తీరు, జిల్లా స్థాయిలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, క్రీడా పాఠశాలలు, స్పోర్ట్స్ అకాడమీలలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. సమావేశంలో క్రీడాశాఖ ముఖ్య కార్యదర్శి, శాట్స్ వీసీ, ఎండీ సందీప్ కుమార్ సుల్తానియా సహా డిప్యూటీ డైరెక్టర్లు, కోచ్‌లు పాల్గొన్నారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

దుబాయ్ లో శిక్ష అనుభవిస్తున్న ప్రవాస భారతీయులను విడుదల చేయాలి

యూఏఈ రాయబారి అబ్దుల్ నసీర్ అల్మాలికు కేటీఆర్ విజ్ఞప్తి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రానికి చెందిన ఐదుగురు ప్రవాస భారతీయులను విడుదల చేయాలని యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ప్రభుత్వానికి మంత్రి కే.తారక రామారావు సోమవారం విజ్ఞప్తి చేశారు. ప్రగతిభవన్‌లో తనతో సమావేశమైన యూఏఈ రాయబారి అబ్దుల్ నసీర్ అల్మాలికి ఈ మేరకు మంత్రి కేటీఆర్ పలు వివరాలను అందజేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన శివరాత్రి మల్లేష్, శివరాత్రి రవి, నాంపల్లి వెంకట్, దండుగుల లక్ష్మణ్, శివరాత్రి హనుమంతులు ప్రస్తుతం దుబాయ్‌లో ఒక కేసులో జైలు శిక్ష అనుభవిస్తున్నారు. 2005లో నేపాల్ దేశానికి చెందిన దిల్ ప్రసాద్ రాయ్ మరణం విషయంలో వీరు ప్రస్తుతం శిక్ష అనుభవిస్తున్నారు. అయితే యూఏఈ చట్టాల ప్రకారం (షరియా చట్టం) మేరకు 15 లక్షల రూపాయల పరిహారాన్ని బాధితుని కుటుంబం స్వీకరించేందుకు అంగీకరించిందనీ, ఈ మేరకు గతంలోనే స్వయంగా తాను నేపాల్ వెళ్లి 2013లోనే బాధితుడి కుటుంబాన్ని కలిసినట్టు తెలిపారు. షరియా చట్టం ప్రకారం బాధితుల కుటుంబం క్షమాపణ పత్రం అందిస్తే వీరిని విడుదల చేసే అవకాశం ఉందనీ, ఈ మేరకు బాధితుని కుటుంబం 2013లోనే అవసరమైన అన్ని రకాల డాక్యుమెంట్లను దుబాయ్ ప్రభుత్వానికి ఇచ్చిందని కేటీఆర్ తెలిపారు. ఇప్పటికే అటు భారత దౌత్య కార్యాలయంతో పాటు యూఏఈ దౌత్య కార్యాలయానికి సైతం ఈ విషయంపై అనేకసార్లు తాను స్వయంగా విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. అయితే యూఏఈ కోర్టు వీరి క్షమాభిక్ష పిటీషన్ తిరస్కరించిందనీ, ఇక దుబాయ్ రాజు షేక్ మహమ్మద్ బిన్ రషీద్ అల్ మక్తుమ్ క్షమాబిక్ష పెడితేనే బాధితులకు విముక్తి లభిస్తుందని వివరించారు. ఈ సంఘటన తాలూకు వివరాలను అటు భారత, నేపాల్ దౌత్య కార్యాలయాల ద్వారా విచారించుకోవాలని కేటీఆర్ సూచించారు. క్షమాభిక్షకు అర్హమైన ఈ కేసులో, దుబాయ్ రాజు సానుకూలంగా స్పందించేలా ఆయన దృష్టికి తమ విజ్ఞప్తిని తీసుకుపోవాలని ఈ సందర్భంగా కేటీఆర్ యూఏఈ రాయబారిని కోరారు. ఈ అంశంలో ప్రత్యేకంగా చొరవ చూపించి, దుబాయిలోని అవీర్ జైల్లో శిక్ష అనుభవిస్తున్న ఐదుగురు భారతీయ ప్రవాసీలను వెంటనే భారతదేశానికి పంపించేలా ప్రయత్నించాలని కోరారు.

బీఆర్ఎస్ పార్టీ కార్యక్రమాల సమన్వయం కోసం ప్రత్యేక నాయకుల బృందం : కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

భారత రాష్ట్ర సమితి విస్తృతంగా చేపడుతున్న కార్యక్రమాలను సమన్వయం చేసేందుకు ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారక రామారావు తెలిపారు. పార్టీ శ్రేణులన్నింటినీ ఏకం చేసేలా విస్తృతంగా చేపట్టనున్న ఆత్మీయ సమ్మేళనాలు, డా.బి.ఆర్.అంబేద్కర్ జయంతి ఉత్సవాలు, పార్టీ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాలు, నియోజకవర్గ ప్రతినిధుల సభ, బీఆర్ఎస్ విద్యార్థి విభాగం కార్యక్రమాలను రానున్న మూడు, నాలుగు నెలలపాటు విస్తృతంగా చేపట్టనున్నామని ఆయన తెలిపారు. ఈ మేరకు కేటీఆర్ పార్టీ జిల్లా అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులతో ప్రత్యేకంగా టెలికాన్ఫరెన్స్ నిర్వహించి దిశానిర్దేశం చేశారు.

ఈ కార్యక్రమాలను అమలు చేసేందుకు ప్రత్యేకంగా పార్టీ తరఫున ఏర్పాటు చేసిన బృందం, జిల్లా అధ్యక్షులు, స్థానిక ఎమ్మెల్యేలతో ఆయా కార్యక్రమాల అమలును సమన్వయం చేస్తుందని తెలిపారు. ఈ మేరకు పార్టీ నియమించిన నాయకులు, జిల్లాల మంత్రులు, స్థానిక ఎమ్మెల్యేలతో వెంటనే సమావేశమై పార్టీ కార్యక్రమాలకు సంబంధించిన ప్రణాళిక అమలుపైనా చర్చించాలనిసూచించారు. పార్టీ శ్రేణులు ఈ బృందంతో కలిసి సమన్వయం చేసుకోవాలని సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో కేటీఆర్ విజ్ఞప్తి చేశారు.

ఎందరికో వెలుగునిస్తున్న కేసీఆర్

- మహిళల కంటి పరీక్షలకు అపూర్వ స్పందన: రాష్ట్ర ఆర్థిక ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు



నవతెలంగాణ- గజ్వేల్

'కేసీఆర్ సారు కంటి శిబిరం ఏర్పాటు చేసి ఎంతో మందికి మేలు చేస్తున్రు.. ప్రయివేటు దవా ఖానలకుపోతే లక్షల రూపాయలు కావాలి. మేం ఎలా పెడతాం. అందుకే కంటి వెలుగు శిబిరంలో పరీక్షలు చేయించు కుంటున్నాం..' అంటూ కంటి వెలుగు శిబిరం తనిఖీకి వచ్చిన మంత్రి హరీశ్‌రావుకు మహిళలు తెలిపారు. సోమవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్ పాత మున్సిపల్‌లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని మంత్రి తనిఖీ చేశారు. అక్కడ కూర్చున్న మహిళలతో ముచ్చటించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ సంకల్పం నెరవేరాలన్నారు. ప్రతి ఇంటిలో వెలుగు నింపేందుకు ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి తీసుకొచ్చారని తెలిపారు. ప్రజలు కంటి పరీక్షలు చేయించుకుంటే వారికి కావాల్సిన అన్ని సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తుందని, కంటి అద్దాలు పంపిణీ చేస్తున్నామన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణలో మంచి కార్యక్రమాన్ని తలపెట్టినప్పుడు అందరూ చేయూతనివ్వాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ముజామిల్ ఖాన్, ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి, ఎఫ్డీసీ చైర్మెన్ వంటేరు ప్రతాప్ రెడ్డి, మున్సిపల్ చైర్మెన్ రాజమౌళి, వైస్ చైర్మెన్ జాకీర్, స్థానిక కౌన్సిల్ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, జిల్లా వైద్యాధికారి కాశీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ గురుకులాల్లో ప్రవేశాలకు ఆన్ లైన్ దరఖాస్తులు

- గురుకుల కార్యదర్శి డాక్టర్ మల్లయ్య భట్టు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బీసీ గురుకులాల్లో 6,7,8 తరగతులు, ఇంటర్, డిగ్రీలో ఉన్న ఖాళీ సీట్లలో ప్రవేశాలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని మహాత్మా జ్యోతిభా పూలే గురుకుల విద్యాసంస్థల కార్యదర్శి డాక్టర్ మల్లయ్యభట్టు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. **http://mjptbcwreis.telangana.gov.in** వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు. 6,7,8 తరగతులకు దరఖాస్తు చేసుకోవడానికి ఏప్రిల్ 20 చివరి తేదీ అనీ, మే రెండున హాల్ టికెట్లు అందు బాటులో ఉంటాయనీ, మే 10న పరీక్షను నిర్వహిస్తామంటూ వివరించారు. ఇంటర్, డిగ్రీ సీట్ల కోసం ఏప్రిల్ 16 చివరి తేదీ కాగా ఏప్రిల్ 20 నుంచి హాల్ టికెట్లు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. ప్రవేశ పరీక్షను ఏప్రిల్ 29న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో నిర్వహిస్తామని తెలిపారు. ఆగష్టు 31నాటికి అన్ని తరగతుల్లో అడ్మిషన్లు పూర్తి చేస్తామని పేర్కొన్నారు. వివరాలకు 040 - 23328266, 23322377 నంబర్లను సంప్రదించాలని సూచించారు.



నవతెలంగాణ - మహబూబ్‌నగర్

గ్రామపంచాయతీ కార్మికుల జీతాలు ఇవ్వాలని మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో వంటావార్పు నిర్వహించి రోడ్డుపైనే భోజనాలు చేశారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు.

రక్తమోడిన రోడ్లు

- వేగంగా వచ్చి ఫుల్లర్ లారీని ఢీకొన్న కారు
- నలుగురు అక్కడికక్కడే మృతి



నవతెలంగాణ-డిచ్‌పల్లి

జాతీయ రహదారి రక్తసిక్తమైంది. ముందు వెళుతున్న ట్రాలా లారీని వెనుకవైపు నుంచి వేగంగా వచ్చిన కారు ఢీకొనగా.. కారులో ఉన్న నలుగురూ అక్కడికక్కడే మృతిచెందారు. ఈ విషాదకర ఘటన నిజామాబాద్ జిల్లా ఇందల్‌వాయి మండలంలోని చంద్రయాన్‌పల్లి శివారులో ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. డిచ్‌పల్లి సీఐ మోహన్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మహారాష్ట్రలోని కొండల్ వాడికి చెందిన నిరడి గణేష్ (28), ఆయన సోదరుడు నిరడి ఆదిత్య (25) అదే గ్రామానికి చెందిన మరో స్నేహితుడు ప్రకాష్ (28) కొంతకాలంగా నిజామాబాద్ జిల్లా కేంద్రంలో నివాసముంటున్నారు. నిరడి గణేష్ జిల్లా కేంద్రంలో మొబైల్ షాప్ నిర్వహిస్తున్నారు. దుకాణానికి కావాల్సిన సామగ్రి కోసం జిల్లా కేంద్రంలోని దుబ్బా ప్రాంతానికి చెందిన సాయిరాం (27)తో కలిసి నలుగురు యువకులు ఆదివారం కారులో హైదరాబాద్‌కు వెళ్లి తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో చంద్రయాన్‌పల్లి 44వ జాతీయ రహదారిపై కారు ముందు వెళ్తున్న భారీ మల్టీ ఎక్స్‌ఎల్ ఫుల్లర్ లారీని వెనుక నుంచి వేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. వేగం తీవ్రతకు కారులో ఉన్న నలుగురూ ఘటనా స్థలంలోనే మృతిచెందారు. ఘటనా స్థలాన్ని నిజామాబాద్ ఏసీపీ కిరణ్ కుమార్, సీఐ మోహన్, డిచ్‌పల్లి ఎస్ఐ కచకాల గణేష్ సిబ్బందితో కలిసి పరిశీలించారు. కారులో ఇరుక్కున్న మృత దేహాలను టోల్ ప్లాజా సిబ్బంది సాయంతో వెలికి తీసి పోస్టుమార్టంకు తరలిం చారు. ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండా భారీ లారీని రహదారిపై నడిపి నలు గురు మృతికి కారణమైన లారీ డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని మృతుడు గణేష్ తండ్రి నిరడి హన్మాండ్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు తెలిపారు.

శరవేగంగా అంబేద్కర్ విగ్రహం పనులు

- మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి



నవతెలంగాణ - హైదరాబాద్:

హుస్సేన్ సాగర్ తీరాన రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 125 అడుగుల విగ్రహ నిర్మాణ పనులను నాడు రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి పరిశీలించారు. సోమవారం ఆయన ఆ విగ్రహాన్ని సందర్శించారు. అంబేద్కర్ జయంతి రోజైన ఏప్రిల్ 14న విగ్రహాన్ని ఆవిష్కరించాలని సీఎం కేసిఆర్ నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో సీఎం ఆదేశాల మేరకు మంత్రి పనుల పురోగతిని పరిశీలించారు. నిర్మాణ ప్రాంగణమంతా కలియతిరిగిన అనంతరం అక్కడే అధికారులు, వర్క్ ఏజెన్సీతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అంటే సీఎం కేసిఆర్ గారికి ప్రత్యేకమైన ప్రేమ అని అన్నారు. వారు రాజ్యాంగంలో పొందుపర్చిన ఆర్టికల్ 3 ప్రకారమే తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని తరుచూ ఆయన్ను కీర్తిస్తుంటారుని చెప్పారు. ఆయన ఆశయాలు, ఆలోచనలు భవిష్యత్ తరాలు నిత్యం స్మరించుకునేలా, ఒక దిక్సూచిలా ఉండేలా హుస్సేన్‌సాగర్ తీరాన అత్యంత ప్రతిష్టాత్మకంగా 125 అడుగుల విగ్రహం నిర్మిస్తున్నారని గుర్తు చేశారు. ఏప్రిల్ 14న అట్టహాసంగా విగ్రహం ఆవిష్కరించాలని ఇప్పటికే నిర్ణయించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమానికి దేశంలోని పలువురు ప్రముఖులు రానున్నారని వివరించారు. ఏప్రిల్ ఐదు లోపు అన్ని రకాల పనులు పూర్తి కావాలని మంత్రి అధికారులకు, వర్క్ ఏజెన్సీకి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఉన్నత విద్యామండలి చైర్మెన్ ప్రొఫెసర్ లింబాద్రి, ఆర్ అండ్ బీ ఈఎన్సీ ఐ గణపతిరెడ్డి, ఎస్.ఈలు హఫీజుద్దీన్, లింగారెడ్డి, ఈ.ఈ రవీంద్ర మోహన్, పలువురు అధికారులు, కేపీసీ నిర్మాణ సంస్థ ప్రతినిధులు అనిల్, కొండల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఆర్ఆర్‌కు ఆస్కార్

- దక్షిణాదికి గర్వకారణం: సౌత్ సేన

నవతెలంగాణ - హైదరాబాద్

ఆర్ఆర్ఆర్ సినిమాలోని నాటు నాటు పాటకు ప్రతిష్టాత్మక ఆస్కార్ అవార్డు రావడంపై సౌత్‌సేన సోమవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేసింది. "దక్షిణ భారతీయులందరూ గర్వపడేలా ఆస్కార్ వేదికపై పురస్కారాన్ని స్వీకరించిన 'ఆర్ఆర్ఆర్' చిత్ర సంగీత దర్శకులు ఎంఎం కీరవాణి, రచయిత చంద్రబోస్‌కు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేసింది. ఆస్కార్ బెస్ట్ ఒరిజినల్ సాంగ్‌గా నిలిచిన 'ఆర్ఆర్ఆర్' చిత్రంలో 'నాటు నాటు' గీతం దక్షిణ భారతీయ సినిమాను మరో స్థాయికి చేర్చింది. ఇంతటి ఘనత పొందేలా 'ఆర్ఆర్ఆర్' చిత్రాన్ని రూపొందించిన దర్శకులు ఎస్ఎస్ రాజమౌళికి ప్రత్యేక అభినందనలు చెప్పింది. ఆ చిత్రంలో కథానాయక పాత్రల్లో ఒదిగిపోయిన ఎన్టీఆర్, రాంచరణ్, గాయకులు రాహుల్ సిప్లిగంజ్, కాలభైరవ, నృత్య దర్శకులు ప్రేమ్ రక్షిత్, చిత్ర నిర్మాత డీవీవీ దానయ్యలకు అభినందనలు' అని సౌత్‌సేన ప్రతినిధులు రవి, శ్రీనివాస్, శ్రీకాంత్, రమేష్ బాబు, విలియం కేర్, జగదీష్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

బండి మాటలు సిగ్గుచేటు : టాక్ ఉపాధ్యక్షురాలు శుష్మణరెడ్డి

నవతెలంగాణ - హైదరాబాద్

సీఎం కేసీఆర్ కూతురు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్‌కుమార్ చేసిన అనుచిత వ్యాఖ్యలను యూకే తెలంగాణ అసోసియేషన్(టాక్) ఉపాధ్యక్షురాలు శుష్మణరెడ్డి ఖండించారు. ఒక పార్టీకి రాష్ట్ర అధ్యక్షుడివి, ఎంపీవి మహిళల పట్ల వ్యవహరించాలో, ఎలా మాట్లాడాలో తెలియకపోవడం సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. రాజకీయాల్లో విమర్శలు హుందాగా ఉండాలని అభిప్రాయపడ్డారు. మహిళలను కించపరిచేలా మాట్లాడటం సమాజం సహించదని హితవు పలికారు. భాష రాకపోతే నేర్చుకోవాలనీ, ఇష్టారాజ్యంగా మాట్లాడితే సహించేది లేదని హెచ్చరించారు. బండి సంజయ్ ఎమ్మెల్సీ కవితపై చేసిన వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలని సూచించారు. అలాగే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

అంబానీ, అదానీలకు దేశ సంపద తాకట్టు : ఏఐటీయూసీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కార్మికులు సృష్టించిన సంపదను బడా పెట్టుబడిదారులైన అదానీ, అంబానీలకు మోడీ ప్రభుత్వం దోచిపెడుతుందని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. బాలరాజ్ విమర్శించారు. లేబర్ కోడ్‌లు తెచ్చి పరిశ్రమల అధిపతులకు మేలు చేస్తున్న మోడీ ప్రభుత్వంపై శ్రామికవర్గం తిరుగుబాటు చేయాలని పిలుపునిచ్చారు. సోమవారం హైదరాబాద్‌లోని హిమాయత్‌నగర్‌లో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో ఆ యూనియన్ నేతల శిక్షణా శిబిరం ముగింపు సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న తిరోగమన విధానాలు తిప్పికొట్టేందుకు ఇతర సంఘాలను కలుపుకొని రాష్ట్ర స్థాయి సదస్సులో నిర్వహిస్తామని తెలిపారు. మే నుంచి ఆగస్టు 8 వరకు క్విట్ ఇండియా దినోత్సవంలో భాగంగా పోరుయాత్రలు, మోటర్ సైకిల్ యాత్రలు, సభలు, సమావేశాలు నిర్వహించి సంఘటిత, అసంఘటిత శ్రామికవర్గాల్లో చైతన్యం కల్పిస్తామని వెల్లడించారు. ఆగస్టు 9న హైదరాబాద్ భారీ నిరసన సభను నిర్వహించనున్నట్టు తెలిపారు. ఏఐటీయూటీసీ సీనియర్ నాయకులు రత్నాకర్ రావు మాట్లాడుతూ కార్మికవర్గం రెట్టింపు ఉత్సాహంతో సమరశీల పోరాటాలకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి యం.నర్సింహ్మా మాట్లాడుతూ కార్మికవర్గంలో సైద్ధాంతిక ఆలోచన ఉన్నప్పటికీ కార్మిక వర్గ దృక్పథాన్ని అలవర్చుకోవల్సిన అవసరం ఉందన్నారు.రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.చంద్రయ్య, పి.ప్రేంపావని వ్యవహరించారు.

కాళేశ్వరం అవినీతిపై కేంద్రం స్పందించాలి : వైఎస్ షర్మిల

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కాళేశ్వరం ప్రాజెక్ట్ పనుల్లో జరిగిన అవినీతిపై కేంద్ర ప్రభుత్వం స్పందించాలని వైఎస్ఆర్‌టీపీ అధ్యక్షులు వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని లోటస్‌పాండ్‌లోని ఆ పార్టీ కార్యాలయంలో ఆమె విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. కాళేశ్వరం ప్రాజెక్టు అద్భుతమంటూ కేసీఆర్ తెలంగాణతో పాటు దేశ ప్రజలను మోసం చేశారని విమర్శించారు.దీనిపై విచారణ జరిపించాలని కోరుతూ మంగళవారం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్టు తెలిపారు.

ఓడీఎఫ్ ప్లస్‌లో మనమే నెంబర్‌వన్

- రాష్ట్ర కీర్తి కిరీటంలో మరో కలికితురాయి : మంత్రి ఎర్రబెల్లి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఓడీఎఫ్ ప్లస్‌లో తెలంగాణ దేశంలోనే నెంబర్‌వన్‌గా నిలిచిందనీ, రాష్ట్ర కీర్తి కిరీటంలో మరో కలికితురాయి అని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన 4 తాజా సర్వేల్లో మరోసారి తెలంగాణ ప్రతిభ కనబర్చిందని పేర్కొన్నారు. ఓడీఎఫ్ ప్లస్ గ్రామాలు, ఇండ్ల విభాగాల్లో 100 శాతం స్వచ్ఛత, స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ సర్వే లోనూ 100 శాతం స్వచ్ఛత సాధించామని తెలిపారు.దేశంలో అత్యధిక టాయిలెట్స్ ఉన్న ఐదు రాష్ట్రాల్లో తెలంగాణ మొదటి స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. డబుల్ ఇంజిన్‌తో పని లేకుండానే డబుల్ ప్రతిభ కనబర్చటం గొప్ప పరిణామం అని పేర్కొన్నారు. కేంద్రానికి, సీఎం కెసిఆర్, మంత్రి కేటీఆర్, హరీశ్ రావుకు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. అవార్డులు ఇవ్వటమే కాదు, నిధులు కూడా ఇవ్వాలంటూ యథావిధిగా ఆయన కేంద్రానికి చురకలు వేశారు. పంచాయతీరాజ్ అధికారులు, ఉద్యోగులను అభినందించారు. డబుల్ ఇంజిన్‌కు, డబుల్ పని చేస్తున్న సర్కార్లకు ఇదీ తేడా అంటూ మంత్రి హరీశ్‌రావు ట్వీట్ చేశారు.

కన్నతండ్రి సజీవ దహనం

- ఆస్తికోసం కూతుర్ల ఘాతుకం?
- అర్ధరాత్రి వేళ.. పోస్టుమార్టం
- ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తుల నిరసన



(ఫైల్)

నవతెలంగాణ-రాజంపేట్

ఆస్తికోసం కూతుర్లు దారుణానికి ఒడిగట్టారు. కన్నతండ్రి అని చూడకుండా ఏకంగా సజీవ దహనం చేశారు. ఈ ఘటన కామారెడ్డి జిల్లా రాజంపేట్ మండల కేంద్రంలో ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. స్థానికులు, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన కొప్పుల ఆంజనేయులుకు (70) ముగ్గురు కూతుర్లు. కొడుకు కొన్ని రోజుల కిందట తన వ్యవసాయ పొలంలో ఆత్మహత్య చేసుకున్నాడు. మొదటి భార్య కూతుళ్లు సరిగ్గా చూసుకోకపోవడంతో రెండో పెళ్లి చేసుకున్న ఆంజనేయులు.. కొన్ని రోజులుగా రెండో భార్యతోనే ఉంటున్నాడు. కాగా, కొద్దిరోజులుగా మొదటి భార్య కూతుర్లు తమకు ఆస్తి ఇవ్వాలని ప్రతిరోజూ గొడవ చేస్తున్నారు. ఆదివారం చిన్న కూతురు బిడ్డ వివాహ విందు కార్యక్రమం జరగగా ఆదివారం మధ్యాహ్నం సమయంలోనే తండ్రిని చంపి ఇంటికి తాళం వేసి పథకం ప్రకారం వివాహం విందుకు వెళ్లినట్టు గ్రామస్తులు పేర్కొంటున్నారు. వివాహ విందు నుంచి వచ్చిన అనంతరం పెట్రోల్ పోసి ఇంటికి నిప్పు పెట్టినట్టుగా గ్రామస్తులు గుర్తించడంతో వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. అక్కడికి చేరుకున్న పోలీసులు జేసీబీ సహాయంతో ఇంటిని కూల్చేశారు. మాంసం ముద్దతో ఉన్న ఆంజనేయులు మృతదేహాన్ని బయటకు తీశారు. తల, మొండెం వేరువేరుగా ఉండటంతో హత్య చేసినట్టు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. కాగా అర్ధరాత్రి సమయంలో పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించడంపై గ్రామస్తులు, బంధువులు ఆందోళన చేపట్టారు. ఎస్ఐని విధుల నుంచి వెంటనే తొలగించాలని మృతుని ఇంటి ఎదుట ధర్నా చేపట్టారు. సంఘటనపై ఎస్ఐని సస్పెండ్ చేస్తామని డీఎస్పీ హామీ ఇవ్వడంతో గ్రామస్తులు, కులస్తులు ఆందోళన విరమించారు. కాగా మృతుని అన్న కొడుకు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు పోలీసులు తెలిపారు.

కుక్కల దాడిలో బాలుడు మృతి



(ఫైల్)

నవతెలంగాణ-రఘునాథపాలెం/మధిర


ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం పుటాని తండా గ్రామపంచాయతీలో కుక్కల దాడిలో బాలుడు మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బానోతు రవీందర్ - సంధ్య దంపతుల చిన్న కుమారుడు భరత్(5) గ్రామంలో ఆదివారం సాయంత్రం పిల్లలతో ఆడుకుంటుండగా వీధి కుక్కలు ఆ బాలుడిపై దాడి చేశాయి. గమ నించిన స్థానికుల సమాచారంతో తల్లిదండ్రులు.. హుటాహుటిన, ఖమ్మంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితిని గమనించిన వైద్యులు వెంటనే హైదరాబాద్‌లోని నిమ్స్ హాస్పిటల్‌కి తరలించాలని సూచించారు. కుటుంబ సభ్యులు వెంటనే ఆర్టీసీ బస్సులో వెళుతుండగా సూర్యాపేట సమీపంలో బస్సులోనే ఆ బాలుడు మరణించాడు. అక్కడ నుంచి ఆ బాలుడిని స్వగ్రామానికి తీసుకువచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. గ్రామంలో విషాదఛాయలు కలుముకున్నాయి. వీధి కుక్కలను చూసి గ్రామస్తులు ముఖ్యంగా పిల్లలు భయభ్రాంతులకు గురవుతున్నారు. వెంటనే ప్రభుత్వ అధికారులు స్పందించి గ్రామంలో ఉన్న కుక్కలను నియంత్రించాలని కోరుతున్నారు.

చిన్నారిపై వీధి కుక్కల దాడి

మధిర మున్సిపాలిటీలోని జిలుగుమాడులో సోమవారం ఉదయం ఇంటి ముందు ఆడుకుంటున్న ఐదేండ్ల చిన్నారి దోర్నాల వివేక్‌పై వీధి కుక్కలు వెంటపడి దాడి చేసి చేతిని గాయపరిచాయి. గమనించిన బాలుని తండ్రి దోర్నాల రాము.. కుక్కలను తరిమి కొట్టి తన కుమారుడిని రక్షించుకున్నాడు. ఈ సందర్భంగా చిన్నారి తండ్రి మాట్లాడుతూ.. గ్రామంలో అనేక సంఖ్యలో వీధికుక్కలు తిరుగుతున్నాయని, బయటికి రావాలంటే భయభ్రాంతులకు గురవుతున్నామని, వెంటబడి తరిమి కరుస్తున్నాయని తెలిపారు.

మార్గదర్శిపై కేసుల్లో కఠిన చర్యలు తీసుకోం

రామోజీరావు, శైలజలకు హైకోర్టులో ఊరట



నవతెలంగాణ - హైదరాబాద్

ఆంధ్రప్రదేశ్‌లో మార్గదర్శి చిట్ ఫండ్స్ సంస్థపై అక్కడి సీఐడీ నమోదు చేసిన కేసుల వ్యవహారం తెలంగాణ హైకోర్టుకు చేరింది. ఏపీలో కేసుల నేపథ్యంలో ఇక్కడి హైకోర్టులో కేసు వేసేందుకు ఉన్న పరిధిపై ఉన్న చట్టబద్ధతను తేల్చుతామని ప్రకటించింది. విచారణను ఈనెల 20వ తేదీకి వాయిదా వేసింది. అప్పటి వరకు ఏపీ ప్రభుత్వం పిటిషనర్లపై చర్యలు తీసుకోబోమంటూ హామీ ఇవ్వాలనీ, లేనిపక్షంలో తామే మధ్యంతర ఉత్తర్వులిస్తామనీ ప్రకటించింది. ఈనెల 20వ తేదీ వరకు మార్గదర్శి చిట్‌ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్, రామోజీరావు, శైలజలపై చర్యలు తీసుకోబోమని ఏపీ ప్రభుత్వ ప్లీడర్ గోవింద్‌రెడ్డి హామీ ఇచ్చారు. దీనిని న్యాయమూర్తి జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి నమోదు చేసుకుని విచారణను ఈనెల 20వ తేదీకి వాయిదా వేశారు. ఏపీలో ఈనెల 10 తేదీన నమోదైన కేసుల దర్యాప్తులో భాగంగా అరెస్టు సహా బలవంతపు చర్యలు చేపట్టకుండా, హైదరాబాద్‌లోని తమ ప్రధాన కార్యాలయంలో తనిఖీలు చేపట్టకుండా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ రామోజీరావు, శైలజ వేసిన లంచ్‌మోషన్ పిటిషన్లను ఆయన సోమవారం విచారణ జరిపారు.నేరం జరిగినట్టుగా ప్రాథమికంగా ఆధారాలున్నాయని గోవింద్‌రెడ్డి చెప్పారు. తెలంగాణలో సోదాలు చేసే అధికారం ఏపీ పోలీసులకు లేదని పిటిషనర్ల సీనియర్ లాయర్ దుర్గాప్రసాద్ చెప్పారు. ఖాతాదారుల నుంచి ఎలాంటి ఫిర్యాదు అందలేదనీ, అయినా తనిఖీలు చేయటం చట్ట వ్యతిరేకమన్నారు. ఎఫ్ఐఆర్‌లో ఏ1గా రామోజీరావు, ఏ2గా శైలజ పేర్లున్నాయన్నారు. విచారణను ఈనెల 20వ తేదీకి వాయిదా వేశారు.

అవినాష్ రెడ్డిని అరెస్టు చేయొద్దు

మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డిని తిరిగి ఆదేశాలిచ్చే వరకు అరెస్ట్ చేయరాదని సీబీఐకి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లక్ష్మణ్ సోమవారం ఆదేశించారు. సీబీఐ విచారణకు హాజరుకావాలన్న ఉత్తర్వులపై స్టే ఇవ్వాలనీ, విచారణకు హాజరైతే ఆడియో, వీడియో రికార్డింగ్ చేసేలా సీబీఐకి ఉత్తర్వులివ్వాలని కోరుతూ అవినాష్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై తీర్పును హైకోర్టు వాయిదా వేసింది. వివేకా కుమార్తె సునీత దాఖలు చేసిన పిటిషన్ వెనుక సీబీఐ ప్రమేయముందని ఎంపీ లాయర్ వాదించారు. వివేకా హత్య వెనుక ఆయన అల్లుడు రాజశేఖర్‌రెడ్డి, హతుడి రెండో భార్య షమీమ్ పాత్రపై సీబీఐ విచారణ చేయడం లేదని ఆరోపించారు. ఇప్పటి వరకు జరిపిన దర్యాప్తు వివరాలను సీల్డ్ కవర్‌లో సీబీఐ హైకోర్టుకు ఇచ్చింది. హత్య ఘటనాస్థలంలో లభ్యమైన లేఖ, ఎఫ్ఎస్ఎల్ నివేదికలను కూడా అందజేసింది.

తెలుగు పాటకు ఆస్కార్ అవార్డు రావడం అభినందనీయం: బి.వెంకట్

న్యూఢిల్లీ: తెలుగు పాటకు ఆస్కార్ అవార్డు రావడం అభినందనీయమని వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ అన్నారు. ఈ మేరకు ఆయన సోమవారం ప్రకటన విడుదల చేశారు. తెలుగు సాహిత్యానికి, తెలుగు చిత్ర పరిశ్రమకు ఆస్కార్ అవార్డుతో అత్యంత గౌరవాన్ని అందించిన నాటు నాటు పాట రచయిత, గాయకులు, చిత్ర బృందానికి అభినందనలు తెలియజేశారు. తెలుగు పాటకు ఆస్కార్ అవార్డు దక్కటం పట్ల ఆనందాన్ని వ్యక్తం చేశారు. తెలుగు ఔన్నత్యాన్ని విశ్వవ్యాప్తం చేసి మొట్టమొదటిసారిగా ఆస్కార్ అవార్డు పొందటం తెలుగు చిత్రపరిశ్రమకే కాదు, యావత్ భారతీయ చిత్ర రంగానికి కూడా గర్వకారణమని ఆయన అన్నారు. ఈ అవార్డుతో మరిన్ని విజయాలను తెలుగు, భారతీయ చిత్ర పరిశ్రమ సాధించాలని ఆకాంక్షించారు. అందుకు ప్రభుత్వాలు కూడా తగినంత సహాయ సహకారాలు, ప్రోత్సాహకాలు అందించాలని కోరారు. ఈ ఆస్కార్ ఉన్నత గౌరవం తెలుగు చిత్ర పరిశ్రమ బాధ్యతను పెంచిందని అన్నారు.

బిజినెస్

గృహ రుణాలపై బిఒఎం వడ్డీ రేట్ల తగ్గింపు



హైదరాబాద్: ప్రభుత్వ రంగంలోని బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర (బిఒఎం) గృహ రుణాలపై వడ్డీ రేట్లను తగ్గించినట్లు ప్రకటించింది. ప్రస్తుతం ఇంటి రుణాలపై 8.6 శాతంగా ఉన్న వడ్డీ రేటును 8.4 శాతానికి కోత పెట్టినట్లు పేర్కొంది. కొత్త వడ్డీ రేట్లు మార్చి 13 నుంచి అమల్లోకి వచ్చాయని వెల్లడించింది. బ్యాంకింగ్ పరిశ్రమలోనే ఈ వడ్డీ రేటు తక్కువని బిఒఎం పేర్కొంది. రక్షణ రంగంలోని ఉద్యోగులు, పెన్షనర్లకు మరింత ఆకర్షణీయ వడ్డీ రేట్లతో గృహ రుణాలు అందిస్తున్నట్లు తెలిపింది. ప్రాసెసింగ్ ఫీజును కూడా రద్దు చేసినట్లు తెలిపింది.

అమెజాన్ నుంచి ఈకోడాట్ స్మార్ట్ స్పీకర్



హైదరాబాద్: భారత్‌లో అలెక్సా ఐదవ వార్షికోత్సవాన్ని పురస్కరించు కుని అమెజాన్ సరికొత్త సౌండింగ్‌తో ఈకో డాట్ 5వ జనరేషన్‌ను విడుదల చేసినట్లు తెలిపింది. ఇది అత్యంత స్పష్టమైన ధ్వనిని అందించ నున్నట్లు పేర్కొంది. అమెజాన్‌లో అందిస్తున్న ఈ స్మార్ట్ స్పీకర్ ద్వారా వినియోగదారులు కేవలం తమ గొంతు వినియోగించి అలెక్సాను ఇంగ్లీష్, హిందీలో సంగీతం వినిపించడం, జోక్స్ వినిపించడం, గేమ్స్‌ప్లే చేయడం, స్మార్ట్ హోమ్ అప్లయెన్సస్‌ను నియంత్రించడం, టైమర్లను సెట్ చేయడం, లిస్ట్‌కు ఐటెమ్స్ జోడించడం, రిమైండర్లను సృష్టించడం, బిల్లు చెల్లింపులుచేయడం వంటివెన్నో చేయవచ్చని ఆ సంస్థ తెలిపింది. దీని ఆఫర్‌లో రూ.4,599కు అందిస్తున్నట్లు వెల్లడించింది.

అక్కో నుంచి ప్లాటినం హెల్త్ ప్లాన్

హైదరాబాద్ : రిటైల్ వైద్య బీమా రంగంలోకి ప్రవేశించిన అక్కో ఈ రంగంలోకి రాణించడానికి సిద్ధమయ్యినట్లు ప్రకటించింది. ఇందుకోసం కొత్తగా రూ.10 లక్షల నుంచి అపరిమిత బీమా మొత్తంతో ప్లాటినం హెల్త్ ప్లాన్‌ను ఆవిష్కరించినట్లు వెల్లడించింది. జీరో కమిషన్, జీరో పేపర్ వర్క్, ఇన్‌స్టంట్ రెన్యూవల్, అదే రోజు క్లెయిమ్ సెటిల్‌మెంట్ తదితర సౌలభ్యాలు అందిస్తున్నట్లు పేర్కొంది.

జ్విగాటో చిత్ర ట్రైలర్ విడుదల

హైదరాబాద్ : కపిల్ శర్మ చిత్రం 'జ్విగాటో' ట్రైలర్‌ను సోమవారం హైదరాబాద్‌లో విడుదల చేశారు. నందితాదాస్ దర్శకత్వంలో అపలాజ్ ఎంటర్‌టైన్‌మెంట్ నిర్మించిన ఈ చిత్రం భావోద్వేగాల పరంగా ప్రేక్షకులను అలరిస్తుందని చిత్ర బృందం తెలిపింది. ఓ మాజీ ఫ్యాక్టరీ ఫ్లోర్ మేనేజర్ ప్రయాణాన్ని ఈ చిత్రంలో చూడవచ్చన్నారు. ఆశ, స్థిరత్వం మరియు విడదీయలేని మానవ ఆత్మ యొక్క హృదయాన్ని కదిలించే కథ 'జ్విగాటో'. ప్రతి రోజూ ప్రజలు ఎదుర్కొనే ఇబ్బందులను ఇది ఒడిసిపడుతుందన్నారు. ఈ చిత్రం మార్చి 17న థియేటర్లలోకి రానుంది.

వైజాగ్ ఉక్కు ప్రయివేటీకరణపై తగ్గేదేలేదు

- కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి ఫగ్గన్ సింగ్ కులస్తే

న్యూఢిల్లీ : వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ నిర్ణయాన్ని పున్ణసమీక్షించే ప్రతిపాదన ఏదీ లేదని కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి ఫగ్గన్ సింగ్ కులస్తే పునరుద్ఘాటించారు. రాజ్యసభలో టీడీపీ ఎంపీ కనకమేడల రవీంద్ర కుమార్ అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల కార్మిక సంఘాలు ఆందోళన చేస్తున్నట్టు తమ దృష్టి కి వచ్చిందని ఆర్ఐఎన్ఎల్ మేనేజ్‌మెంట్ ప్లాంట్ లోని ఉద్యోగుల కార్మిక సంఘాలతో చర్చిస్తోందని తెలిపారు. 2021 జనవరి 27న ఆర్థిక వ్యవహారాల మంత్రి వర్గ కమిటీ (సీసీఈఏ) వైజాగ్ స్టీల్‌ప్లాంట్ లోని వంద శాతం పెట్టుబడుల ఉపసంహరణకు సూత్రప్రాయంగా అంగీకారం తెలిపిందని గుర్తు చేశారు. ప్రయివేటీకరణతో వ్యూహాత్మక పెట్టుబడు లను ఉపసంహరించుకోవాలని నిర్ణయించినట్టు తెలి పారు. ఆర్ఐఎన్ఎల్‌కు సంబంధించి ప్రభుత్వ నిర్ణయాన్ని సమీక్షించే ప్రతిపాదన ఏదీ లేదని స్పష్టం చేసింది. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌లో ఎగ్జిక్యూటివ్స్‌కు పదోన్నతలను అమలు చేస్తే ఏటా సుమారు రూ.13 కోట్లు వ్యయం అవుతోందని ఎంపీ జీవీఎల్ నరసింహారావు అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌లో 4,930 పోస్టులు ఖాళీ

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌లో 4,930 పోస్టులు ఖాళీగా ఉన్నాయని కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి ఫగ్గన్ సింగ్ కులస్తే తెలిపారు. సీపీఐ(ఎం) ఎంపీ వి.శివదాసన్ అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

'నాటు నాటు' పాటకు

- ఆస్కార్ రావడంపై డీజీపీ హర్షం

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి :

ఆర్ఆర్ఆర్ సినిమాలోని 'నాటు నాటు..' పాటకు ప్రపంచంలోనే ప్రతిష్టాత్మకమైన ఆస్కార్ అవార్డు రావడం పట్ల రాష్ట్ర డీజీపీ అంజనీ కుమార్ సోమవారం హర్షం వ్యక్తం చేశారు. భారత దేశంలోని తెలుగు భాషకు చెందిన ప్రాంతీయ చిత్రంలోని పాటకు కీర్తివంతమైన అవార్డు రావడం తెలుగు ప్రజలకే గాక దేశానికి కూడా గర్వకారణమని ఆయనన్నారు. ఇంతటి విఖ్యాత అంతర్జాతీయ అవార్డును సాధించినందుకు గానూ సినిమా దర్శకుడు ఎస్.ఎస్ రాజమౌళి, సంగీత దర్శకుడు కీరవాణి, పాట రచయిత చంద్రబోస్‌తో పాటు ఇతర సాంకేతిక నిపుణులకు, నటులకు ఆయన ఈ సందర్భంగా అభినందనలు తెలియజేశారు. భవిష్యత్తులో మరిన్ని అంతర్జాతీయ అవార్డులను తెలుగు చిత్ర పరిశ్రమ సాధించాలని ఆయన ఆకాంక్షను వ్యక్తం చేశారు.

వాటర్ స్పోర్ట్స్‌లో బహుమతులు సాధించిన పోలీసులకు డీజీపీ అభినందనలు

హిమాచల్‌ప్రదేశ్‌లో జరిగిన ఆలిండియా పోలీసు వాటర్ స్పోర్ట్స్‌లో పతకాలు సాధించిన రాష్ట్ర పోలీసులకు డీజీపీ అభినందనలు తెలియజేశారు. ఈనెల 6 నుంచి 12 వరకు జరిగిన ఈ వాటర్ స్పోర్ట్స్‌లో తెలంగాణ స్పెషల్ బెటాలియన్స్‌కు చెందిన పురుషోత్తమ్ రెడ్డి, మరో కానిస్టేబుల్ వెంకటేశ్‌లు వెండి పతకాలను సాధించారు. వీరిద్దరిని డీజీపీ కార్యాలయంలో జరిగిన ఒక కార్యక్రమంలో అంజనీ కుమార్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పోలీసు స్పోర్ట్స్ విభాగం అదనపు డీజీ అభిలాష బిస్త్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

నిరుద్యోగులతో టీఎస్‌పీఎస్సీ చెలగాటం : ఏఐవైఎఫ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నిరుద్యోగుల జీవితాలతో టీఎస్‌పీఎస్సీ చెలగాటమాడుతున్నదని ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి విమర్శించింది. వెబ్‌సైట్ హ్యాకింగ్, పేపర్ లీకేజీకి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వలీ ఉల్లా ఖాద్రీ, కె ధర్మేంద్ర సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వెబ్‌సైట్ హ్యాకింగ్‌కు గురికావడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేయాలనీ, పరీక్షలను పారదర్శకంగా నిర్వహించాలని కోరారు.

గెలుపెవరిది..?

ఫలితాలపై ఉత్కంఠ

- అంచనాలు తారుమారు
- 'కాసుల' పంపిణీపై చర్చోపచర్చ
- రెండో ప్రాధాన్యతా ఓట్లే కీలకం



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ ఉపాధ్యాయ నియోజక వర్గం ఎమ్మెల్సీ ఎన్నికలు ఎడతెగని ఉత్కంఠకు కారణమవుతు న్నాయి. భారీ పోలింగ్ నేపథ్యంలో అభ్యర్థుల్లో ఒకింత ఆనందం, మరికొంత ఉత్కంఠ రేపుతున్నాయి. గెలుపు తమదంటే తమదేనన్న ధీమాతో ఉన్న ఒకరిద్దరు అభ్యర్థులు ఇప్పుడు దీర్ఘాలోచనలో పడిపోయారు. మొత్తం తొమ్మిది జిల్లాల్లో ఉపాధ్యాయులు ఉత్సాహంగా ఎన్నికల్లో పాల్గొని ఓటే యడం గమనార్హం. మహిళా టీచర్లు సైతం ఈసారి ఓటేసేందుకు పోటీ పడ్డారు. సాధారణ ఎన్నికల తరహాలోనే ఉపాధ్యా య ఎమ్మెల్సీ ఎన్నికలు జరగడం, కొన్ని సంఘాల నేతలు భారీగా ఖర్చు పెట్టడం చర్చోపచర్చలకు కారణమయ్యాయి. ఎన్నికల్లో టీఎస్‌యూటీఎఫ్ తరపున పాపన్నగారి మాణిక్‌రెడ్డి, పీఆర్‌టీయూ తరపు చెన్నకేశవరెడ్డి, ఇదే సంఘం నుంచి ప్రస్తుత ఎమ్మెల్సీ కాటేపల్లి జనార్ధన్‌రెడ్డి, ఎస్టీయూ నుంచి భుజంగరావు, తపస్ నుంచి ఎవిఎన్ రెడ్డితోపాటు హర్షవర్ధన్‌రెడ్డి తదితరులతో కలిపి మొత్తం 21 మంది బరిలో నిలిచారు. ఎన్నికల అధికారులు భారీ బ్యాలెట్ పత్రాన్ని తయారుచేయాల్సి వచ్చింది. ప్రధాన అభ్యర్థులంతా ఆయా పోలింగ్ స్టేషన్లు తిరుగుతూ ఓటింగ్ సరళిని పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల ముందు అభ్యర్థులు క్యాంపులు ఏర్పాటు చేశారు. మెయిన్ గేట్ల ముందు తమ తరపున ఓట్లేయాలంటూ అను చరులను మోహరించారు. టెంట్లు వేసి మరీ పోల్‌చిట్టీలు అందించడమూ చేశారు. సాయంత్రం నాలుగు గంటల సమయానికి 90.4 శాతం పోలింగ్ కావడం అందరికి తెలిసిందే. ఓట్ల లెక్కింపు ఈనెల 16న జరగనుంది.

పోలింగ్ సరళిని ఎప్పటికప్పుడు జిల్లాల నుంచి తెప్పించుకుంటూ తమ పరిస్థితుల గురించి ప్రధాన అభ్యర్థులు అంచనావేసుకునే ప్రయత్నం చేశారు. కీలక సంఘంగా చెప్పుకునే అభ్యర్థి ఒకరు, ప్రయివేటు యాజమాన్యం నుంచి బరిలో నిలిచిన అభ్యర్థి భారీగా ఉపాధ్యాయులను ప్రలోభపెట్టారనే ప్రచారం జరిగింది. వాహనాలను ఏర్పాటు చేసి ఓట్లు వేయించుకునే ప్రయత్నం చేశారు. పోలింగ్‌కు ఒకరోజు ముందు వరకు ఆత్మీయ సమ్మేళనాల పేరుతో విందులు, వినోదాలు ఏర్పాటు చేయగా, రేపు అనగా భారీగా రూ. 2000 నుంచి రూ. 5000 వరకు డబ్బులు పంచారనే ఆరోపణలు, విమర్శలు వచ్చిన సంగతి తెలిసింతే. అలాగే అనర్హుల పేర్లు ఓటర్ల జాబితాల్లో వచ్చాయని ఫిర్యాదులు అందాయి. అలాగే ఉపాధ్యా యులు కానోళ్లు ఓటేసేరంటూ ప్రసారమాధ్యమాల్లో కనిపించడం తెలిసిందే. అలాగే ప్రయివేటు స్కూల్ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యా యులు విద్యార్హతలు లేకుండా ఓటు వేశారనే విమర్శలు వెల్లువెత్తాయి. స్థానికంగా మండలాల్లో ఉండే మండల విద్యాధికారులు కొందరు ప్రాథమిక పాఠశాలల్లో ఉండే ఉపాధ్యాయులకు ఓటు వేసేందుకు ధృవీకరించగా, మరికొందరికి తిరస్కరించారనే చర్చ నడిచింది. కాగా కొందరు తమ పలు కుబడిని ఉపయోగించి ప్రత్యర్థి సంఘాలకు చెందిన ప్రముఖ నాయకులు, ఉపాధ్యాయులపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసి ఓటు వేయకుండా 'డిలీటెడ్' జాబితాలో చేర్చారనే విమర్శలు చోటుచేసుకున్నాయి.

రెండో ప్రాధాన్యత ఓట్లే కీలకం

పోలింగ్ ముగిసే సమయానికి తాము కచ్చితంగా గెలుస్తామనే నమ్మకం అభ్యర్థుల్లో లేకుండా పోయిందని సమాచారం. కొన్ని ఓట్లు చీలి పోవడం, మరికొంత మంది ఓటింగ్‌కే రాకపోవడంతో పున:రాలోచన లో పడ్డారు. రెండో ప్రాధాన్యత ఓట్లపైనే గెలుపోటములు ఆధారపడి ఉండ నున్నాయి. మొత్తం 27,700కుపైగా ఓట్లు ఉండగా, సోమవారం పోలింగ్ లో 26,861 మంది ఉపాధ్యాయులు ఓటేశారు. అంటే అభ్యర్థులెవరైనా విజయం సాధించాలంటే పోలైన ఓట్లల్లో తొలి ప్రాధాన్యత కింద కనీసం 13 వేల ఓట్లు రావాల్సి ఉంటుంది. కాగా, ఇప్పుడు పోటీలో ఉన్న ప్రధాన అభ్యర్థుల్లో ఎవరికీ అన్ని ఓట్లు వస్తాయనే విశ్వాసం కనిపించడం లేదు. ప్రధాన సంఘాలకు చెందిన ఇద్దరు అభ్యర్థులకు 6000 నుంచి 7000 ఓట్లు మాత్రమే వచ్చే అవకాశం ఉందని ఉపాధ్యాయ సంఘాల విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అంటే అప్పుడు రెండో ప్రాధాన్యతకు పోవాల్సి ఉంటుంది. గత ఎన్నికల్లోనూ ఇలాగే జరిగిందనే అభిప్రాయాలు వ్యక్తమవు తున్నాయి.

28 టేబుళ్లు..

కౌంటింగ్ ఈనెల 16న సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో జరగ నుంది. దాదాపు 26 టేబుళ్లు ఏర్పాటు చేస్తున్నారు. కౌంటింగ్ మధ్యాహ్నం తర్వాత ప్రారంభం కానుంది. అంతకు ముందు ఓట్లను టాలీ చేసుకోవడం, కట్టలు కట్టడం తదితర అంతర్గత పనులు చేయాల్సి ఉంటుంది. ఈనేపథ్యంలో లెక్కింపు జరిగి ఫలితాలు వచ్చేసరికి రాత్రి తొమ్మిది గంటలు దాటే అవకాశం ఉందని సమాచారం. ఈ మేరకు ఇండోర్ స్టేడియంలో కౌంటింగ్ సన్నాహాలతోపాటు భద్రతా ఏర్పాట్లు చేశారు.

పిళ్లైకి మూడు రోజుల కస్టడీ పొడిగింపు

బలమైన వ్యక్తిని విచారణకు పిలిచినప్పుడు పిళ్లై స్టేట్‌మెంట్ మార్చుకున్నారు :ఈడీ

న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్టయిన అరుణ్ రామచంద్ర పిళ్లై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కస్టడి మరో మూడు రోజులు పొడిగించారు. ఈడీ కస్టడీ సోమవారంతో ముగియ డంతో ఈడీ అధికారులు పిళ్లైని మరోసారి రౌస్ అవెన్యూలోని సీబీఐప్రత్యేక కోర్టులో హాజరు పర్చారు. దీంతో న్యాయస్థానం పిళ్లై కస్టడీని మరో మూడు రోజులు పొడిగించింది. ఇదే కేసుకు సంబంధించి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితను శనివారం విచారించిన ఈడీ అధికారులు 16వ తేదీన మళ్లీ విచారణకు రావాలని ఆమెను ఆదేశించారు. అంతకు ముందు రోజే (మార్చి 15న) కవిత ఆడిటర్ బుచ్చిబాబుతో కలిపి పిళ్లైను విచారించనున్నారు. కవిత విచారణ రోజు వరకూ పిళ్లై కస్టడీ పొడిగించడంతో ఆమెతో కలిపి విచారణ జరిపే అవకాశం ఉన్నది. మరోవైపు ఈడీ తన వద్ద తీసుకున్న వాంగ్మూలాన్ని ఉపసంహరించు కునేందుకు అవకాశం ఇవ్వాలని పిళ్లై సీబీఐ ప్రత్యేక కోర్టులో పిటిషన్ దాఖలు చేయడంతో దీనిపై సోమవారం విచారణ జరిగింది. ఇప్పటికే ఈడీ 29 సార్లు పిళ్లైని విచారణకు పిలిచి 11 సార్లు స్టేట్‌మెంట్ రికార్డు చేసిందని ఆయన తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. పిళ్లై ఇప్పటికే ఈ కేసు విచారణకు సహకరించారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఇతర నిందితులతో కలిపి ప్రశ్నిస్తే... విచారణలో న్యాయవాది కూడా ఉండాలని పిళ్లై తరపు న్యాయవాది కోర్టును కోరారు. గత వారం కస్టడీతో కలిపి 36 సార్లు పిళ్లై కేసు విచారణకు హాజరయ్యారని చెప్పారు. హెూటల్ రికార్డులు చూపించి మద్యం కేసు పిళ్లైకి ఆపాదించాలని చూస్తున్నారని పిళ్లై తరపు న్యాయవాది వాదించారు. అయితే కీలక సమయంలో వాంగ్మూలాల ఉపసంహరణ కోసం అప్లికేషన్ దాఖలు చేశారని ఈడీ తరపు న్యాయవాది న్యాయస్థానానికి తెలిపారు. పిళ్లై విచారణకు సంబంధించి సీసీటీవీ ఫుటేజీ, ఆధారాలు కూడా ఉన్నాయన్నారు. విచారణ సమయంలో పిళ్లై తోపాటు ఆయన న్యాయవాదికి అనుమతి ఇవ్వాలన్న వాదనను వ్యతిరేకించిన వ్యతిరేకించారు.

ఇప్పుడు స్టేట్‌మెంట్ వెనక్కి తీసుకుంటామంటున్నారని, కానీ బలవంతం చేసి పిళ్లై స్టేట్‌మెంట్ రికార్డు చేయలేదని కోర్టు దృష్టికి ఈడీ తీసుకెళ్లింది. పిళ్లై వాంగ్మూలం రికార్డ్ చేసేందుకు అన్ని నిబంధనలు పాటించామనీ, భయపెట్టి, బలవంతం చేసి పిళ్లై వాంగ్మూలం తీసుకోలేదని స్పష్టం చేసింది. మొదటి సారి గతేడాది సెప్టెంబర్ 18న పిళ్లై స్టేట్‌మెంట్ రికార్డు చేశామని, ముడుపుల వ్యవహారంలో పిళ్లై కీలకపాత్ర పోషించారని, ముడుపుల్లో ప్రధాన పాత్రదారి పిళ్లై అని ఈడీ న్యాయస్థానానికి స్పష్టం చేసింది. పిళ్లై, బుచ్చిబాబు కలిసి మద్యం పాలసీ రూపకల్పనలో భాగస్వాములుగా ఉన్నారని, బుచ్చిబాబు ఇచ్చిన సమాచారం ఆధారంగా పిళ్లైని, బుచ్చిబాబును ప్రశ్నించాల్సి ఉందని ఈడీ తెలిపింది. న్యాయవాదుల సమక్షంలో పిఎంఎల్ఏ సెక్షన్ 50 ప్రకారం నిందితుల విచారణ జరగదన్న ఈడీ స్పష్టం చేసింది. గత ఏడాది సెప్టెంబర్ 18న పూర్తి స్టేట్‌మెంట్ నమోదు చేశామని, రెండోసారి, మూడో దఫా ఇచ్చిన వాగ్మూలంలో కూడా వివరాలను ఖరారు చేశారని ఈడి తెలిపింది. పిళ్లైని టార్చర్ చేస్తే మిగిలిన స్టేట్‌మెంట్‌లో అవే విషయాలను ఎలా కన్ఫర్మ్ చేస్తారని ఈడీ ప్రశ్నించింది. మార్చి తరువాతే స్టేట్‌మెంట్ మార్చుకున్నారని, ఎందుకు మార్చుకున్నారో తెలుసని ఈడీ కోర్టు దృష్టికి తీసుకెళ్లింది. బలమైన వ్యక్తిని విచారణకు పిలిచినప్పుడు పిళ్లై తన స్టేట్‌మెంట్ మార్చుకున్నారని ఈడీ కోర్టుకు తెలిపింది.

ఎన్నికల కోడ్ పూర్తి కాగానే ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రి కొత్త బ్లాక్ ప్రారంభం

- మంత్రి హరీశ్ రావు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎన్నికల కోడ్ పూర్తి కాగానే 300 పడకలతో ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రి కొత్త బ్లాక్‌ను ప్రారంభించనున్నట్టు వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్ రావు తెలిపారు. సోమవారం ఆయన నిమ్స్, క్యాన్సర్ ఆస్పత్రుల పనితీరుపై నెలవారీ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడు తూ మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్‌ను ఎక్కువగా జిల్లాల్లో నిర్వహించాలనీ, కొత్తగా ప్రారంభించిన మాడ్యులర్ థియేటర్లు పూర్తి స్థాయిలో పని చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిమ్స్ అంతర్గత ఆన్‌లైన్ విధానా న్ని ప్రారంభించేందుకు సమగ్ర విధానాన్ని రూపొందించాలని ఆదేశించారు. ఐపీ, ఓపీ పేషెంట్ల వివరాలను విభాగాల వారీగా ఎప్పటికప్పుడు తెలపాలని సూచించారు. ఎమర్జెన్సీ పడకల నిర్వహణ మరింత మెరుగుపరచాలని సూచించారు. నిమ్స్ కార్డియోథొరాసిక్ సర్జరీ విభాగం, నిలోఫర్ పీడియాట్రిక్ విభాగం కలిసి యూకే వైద్య బృందం సహకారంతో చిన్నారులకు గుండె సర్జరీలు నిర్వహించడం గొప్ప విషయమని గుర్తుచేస్తూ, అవసరమైన వారికి చికిత్స అందించేలా ప్రణాళిక రూపొందించుకోవాలని ఆదేశించారు. దూర ప్రాంతాల నుంచి వస్తున్న వారికి సైతం అదే రోజు ఓపీ, కన్సల్టేషన్, పరీక్షలు, డాక్టర్ మెడికల్ అడ్వైస్ పూర్తయ్యేలా రివ్యూ ఓపీ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. స్కోలియోసిస్ (గూని) సమస్య ఉన్నవారిని గుర్తించి.... మూడేండ్లలో 200 మందికి సర్జరీలు నిర్వహించిన నిమ్స్ ఆర్థో విభాగం వైద్య బృందాన్ని అభినందించారు. అవయవదాతలు, అవయవమార్పిడి శస్త్రచికిత్సల విషయంలో 2022 ఏడాదికి తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిందనీ, దీని వెనుక నిమ్స్ కృషి చాలా ఉందనీ, ఇందుకు కృషి చేస్తున్న జీవన్‌దాన్ కో ఆర్డినేటర్ డాక్టర్ స్వర్ణలత, డీఎంఈ, నిమ్స్ డైరెక్టర్‌కు అభినందనలు తెలిపారు. సమీక్షా సమావేశంలో ఆరోగ్య కుటుంబ సంక్షేమ విభాగం కమిషనర్ శ్వేతా మహంతి, నిమ్స్ డైరెక్టర్ బీరప్ప, ఎంఎన్‌జే డైరెక్టర్ జయలత తదితరులు పాల్గొన్నారు.

లీకేజీకి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి : పీడీఎస్‌యూ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) ఆధ్వర్యంలో జరిగే టీపీవో నియామక పరీక్ష పేపర్ లీకేజీ ఘటనపై ప్రభుత్వం సమగ్ర విచారణ చేసి లీకేజీకి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పెద్దింటి రామకృష్ణ, నామాల ఆజాద్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో లక్షలాదిమంది నిరుద్యోగులు ఉపాధి కోసం పడిగాపులు కాస్తూ, పస్తులుండి సన్నద్ధమవుతున్న తరుణంలో టీఎస్‌పీఎస్సీ వారి జీవితాలతో చెలగాటమాడుతుందని విమర్శించారు. కనీసం పరీక్షలు కూడా సక్రమంగా నిర్వహించలేని దుస్థితి రాష్ట్రంలో నెలకొందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం లీకేజీల పరంపరను అడ్డుకోకపోతే నిరుద్యోగుల ఆగ్రహానికి బలికాక తప్పదని హెచ్చరించారు. పరీక్షలు కూడా సమగ్రంగా నిర్వహించని టీఎస్‌పీఎస్సీ ఎందుకని ప్రశ్నించారు. తక్షణమే టీపీవో పరీక్ష పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ టీఎస్‌పీఎస్సీని ప్రభుత్వం బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి తక్షణమే స్పందించాలని కోరారు.

సమగ్ర విచారణ జరపాలి : డీఎడ్, బీఎడ్ అభ్యర్థుల సంఘం

పేపర్ లీకేజీ దారుణమనీ, దీనిపై సమగ్ర విచారణ జరపాలని తెలంగాణ రాష్ట్ర డీఎడ్, బీఎడ్ అభ్యర్థుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు రావుల రామ్మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 80 వేల ఉద్యోగాల్లో భాగంగా వివిధ నోటిఫికేషన్లు జారీ చేస్తూ పరీక్షలు నిర్వహిస్తున్న ఈ సమయంలో టీఎస్‌పీఎస్సీలో పనిచేస్తూ కొందరు ఉద్యోగులు పేపర్ లీకేజీకి పాల్పడడం సరైంది కాదని తెలిపారు. వివిధ నోటిఫికేషన్లకి సన్నద్ధమవుతున్న దాదాపూ 40 లక్షల మంది అభ్యర్థులను తీవ్ర ఆందోళనలో పడేశారని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి విచారణ చేసి లీకేజీకి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో అన్ని రకాల పరీక్షలను పారదర్శకంగా నిర్వహించాలని కోరారు.

70 నియోజకవర్గాల్లో ఇంటింటికీ టీడీపీ సక్సెస్:కాసాని జ్ఞానేశ్వర్



నవతెలంగాణ - హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమాన్ని ప్రారంభించి విజయవంతం చేయాలని పార్టీ నేతలను ఆ పార్టీ అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ పిలుపునిచ్చారు. సోమవారం వరకు 17 పార్లమెంటు నియోజకవర్గాల పరిధిలో 70 అసెంబ్లీ నియోజకవర్గాలలో ఈ కార్యక్రమం ప్రారంభమైందని చెప్పారు. మిగతా 49 నియోజకవర్గాలలో వెంటనే ప్రారంభించాలని సూచించారు. ఎలాంటి అలసత్వం వద్దనీ, నిర్ణీత గడువులోగా ఈ కార్యక్రమాన్ని పూర్తిచేయాలని పార్టీ శ్రేణులను ఆదేశించారు. సోమవారం ఎన్టీఆర్ భవన్ నుంచి పార్లమెంటు పరిశీలకులు, అసెంబ్లీ నియోజకవర్గ కో-ఆర్డినేటర్లు , ఇతర పార్టీ నాయకులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఇంటింటికీ టీడీపీకీ కార్యక్రమం పురోగతిని అడిగి తెలుసుకున్నారు. కొన్ని పార్లమెంటు నియోజకవర్గాలలో పార్టీ కార్యక్రమం నిర్వహణలో ఆలస్యం చేయరాదని సూచించారు. ఎవరెవరు చొరవ తీసుకుంటున్నారు?.. ఎవరెవరూ సహకరించడంలేదో చెప్పాలంటూ ఆరా తీశారు. తెలంగాణలో పార్టీ పటిష్టత కోసం ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా భావిస్తున్నామని పేర్కొన్నారు. ఈ దిశగా అన్ని స్థాయిల నాయకులను సమన్వయం చేసుకోవడం ద్వారా కార్యక్రమాన్ని అంతటా విజయవంతం చేయాల్సిన బాధ్యత పార్లమెంట్ అబ్జర్వర్లు, అసెంబ్లీ నియోజకవర్గ కో-ఆర్డినేటర్లపై ఉందన్నారు. నిర్దేశించిన మేరకు ప్రతి గ్రామం, బస్తీలో పార్టీ జెండా ఆవిష్కరణ, ఇంటింటికీ వెళ్లి మహిళలకు బొట్టు పెట్టడం, టీడీపీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల కరపత్రాల పంపిణీ, వార్డు స్థాయి నుంచి మండల, డివిజన్ స్థాయిలో పార్టీ కమిటీల నియామక ప్రక్రియ పక్కగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

యూనివర్సిటీ నియామకాల బిల్లును గవర్నర్ ఆమోదించాలి : బాల్క సుమన్ డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

యూనివర్సిటీ నియామకాలను కామన్ రిక్రూట్ బోర్డు ద్వారా భర్తీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన బిల్లును ఆమోదించాలని ప్రభుత్వ విప్ బాల్కసుమన్ గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర రాజన్‌ను డిమాండ్ చేశారు. సోమవారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బిల్లును పెండింగ్‌లో పెట్టడం ద్వారా దుర్మార్గంగా వ్యవహరిస్తున్న గవర్నర్ తీరు పట్ల విద్యార్థులు ఆగ్రహం, ఆవేదనతో ఉన్నారని తెలిపారు. ఇప్పటికే విద్యా శాఖ మంత్రి , అధికారులు ఆమెను కలిసి బిల్లు గురించి వివరించినప్పటికీ ఉలుకూ పలుకూ లేకుండా నిరుద్యోగ యువకుల ఆశల మీద నీళ్ళు చల్లేలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

ఇతర రాష్ట్రాల్లో ఉండగా...

కేంద్రంలో వివిధ శాఖల్లో 9.77 లక్షల ఖాళీలు ఉన్నట్టు పార్లమెంట్‌లో తెలిపిన కేంద్రం వాటిని భర్తీ చేయదు..రాష్ట్ర ప్రభుత్వాన్ని కూడా భర్తీ చేయనీయడం లేదని తెలిపారు. గవర్నర్ ఉద్దేశ పూర్వకంగానే యూనివర్సిటీ రిక్రూట్ మెంట్ బిల్లును ఆపారని ఆరోపించారు.

తెలంగాణలో తెస్తే తప్పేంటి?

వేరే రాష్ట్రాల్లో కామన్ రిక్రూట్‌మెంట్ విధానం అమల్లో ఉందనీ, అలాంటప్పుడు తెలంగాణలో దాన్ని తెస్తే తప్పేంటని టీఎస్ఎంఐడీసీ చైర్మెన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ ప్రశ్నించారు. ఈ విషయంలో ఎస్సీ, ఎస్టీలకు అవకాశాలు రాకుండా బీజేపీ కుట్ర చేసిందని విమర్శించారు. ఢిల్లీ బీజేపీ నేతలు ఏం చెబితే గవర్నర్ అదే అమలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమె ఆ బిల్లు ఆమోదించక పోతే విద్యార్థులు పెద్ద ఎత్తున ఉద్యమిస్తారని హెచ్చరించారు.

సంక్షోభంలో అమెరికన్ బ్యాంకులు



వారంలో మూడు మూత

- తాజాగా సిగ్నేచర్ బ్యాంక్ దివాళా
- కొంపముంచుతున్న క్రిప్టోలు
- హెచ్ఎస్‌బిసి చేతికి ఎస్‌విబి యుకె విభాగం
- ఒత్తిడిలో స్టాక్ ఎక్సేంజీలు

వాషింగ్టన్ : పెట్టుబడిదారి ఆర్థిక వ్యవస్థ అమెరికాలో దిగ్గజ ప్రయివేటు బ్యాంక్‌లు కుప్పకూలుతున్నాయి. తాజాగా సిగ్నేచర్ బ్యాంక్ మూత పడింది. దీంతో గడిచిన వారం రోజుల్లోనే సిల్వర్ గేట్ బ్యాంక్, సిలికాన్ వ్యాలీ బ్యాంక్ (ఎస్‌విబి), సిగ్నేచర్ బ్యాంక్‌లు దివాళా తీసినట్లయ్యింది. ఈ పరిణామాలు ప్రపంచ వ్యాప్తంగా బ్యాంకింగ్ రంగంపై తీవ్ర ఆందోళనలు, భయాలు వ్యక్తం అవుతోన్నాయి. న్యూయార్క్ కేంద్రంగా పని చేస్తోన్న సిగ్నేచర్ బ్యాంక్‌ను మూత వేస్తూ.. తమ స్వాధీనంలోకి తీసుకుంటున్నామని ఆదివారం యుఎస్ ఫెడరల్ డిపాజిట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎఫ్‌ఐడిసి) ప్రకటించింది. సిగ్నేచర్ బ్యాంకులో డిపాజిటర్లు తమ సొమ్ము ఉపసంహరించుకునేందుకు అనుమతి ఇచ్చామని ఎఫ్‌ఐడిసి తెలిపింది. ఇందుకోసం తాత్కాలికంగా బ్రిడ్జి బ్యాంక్ ఏర్పాటు చేసినట్లు పేర్కొంది. కొత్తగా ఏర్పాటు చేసిన బ్రిడ్జి బ్యాంకుకు గ్రేగ్ కార్మికేల్‌ను సిఇఒగా నియమించింది. అమెరికాలో ఆర్థిక సంక్షోభానికి తోడు క్రిప్టో కరెన్సీ డిపాజిట్లతో సంబంధాలు కలిగిన బ్యాంక్‌ల పరపతి దెబ్బతింటుందని నిపుణులు పేర్కొంటున్నారు. ఈ పరిణామాలతో సోమవారం అమెరికన్ మార్కెట్లు భారీ నష్టాల్లో ప్రారంభమయ్యాయి. ఎస్అండ్‌పి సూచీ 1 శాతం పతనమయ్యింది. బ్యాంక్ షేర్లు 2-6 శాతం మేర క్షీణతను ఎదుర్కొన్నాయి.

ఏమి జరుగుతోంది..!

సిగ్నేచర్ బ్యాంక్ ఎక్కువగా క్రిప్టో డిపాజిట్లను స్వీకరించింది. 2022 డిసెంబర్ ముగింపు నాటికి 110.36 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.9 లక్షల కోట్ల పైగా) ఆస్తులతో పాటు 88.59 బిలియన్ డాలర్ల (రూ.7.30 లక్షల కోట్లు) డిపాజిట్లను కలిగి ఉంది. బ్యాంక్ మొత్తం డిపాజిట్లలో మూడో వంతు క్రిప్టో కరెన్సీ నుంచి వచ్చినవి కావడం గమనార్హం. ఈ బ్యాంక్ వద్ద 16.5 బిలియన్ డాలర్ల విలువ చేసే క్రిప్టో డిపాజిట్లు ఉన్నాయి. ఈ డిపాజిట్లను త్వరలో ఎనిమిది బిలియన్ డాలర్లకు కుదిస్తామని 2022 డిసెంబర్‌లో వెల్లడించింది. కృత్రిమ విలువ కలిగిన క్రిప్టో కరెన్సీల విలువ ఇటీవల భారీగా పతనమయ్యింది. 2018లో ఈ బ్యాంక్ క్రిప్టో ఆస్తుల డిపాజిట్ల విభాగంలోకి ప్రవేశించింది. ఇటీవల ఎఫ్‌టిఎక్స్ క్రిప్టో ఎక్సేంజీ 2022 చివరలో దివాలా తీసింది. ఈ కారణంతోనే క్రిప్టోపై అధిక దృష్టి సారించిన సిల్వర్ గేట్ బ్యాంక్ కూడా తన కార్యకలాపాలను రద్దు చేసుకుంటున్నట్లు మార్చి 8న ప్రకటించింది. ఎఫ్‌టిఎక్స్ దివాళాతో సిల్వర్ గేట్ 2022 చివరి త్రైమాసికంలో 1 బిలియన్ డాలర్లు(రూ.8వేల కోట్లు) నష్టాలు చవి చూసింది. సిల్వర్‌గేట్‌కు ఎఫ్‌టిఎక్స్ అతి పెద్ద క్లయింట్‌గా ఉంది. ఎఫ్‌టిఎక్స్ క్రిప్టో ఎక్సేంజీ, డిజిటల్ కరెన్సీ ఇన్వెస్టర్లతో ఆయా బ్యాంక్‌లు ఎక్కువగా సంబంధాలు, లావాదేవీలు కలి గి ఉన్నాయి. ఒకప్పుడు బిట్ కాయిన్ విలువ 65వేల డాలర్లు గా ఉండగా.. ఇప్పుడు ఆ విలువ 18 వేల డాలర్లకు పడిపో యింది. తాజా పరిణామంతో బిట్ కాయిన్ సహా క్రిప్టో కరెన్సీలన్నీ తీవ్ర పతనాన్ని చూడనున్నాయని నిపుణులు అంచనా వేస్తున్నారు.

పటిష్టంగానే ఆర్థిక వ్యవస్థ : బైడెన్

అమెరికా ఆర్థిక వ్యవస్థ పటిష్టంగానే ఉందని ఆ దేశ అధ్యక్షుడు జో బైడెన్ తెలిపారు. వరుసగా రెండు పెద్ద బ్యాంక్‌లు దివాళా తీయడంతో ఆయన ఈ ప్రకటన చేశారు. ఖాతాదారుల డిపాజిట్లకు డోకా లేదన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థను కాపాడటానికే సిగ్నేచర్ బ్యాంకుపై చర్యలు తీసుకుంటు న్నామన్నారు. ఎస్‌విబి, సిగ్నేచర్ బ్యాంక్‌ల పతనానికి కారణమైన వారిపై తప్పకుండా కఠిన చర్యలు తీసుకుంటా మన్నారు. ఉద్యోగులు, చిన్న వ్యాపారాలు, పన్ను చెల్లింపు దారులు సహా మొత్తం ఆర్థిక వ్యవస్థను రక్షించేలా నియంత్రణ సంస్థ లు ఒక పరిష్కారాన్ని కనుగొన్నాయని ఆయన తెలిపారు.

రూ.99కే ఎస్‌విబి విక్రయం

కేవలం ఒక్క పౌండ్ (రూ.99కి సమానం)కే ఎస్‌విబి బ్రిటన్ విభాగాన్ని హెచ్ఎస్‌బిసికి అప్పగిస్తూ ఆ దేశ బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ నిర్ణయం తీసుకుంది. దివాళా ప్రక్రియలో భాగంగా సులువుగా దీన్ని అప్పగించింది. డిపాజిటర్లకు రక్షణ కల్పించే ఉద్దేశంతో హెచ్ఎస్‌బిసికి విక్రయించినట్లు బ్రిటన్ ట్రెజరీ, బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ ఓ ప్రకటనలో తెలిపాయి. ఈ లావాదేవీలో పన్ను చెల్లింపుదారుల సొమ్ము ను ఏమాత్రం వినియోగించలేదని ట్రెజరీ చీఫ్ జెరెమీ హంట్ తెలిపారు. తక్షణమే కొనుగోలు ప్రక్రియ పూర్తయ్యిందని హెచ్ఎస్‌బిసి తెలిపింది. దీంతో అక్కడి ఎస్‌విబి ఉద్యోగులను ఖాతాదారులను హెచ్ఎస్‌బిసిలోకి ఆహ్వానిస్తున్నట్లు తెలిపింది. ఎస్‌విబి యుకె విభాగం వద్ద 5.5 బిలియన్ డాలర్ల రుణాలు, 6.7 బిలియన్ డాలర్ల డిపాజిట్లు ఉన్నాయి. మాంద్యం చాయలకు తోడు బ్యాంక్‌ల దివాళా పరిణామాలు ప్రపంచ వ్యాప్తంగా బ్యాంకింగ్ షేర్లను, స్టాక్ మార్కెట్లను కుప్పకూలేలా చేస్తున్నాయి. 2008 నాటి ప్రపంచ ఆర్థిక సంక్షోభం పునరావృతం అయ్యే ప్రమాదం లేకపోలేదని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.